RNI NO. APBIL/2013/50718

LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్

ద్విభాషా దినపత్రిక

ఎడిటర్: చిలకమర్రి రెంరెడ్డి

www.localguidenews.com

ప్రచురణ : , తెలంగాణ | సంపుటి 13, | సంచిక ,284 | పేజీలు -12 | ఆదివారం - 08 - నవంబర్ - 2026 | వెల రూ.2/-

LGTV

లోకల్ గైడ్ www.localguidenews.com తెలంగాణ

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.

ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094

విద్యార్థులకు విజయ్ సర్కార్ భారీ కానుక.. ఏకంగా రూ.2,000 కోట్లు!



- విద్యార్థుల ఉచిత ల్యాప్‌టాప్‌ల కోసం రూ.2,000 కోట్లు మంజూరు
- పథకానికి 'వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్'గా పేరు
- డిగ్రీ, డిప్లొమా మొదటి, రెండో ఏడాది విద్యార్థులకు అవకాశం
- పలు ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకూ వర్తింపు
- ల్యాప్‌టాప్‌లలో ఇంటెల్ కోర్ ఐ5 ప్రాసెసర్ ఉండేలా నిర్ణయం


కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆరే.. ఆయన హయాంలోనే అది కూలింది

"2014లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే పాలమూరు అభివృద్ధి చెందేది

- బీఆర్ఎస్ పాలనలో రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కట్టారు
- విఠల్‌రావును కాదని పాలమూరు ప్రజలు కేసీఆర్‌ను గెలిపించారు




హకీంపేట (వికారాబాద్ జిల్లా): బీఆర్ఎస్ పాలనలో రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆరేనని, కాకపోతే ఆయన హయాంలోనే అది కూలిందని చెప్పారు. ఆనాడు పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా ఎన్నుకున్నారని, విఠల్‌రావును కాదని పాలమూరు ప్రజలు కేసీఆర్‌ను గెలిపించారని అన్నారు. వికారాబాద్ జిల్లాలోని హకీంపేటలో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... "2014లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే పాలమూరు అభివృద్ధి చెందేది. పదేళ్లలో కేసీఆర్ ఏ ఒక్క ప్రాజెక్ట్ కూడా పూర్తి చేయలేదు. పాలమూరు ప్రజలకు కేసీఆర్ అన్యాయం చేశారు. సాగునీరు, తాగునీరు అందించాలన్న ఆలోచన కేసీఆర్ చేయలేదు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును కేసీఆర్ నిర్లక్ష్యం చేశారు. ఎస్ఎల్‌బీసీపై కేసీఆర్ మనసు పెట్టి ఉంటే ఎప్పుడో పూర్తయ్యేది" అని రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు.



'ఆర్టీసీ-మెట్రో' పాస్ ధర భారీగా తగ్గింపు

- నెలకు రూ.4 వేలు.. రోజువారీ రూ.275
- మెట్రోలో పరిమితంగా.. బస్సులో అపరిమితంగా..
- బీసీ స్టడీ సర్కిల్ అభ్యర్థుల స్టైపెండ్ పెంపు
- ప్రజలకు ప్రభుత్వ దీపావళి కానుక: మంత్రి పొన్నం



కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

- కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్
- రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని విమర్శ
- ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ




ఎమర్జెన్సీపై ఇన్నాళ్లకు కీలక వ్యాఖ్యలు.. ఇందిర గురించి సోనియా ఏం చెప్పారంటే?

- ఎమర్జెన్సీ అకృత్యాలపై ఇందిర క్షమాపణలు చెప్పారని సోనియా వెల్లడి
- సంజయ్ ఒక్కడినే బాధ్యుడిగా చూడకూడదని వ్యాఖ్య
- ఇందిరపై సీనియర్ నేతల ఒత్తిడి ఉండేదని వెల్లడి
- రాజీవ్ ప్రజల ఫిర్యాదులను తల్లి దృష్టికి తీసుకెళ్లేవారని వివరణ

విశాఖ వేదికగా గ్లోబల్ సమ్మిట్.. ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం

నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో 'సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్'

- 59 దేశాల నుంచి 1250 మందికి పైగా ప్రతినిధుల భాగస్వామ్యం
- ఏపీలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సమీక్ష
- వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ సహా ఆరు కీలక రంగాలపై ప్రధానంగా చర్చలు
- పారిశ్రామిక భాగస్వామ్యాల కోసం 400 బీటుబీ సమావేశాలు



విశాఖపట్నం: విశాఖపట్నం నగరం మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 31వ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరగనుంది. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే థీమ్‌తో నిర్వహించే ఈ సదస్సులో 59 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. ప్రపంచ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, సాంకేతిక నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. ఈ సదస్సు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మిగతా 2 లో

ఎమ్మెల్సీపై డెకాయిటీ కేసులా? చంద్రబాబు సర్కారుపై జగన్ ఫైర్

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టును ఖండించిన జగన్
- బ్యాలెట్ బాక్సుల తరలింపును ప్రశ్నించినందుకు అరెస్టు చేశారని ఆరోపణ
- టీడీపీ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని విమర్శ



అమరావతి: వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టును ఆ పార్టీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల అక్రమాలను ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన వారిపై తప్పుడు కేసులు బనాయించి, నిర్బంధించడం దుర్మార్గమని మండిపడ్డారు. మిగతా 2 లో



మురసు తుపాను: ఏపీకి తక్షణ సాయం అందించండి.. కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

- తక్షణమే మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి
- ప్రాథమిక అంచనాల ప్రకారం రూ. 1,919 కోట్ల నష్టం
- వారం రోజుల వ్యవధిలోనే రెండు తుపానులతో తీవ్ర నష్టం
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లినట్లు వెల్లడి

బొత్స సత్యనారాయణకు బిగ్ షాక్.. ఓటమి బాటలో కుమార్తె



- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం
- బొండపల్లి జడ్పీ స్థానంలో బొత్స కూతురు అనూష వెనుకంజ
- గరివిడిలో ఆధిక్యంలో కొనసాగుతున్న బొత్స కోడలు పూజిత



'ఈ 20 కాస్తా 420గా మారింది'.. ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి: రాహుల్ గాంధీ

పెట్రోల్‌లో పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారని ఆయిల్ కంపెనీలపై రాహుల్ ఆరోపణ

కర్ణాటక ప్రభుత్వ ల్యాబ్ టెస్టుల్లో 31శాతం వరకు ఇథనాల్ ఉన్నట్లు వెల్లడైందని వ్యాఖ్య

ప్రభుత్వ ఆదాయ లక్ష్యాలను సాధించాలి

ప్రభుత్వ ఆస్తుల సమర్థ వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- సమన్వయంతో పనిచేస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి
- భవిష్యత్తులో ప్రభుత్వ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన భూములను ముందుగానే గుర్తించాలి
- ల్యాండ్ పూలింగ్ ప్రక్రియపై పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలి



హైదరాబాద్: నిర్దేశిత గడువులోగా ప్రభుత్వ ఆదాయ లక్ష్యాలను సాధించాలని.. ఇందుకుగాను ల్యాండ్ పూలింగ్, పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ ఆస్తుల సమర్థ వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మిగతా 2 లో

RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com

సంపాదకీయం

ఎవరి రక్షణకు ఈ చట్టం?!

పౌరుల వ్యక్తిగత గోప్యత పరిరక్షించే సాకుతో కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం, దానికి అనుగుణంగా నిరుడు విడుదలైన నిబంధలు పత్రికా స్వేచ్ఛకు పాతర పెట్టేవిగా ఉన్నాయి. ఈ నిబంధనల్ని అమలు చేయటం మొదలెడితే దేశంలో తమ సంస్థలన్నీ మూతబడక తప్పదని మంగళ వారం వివిధ మీడియా సంస్థల తరఫున సర్వోన్నత న్యాయస్థానం వాదన వినిపించిన న్యాయవాది చెప్పిన మాటలు ప్రత్యక్షర సత్యాలు.

అవి మూతబడే పరిస్థితి ఏర్పడిందంటే ప్రజలకు వాస్తవ సమాచారం శాశ్వతంగా రాకుండా పోతుంది. ‘చాలావరకూ మనల్ని భయపెడుతున్న దానినే మనం ద్వేషిస్తుంటాం’ అంటాడు విలియమ్ షేక్‌స్పియర్. మీడియా విషయంలో ఇలాంటి భయాలేవో ప్రభుత్వానికి ఉన్నట్టు కనబడుతోంది. డీపీడీపీ చట్టంలో మెటా, గూగుల్ వంటి బహుళజాతి సంస్థలు ఇక్కడి సమాజం విషయంలో బాధ్యతాయుతంగా మెలగటానికి నిబంధనలు రూపొందించారు. మంచిదే. కానీ డిజిటల్ మీడియా సంస్థ లకు మినహాయింపు మాట ఇందులో లేదు. వాస్తవానికి ఇప్పుడు ప్రతి ప్రచురణ సంస్థకూ అన్ని వేదికలూ ఉన్నాయి. కనుక సారాంశంలో ఇది మొత్తం మీడియా పీకనొక్కడమే. ఈ విషయమై మొన్న ఆగస్టులో డిజిటల్ వార్తా ప్రచురణకర్తల సంఘం(డీఎన్‌పీఏ) కేంద్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. పౌరులకు వ్యక్తిగత గోప్యత ఉండితీరాలి. ఆ విషయంలో రెండో మాట లేదు. కానీ దానికి రక్షణ కల్పిస్తున్నట్టు కనబడుతూనే మీడియా స్వేచ్ఛను అరికట్టాలని చూడటం అనైతికం. ఇటీవల కొన్ని మీడియా సంస్థల పోకడలు ఆందోళన కలిగించేవే. మీడియా స్వేచ్ఛ అంటే ఇష్టానుసారం ఏది పడితే అది రాసే స్వేచ్ఛ కానే కాదు. జరిగిన ఉదంతానికీ, మాట్లాడిన మాటలకూ స్వీయ వ్యాఖ్యానాలు జోడించి వక్రీకరించే స్వేచ్ఛ అంతకన్నా కాదు. మీడియా స్వేచ్ఛ అనేది రాజ్యాంగంలోని 19(1)(ఏ) అధికరణం ద్వారా ప్రజలకు సమకూరిన హక్కు. దీన్ని దుర్వినియోగంచేసి వక్రమార్గంలో పోయే మీడియా సంస్థల విశ్వసనీయత త్వరలోనే అడుగంటుతుంది. అందుకే అత్యధిక మీడియా సంస్థలు తమకుండే పరిమితుల్లోనే శక్తివంచన లేకుండా బాధ్యతగా వ్యవహరిస్తున్నాయి. డిజిటల్ డేటా పరిరక్షణ చట్టమైనా, దానికి అనుగుణంగా రూపొందిన నిబంధన లైనా చిత్రంగా ఉన్నాయి. ఎవరైనా తప్పుడు చర్యకు పాల్పడ్డారని పాత్రికేయులకు సమాచారం అందితే, ఆ వ్యవహారంపై పరిశోధించే ముందు సంబంధిత వ్యక్తి అనుమతి కోరాలట! అప్పటికే కథనాలేమైనా రూపొందించివుంటే తొలగించాలట. అంతేకాదు... ఆ సమాచారం ఎలా వచ్చిందో చెప్పాలట. దీని ప్రకారం ఆంగ్ల దినపత్రిక ‘ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ ఎన్నికల సంఘం అస్తవ్యస్థ నిర్వహణపైనా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్ష నిర్ణయాలపైనా గత నెల 23న ప్రచురించిన సమాచారాన్నిముందుగా ఆయనగారికి సమర్పించాలి.

ప్రచురించటానికి అనుమతి కోరాలి. పైగా ఆ సమాచారం ఎలావచ్చిందో చెప్పాలి. పెద్ద మనసుతో ఆయన తొలుత అనుమతించినా... ఏ దశలోనైనా దాన్ని ఉపసంహరించుకోవచ్చు కూడా! ఇదేమైనా బాగుందా? 80వ దశకం చివర మీడియాలో బద్దలైన బోఫోర్స్ శతఘ్నుల కుంభకోణం, యూపీఏ ప్రభుత్వానికి చుక్కలు చూపించిన 2జీ స్కామ్ వగైరాలతో రాజకీయంగా నిండా బాగుపడిన బీజేపీ సారథ్యంలో ఉన్న సర్కారు ఇలాంటి చట్టం చేసిందంటే నమ్మశక్యంగాదు. అటు నుంచి ఇటొస్తే అన్నీ తేడాగా కనబడతాయి కాబోలు!

ఈ చట్ట నిబంధనలు కేవలం మీడియాపై దాడితోనే ఆగవు. వాటి పర్యవసానాలు ముందూ మునుపూ సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ)పైనా ఉంటాయి. గతంలో వ్యక్తిగత సమాచారాన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో నిరాకరించవచ్చునీ, ప్రజాప్రయోజనం ఇమిడి ఉన్న సందర్భాల్లో మాత్రం ఇందుకు మినహాయింపు ఉంటుందనీ నిబంధన ఉండేది. ఇప్పుడు డీపీడీపీ చట్టంలోని 44(3) నిబంధన ఆ మినహాయింపును ఆవిరిచేసింది. ప్రజాప్రయోజనం ఉన్నా సరే... అధికారులు వద్దంటే అంతే సంగతులన్నమాట! ఇప్పటికే పత్రికా స్వేచ్ఛలో మనం పాకిస్తాన్, పాలస్తీనా వగైరాల కన్నా అట్టడుగునున్నాం. ఇంకా అధోగతికి పోవాలనా ఈ చట్టం? ఈ అప్రజాస్వామిక నిబంధనల్ని ఇకనైనా ఉపసంహ రించుకోవటం ఉత్తమం.

మీరు చేసే నిర్బంధాలు దుర్మార్గం..

మీ పాలన హేయం: వైఎస్ జగన్



తాడేపల్లి: వైఎస్సార్‌సీపీ శాసనమండలి సభ్యుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అక్రమ అరెస్టును, నిర్బంధాన్ని పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఎన్నికల అక్రమాలను ప్రశ్నిస్తూ పార్టీ అభ్యర్థులతో, ప్రజలతో కలిసి శాంతియుతంగా ఆందోళన చేస్తే, దానిపై తప్పుడు కేసులు పెట్టి, అడ్డగోలుగా అరెస్టు చేసి, నిర్బంధానికి గురిచేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఎమర్జెన్సీని తలపించే ఈ పాలన అత్యంత హేయమంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్ జగన్.. ఈ మేరకు ట్వీట్ చేశారు.


“గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలో గురువారం పరిషత్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత, నేరుగా నాగార్జున వర్శిటీకి చేరాల్సిన బ్యాలెట్ బాక్సులను మధ్యలో నల్లపాడు వద్ద ఎందుకు దింపారు? ఎవరి ఆదేశాలమేరకు ఆ బ్యాలెట్ బాక్సులను దింపారు? అసలు బ్యాలెట్ బాక్సులకు ఉండాల్సిన భద్రత ఏమైంది? స్ట్రాంగ్ రూంకు చేరాల్సిన బ్యాలెట్ బాక్సులు నడిరోడ్డుమీద కనిపిస్తే, కళ్లెదుటే వాటిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మా పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు, ప్రజలమీద లాఠీఛార్జి చేస్తారా? తప్పులు మీరుచేసి, ఏకంగా బ్యాలెట్ బాక్సులు మార్చే ప్రయత్నంచేసి, మళ్లీ మావాళ్లపై అక్రమకేసులా? చివరకు ఒక ఎమ్మెల్సీమీద డెకాయిటీ, దొంగతనం కేసులుకూడా పెడతారా? ఇంతకంటే దుర్మార్గం ఏముంటుంది” అని వైఎస్ జగన్ ప్రశ్నించారు.

ఎన్నికల అక్రమాలు దాచిపెట్టలేరు..

ఈ స్థానిక ఎన్నికల్లో... నామినేషన్లు రిగ్గింగ్, నామినేషన్ల స్క్రూట్నీ రిగ్గింగ్, పోలింగ్ బూత్‌ల రిగ్గింగ్, పోలింగ్ సైక్లింగ్, పోలింగ్ పర్సంటేజీల రిగ్గింగ్, చివరకు పోలింగ్ ముగిశాక ఇలా బ్యాలెట్ బాక్సులు కూడా రిగ్గింగ్? అని వైఎస్ జగన్ మండిపడ్డారు. “చంద్రబాబు.. ఈ స్థానిక ఎన్నికల్లో మీరు ఈ రకంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తుంటే, ఈ తప్పుల్ని ఎవరైనా ప్రశ్నిస్తే, వారిని అరెస్టు చేసి జైలుకు పంపుతారా?

ఆకాశమే హద్దుగా.. 13,629 అడుగుల ఎత్తులో

భారత వాయుసేన ప్రపంచ రికార్డు



ఢిల్లీ: లడఖ్‌లో భారత వాయుసేన అరుదైన ఘనత సాధించింది. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో భారీ విమానాలను నడిపే సామర్థ్యాన్ని చాటుతూ.. ఐఎల్-76ఎండీ (ఖూ-76వీణ) రవాణా విమానాన్ని 13,629 అడుగుల ఎత్తులో విజయవంతంగా ల్యాండ్ చేసింది. తూర్పు లడఖ్‌లోని న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో ఈ చారిత్రక ల్యాండింగ్ జరిగింది. ప్రపంచంలో ఈ తరహా విమానానికి ఇదే అత్యంత ఎత్తులో జరిగిన ల్యాండింగ్ అని భారత వాయుసేన ప్రకటించింది. ఈ ఘనతకు సంబంధించిన ఫొటోలు, వీడియోను వాయుసేన సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. విమానం సామర్థ్యంతోపాటు సిబ్బంది నైపుణ్యం, కచ్చితత్వం, వృత్తి నైపుణ్యానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొంది. దేశ వ్యూహాత్మక రవాణా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక ముందడుగుగా అభివర్ణించింది. చైనా సరిహద్దులోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కి సమీపంలో న్యోమా ఎయిర్‌ఫీల్డ్ ఉంది. సరిహద్దుకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో సైనికపరంగా దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడి ఎత్తైన ప్రాంతాల్లో గాలి సాంద్రత తక్కువగా ఉంటుంది. దీంతో విమానాలకు ఇంజిన్ పనితీరు, గాల్లోకి లేచే సామర్థ్యం తగ్గుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారీ రవాణా విమానాన్ని సురక్షితంగా దించడం సవాలుతో కూడుకున్న పని. రష్యా మూలాలున్న ఐఎల్-76ఎండీ నాలుగు ఇంజిన్ల భారీ రవాణా విమానం. సైనికులు, ఆయుధ సామగ్రి, ఇతర భారీ సరకులను మారుమూల ప్రాంతాలకు తరలించేందుకు వాయుసేన దీన్ని వినియోగిస్తోంది. న్యోమాలో ఈ విమానం ల్యాండింగ్ కావడం సరిహద్దు ప్రాంతాల్లో సైనిక అవసరాలకు వేగంగా స్పందించే భారత సామర్థ్యాన్ని చాటిందని రక్షణ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎమ్మెల్సీపై డెకాయిటీ కేసులా? చంద్రబాబు సర్కారుపై జగన్ ఫైర్

అమరావతి: వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టును ఆ పార్టీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల అక్రమాలను ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన వారిపై తప్పుడు కేసులు బనాయించి, నిర్బంధించడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపించే పాలన నడుస్తోందని, ఇది అత్యంత హేయమని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ వేదికగా విమర్శించారు. గురువారం పరిషత్ ఎన్నికల పోలింగ్ ముగిశాక, గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం నుంచి నాగార్జున యూనివర్సిటీలోని స్ట్రాంగ్‌రూమ్‌కు వెళ్లాల్సిన బ్యాలెట్ బాక్సులను మధ్యలో నల్లపాడు వద్ద ఎందుకు దించారని జగన్ ప్రశ్నించారు. ఈ అక్రమాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేయడం దారుణమన్నారు. తప్పు చేసి, బ్యాలెట్ బాక్సులు మార్చే ప్రయత్నం చేస్తూ, మళ్లీ తమ వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా ఒక ఎమ్మెల్సీపై డెకాయిటీ, దొంగతనం కేసులు పెట్టడం కంటే దుర్మార్గం ఏముంటుందని నిలదీశారు. ఈ సందర్భంగా చంద్రబాబును ఉద్దేశించి, “ఈ స్థానిక ఎన్నికల్లో నామినేషన్ల నుంచి బ్యాలెట్ బాక్సుల వరకు అన్నింటినీ రిగ్గింగ్ చేస్తున్నారు. ఈ రకంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే, ప్రశ్నించిన వారిని అరెస్టు చేసి జైలుకు పంపుతారా? అధికార, పోలీసు బలంతో అక్రమాలు దాచిపెట్టలేరు. మీ అప్రజాస్వామిక పద్ధతులను దేశమంతా చూస్తోంది. ప్రజలు మీకు తగిన బుద్ధి చెబుతారు” అని జగన్ తన ట్వీట్‌లో హెచ్చరించారు.

విశాఖ వేదికగా గ్లోబల్ సమ్మిట్.. ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం

విశాఖపట్నం: విశాఖపట్నం నగరం మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 31వ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరగనుంది. ‘నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్’ అనే థీమ్‌తో నిర్వహించే ఈ సదస్సులో 59 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. ప్రపంచ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, సాంకేతిక నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. ఈ సదస్సు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు సీఐఐ ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఈ సదస్సు ద్వారా ప్రపంచానికి తెలియజేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలు, అంకుర సంస్థలను అనుసంధానించడం ద్వారా చర్చలను వాణిజ్య, సాంకేతిక భాగస్వామ్యాల దిశగా నడిపించాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితం, సులభతరం అనే భరోసాను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, సెమికండక్టర్ రంగాల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ సదస్సులో మొత్తం 1,250 మందికి పైగా దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని అంచనా. వీరిలో 15 మంది విదేశీ మంత్రులు, 40 మందికి పైగా అంతర్జాతీయ వక్తలు, 350 మంది విదేశీ ప్రతినిధులు, 900 మంది భారతీయ ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్, నేపాల్, యూఏఈ, కెనడా, ఈజిప్ట్ వంటి అనేక దేశాల నుంచి ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు హాజరుకానున్నారు. అలాగే, ప్రపంచ ఆహార కార్యక్రమం, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొంటారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆరు కీలక అంశాలపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. వాణిజ్యం-పెట్టుబడులు, వ్యవసాయం-ఆహార భద్రత, నైపుణ్యాలు-అంతర్జాతీయ ఉపాధి, టెక్నాలజీ-భవిష్యత్ పరిశ్రమలు, స్వచ్ఛ ఇంధనం-సుస్థిర వృద్ధి వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. వ్యాపార సంస్థల మధ్య కొత్త ఒప్పందాలు, భాగస్వామ్యాలను ప్రోత్సహించేందుకు 400కు పైగా బిజినెస్ టు బిజినెస్ (బీటుబీ), ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బిజినెస్ టు గవర్నమెంట్ (బీటుజీ) సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపు వస్తుందని, రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

విద్యార్థులకు విజయ్ సర్కార్ భారీ కానుక..

ఏకంగా రూ.2,000 కోట్లు!

తమిళనాడు: తమిళనాడు విద్యార్థులకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుభవార్త చెప్పారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందించేందుకు రూ.2,000 కోట్లు మంజూరు చేశారు. ‘వెట్రి ల్యాప్‌టాప్ పథకం’ పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకానికి ప్రభుత్వం తాజాగా పరిపాలనా అనుమతులు జారీ చేసింది. ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరంలో మొదటి, రెండో ఏడాది డిగ్రీ, డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించనున్నారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఆర్ట్స్, సైన్స్, వైద్య, న్యాయ, వ్యవసాయ, పశువైద్య, మత్స్యశాస్త్ర కోర్సుల విద్యార్థులు కూడా ఈ పథకానికి అర్హులు. గత విద్యా సంవత్సరంలో ల్యాప్‌టాప్‌లు అందుకోని ప్రొఫెషనల్ కోర్సుల మూడు, నాలుగో ఏడాది విద్యార్థులకూ అవకాశం కల్పించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి సామర్థ్యం ఉన్న ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఇంటెల్ కోర్ ఐ5 ప్రాసెసర్ లేదా దానికి సమానమైన సాంకేతికత ఉండనుంది.పథకం అమలును పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ల్యాప్‌టాప్‌ల కొనుగోలు బాధ్యతను ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ తమిళనాడు కు అప్పగించారు. నాణ్యత, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పరికరాలను కొనుగోలు చేయనున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఆన్‌లైన్ తరగతులు, సాంకేతిక నైపుణ్యాల అభ్యాసం, ఉద్యోగ అవకాశాలకు సిద్ధమయ్యేందుకు ఈ ల్యాప్‌టాప్‌లు ఉపయోగపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఎమర్జెన్సీపై ఇన్నాళ్లకు కీలక వ్యాఖ్యలు..

ఇందిర గురించి సోనియా ఏం చెప్పారంటే?

ఢిల్లీ: ఎమర్జెన్సీ సమయంలో జరిగిన అకృత్యాలపై మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తర్వాతి కాలంలో పశ్చాత్తాపం వ్యక్తం చేశారని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తెలిపారు. ఆ ఘటనలకు బహిరంగంగా క్షమాపణలు కూడా చెప్పారని వెల్లడించారు. ఎమర్జెన్సీకి సంజయ్‌గాంధీ ఒక్కరినే బాధ్యుడిగా చూడకూడదని స్పష్టం చేశారు. ‘ది హిందూ’ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సోనియా ఈ విషయాలు వెల్లడించారు. ఎమర్జెన్సీ అనగానే ప్రజలకు సంజయ్‌గాంధీ గుర్తుకొస్తారని అన్నారు. కానీ అప్పట్లో ఇందిరాగాంధీపై సీనియర్ నేతల నుంచి కూడా ఒత్తిడి ఉండేదని చెప్పారు. ఆమె చుట్టూ భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేసినవారిలో రాజీవ్‌గాంధీ కూడా ఉన్నారని తెలిపారు. ప్రజలు చెప్పిన సమస్యలు, ఫిర్యాదులను రాజీవ్ తన తల్లి దృష్టికి తీసుకెళ్లేవారని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య హక్కులు నిలిపివేశారని సోనియా అంగీకరించారు. హేబియస్ కార్పస్ హక్కును కూడా రద్దు చేశారని చెప్పారు. అయితే అప్పటి పరిస్థితులు ఇందిరాగాంధీని తీవ్ర ఒత్తిడికి గురిచేశాయని వివరించారు. హింసాత్మక ఆందోళనలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా రవాణా వ్యవస్థపై దాడులు జరిగాయని గుర్తుచేశారు. ప్రభుత్వ అధికారులు, సాయుధ దళాలు ఆదేశాలను ధిక్కరించాలన్న పిలుపులు కూడా వచ్చాయని తెలిపారు. తర్వాత పరిస్థితులను అర్థం చేసుకున్న ఇందిరాగాంధీనే 1977 మార్చిలో ఎన్నికలకు పిలుపునిచ్చారని సోనియా గుర్తుచేశారు. నవంబరు 10న సోనియా రాసిన ‘బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్’ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ ఇంటర్వ్యూను రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పంచుకున్నారు. ప్రజా జీవితంలో ఆరు దశాబ్దాలు గడిచినా తన తల్లి వ్యక్తిత్వం మారలేదని, ఆమె తన తల్లి కావడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.

‘ఈ 20 కాస్తా 420గా మారింది’.. ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి: రాహుల్ గాంధీ

ఢిల్లీ: దేశంలోని ప్రధాన చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్‌లో ప్రభుత్వం నిర్దేశించిన 20 శాతం పరిమితికి మించి ఇథనాల్ కలుపుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన ల్యాబొరేటరీ పరీక్షల ఫలితాలను ఉటంకిస్తూ ఆయన శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. “ఈ20 కాస్తా 420గా మారింది -- ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారు!” అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ వేదికగా తీవ్రస్థాయిలో విమర్శించారు. చమురు సంస్థల టెస్టింగ్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆయన ప్రశ్నించారు. కర్ణాటక ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ విడుదల చేసిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి సేకరించిన 14 పెట్రోల్ శాంపిల్స్‌ను ప్రభుత్వ గుర్తింపు పొందిన ల్యాబ్‌లో పరీక్షించగా, 11 శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 20కి మించి ఉన్నట్లు తేలింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) శాంపిల్‌లో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) శాంపిల్‌లో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), నయారా ఎనర్జీ, షెల్ వంటి సంస్థల నుంచి సేకరించిన ఇతర శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 25.5 నుంచి 26.5 మధ్య ఉన్నట్లు తేలింది. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ, రామనగర, మంగళూరు, తుమకూరు జిల్లాల్లో ఈ శాంపిల్స్‌ను సేకరించారు. అధిక మోతాదులో ఇథనాల్ కలపడం వల్ల వాహనదారుల మైలేజీ తగ్గడమే కాకుండా ఇంజిన్‌లు దెబ్బతినే ప్రమాదం ఉందని మంత్రి రిజ్వాన్ అర్షద్ ఆందోళన వ్యక్తం చేశారు. మొదట ఈ శాంపిల్స్‌ను ఆయిల్ కంపెనీల ల్యాబ్‌లకు పంపగా, వారు ఇథనాల్ శాతం వివరాలు వెల్లడించలేదని, అందుకే స్వతంత్ర ల్యాబ్‌లో పరీక్షలు చేయించాల్సి వచ్చిందని ఆయన వివరించారు. అయితే, కర్ణాటక ప్రభుత్వం, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సహా అన్ని చమురు మార్కెటింగ్ కంపెనీలు తీవ్రంగా ఖండించాయి. శాంపిల్స్ సేకరణ, పరీక్షా విధానాలు నిర్దేశిత చట్టబద్ధమైన మార్గదర్శకాల ప్రకారం జరగలేదని ఆక్షేపించాయి. తాము దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 893 శాంపిల్స్‌తో జాయింట్ క్వాలిటీ మానిటరింగ్ నిర్వహించామని, అందులో కర్ణాటకకు చెందిన 56 శాంపిల్స్ కూడా ఉన్నాయని తెలిపాయి. ఈ పరీక్షల్లో ఇథనాల్ శాతం 19 నుంచి 21 శాతం మధ్యలోనే ఉందని, కర్ణాటక శాంపిల్స్‌లో సగటున 19.3 శాతంగానే నమోదైందని స్పష్టం చేశాయి. ఈ తాజా వివాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం, దాని ప్రభావంపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. వాహనాల పనితీరు, వినియోగదారులపై పడుతున్న భారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మురసు తుపాను: ఏపీకి తక్షణ సాయం అందించండి.. కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

అమరావతి: ‘మురసు’ తుపాను ధాటికి అతలాకుతలమైన ఆంధ్రప్రదేశ్‌కు తక్షణమే మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. వారం రోజుల వ్యవధిలోనే రాష్ట్రాన్ని రెండు తుపానులు చుట్టుముట్టడంపై ఆయన తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 27న సంభవించిన ‘అర్నాబ్’ తుపాను ప్రభావం నుంచి రాష్ట్రం కోలుకోకముందే, ‘మురసు’ తుపాను రూపంలో మరో విపత్తు విరుచుకుపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల విద్యుత్ నెట్‌వర్క్, రహదారులు సహా మౌలిక సదుపాయాలు అస్తవ్యస్తమయ్యాయని వివరించారు. ఒకే సీజన్‌లో రెండుసార్లు ప్రకృతి వైపరీత్యాలు సంభవించడంతో రైతులు, మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని ఆయన తెలిపారు. ‘మురసు’ తుపాను కారణంగా రాష్ట్రానికి ప్రాథమికంగా రూ. 1,919.59 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేసినట్లు చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,43,122 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లగా, దీని విలువ సుమారు రూ. 874.96 కోట్లుగా ఉండవచ్చని తెలిపారు. అదేవిధంగా, 6,504 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రూ. 337.10 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించారు. వీటితో పాటు పశుసంవర్ధక, ఆక్వాకల్చర్, గృహనిర్మాణం, విద్యుత్, పంచాయతీరాజ్, విద్యా, ఆరోగ్య రంగాలు సైతం భారీగా ప్రభావితమయ్యాయని వెల్లడించారు. వరద నీరు తగ్గుముఖం పట్టగానే నష్టానికి సంబంధించి పూర్తిస్థాయి అంచనాలను రూపొందించి, 15 రోజుల్లోగా కేంద్రానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. నష్టపోయిన రైతులు, మత్స్యకారులు, బాధితులను ఆదుకోవడంతో పాటు, దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునరుద్ధరించేందుకు తక్షణమే మధ్యంతర ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. “క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి” అని అన్నారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

ప్రభుత్వ ఆదాయ లక్ష్యాలను సాధించాలి

హైదరాబాద్: నిర్ణీత గడువులోగా ప్రభుత్వ ఆదాయ లక్ష్యాలను సాధించాలని.. ఇందుకుగాను ల్యాండ్ పూలింగ్, పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ ఆస్తుల సమర్థ వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక వనరులను బలోపేతం చేయడంతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను నిర్ణీత గడువుల్లో సాధించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘ సమావేశం భట్టి అధ్యక్షతన జరిగింది. ఉపసంఘ సభ్యులు, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు. ఈ ఏడాది ఇంతవరకు సమకూరిన ఆదాయం, ప్రతిపాదనల వివరాలను అధికారులు వివరించారు. నిర్దేశిత ఆదాయ లక్ష్యాన్ని సాధించేలా ప్రణాళిక రూపొందించాలని భట్టి సూచించారు. అజామాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో భూముల క్రమబద్ధీకరణ, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బీ-కేటగిరీ, పారిశ్రామిక యూనిట్ల ప్రతిపాదనలపై పారిశ్రామికవేత్తలకు ప్రయోజనంతోపాటు ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశ్రామిక యూనిట్ల దరఖాస్తుల పరిష్కారానికి వారాలవారీగా లక్ష్యాలను నిర్ణయించి, సంబంధిత అధికారులకు బాధ్యతలను అప్పగించాలన్నారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ల్యాండ్ పూలింగ్, భవిష్యత్ అవసరాలకు భూముల లభ్యతపై ఈ సందర్భంగా చర్చించారు. భవిష్యత్తులో ప్రభుత్వ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన భూములను ముందుగానే గుర్తించాలని భట్టి సూచించారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియపై పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలన్నారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ పరిధిలోని భూముల అభివృద్ధి, వేలం ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను కూడా సమీక్షించారు. భూముల వివరాలు, లేఅవుట్ల ప్రస్తుత స్థితి, వేలానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లు, ముందస్తు ఏర్పాట్ల పురోగతి తదితర అంశాలతో కూడిన స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను వచ్చే వారంలోగా సిద్ధం చేయాలని, వివరాలతో ప్రత్యేక డిజిటల్ డ్యాష్‌బోర్డ్ రూపొందించాలని సూచించారు.

‘ఆర్టీసీ-మెట్రో’ పాస్ ధర భారీగా తగ్గింపు

హైదరాబాద్: హైదరాబాద్‌లో మెట్రో రైలు, ఆర్టీసీ ఉమ్మడి పాస్ ధరల్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో భారీగా తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఇది ప్రయాణికులకు ప్రభుత్వ దీపావళి కానుక అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.275కు.. నెలవారీ పాస్‌ను రూ.8,500 నుంచి రూ.4,000కు కుదించినట్లు తెలిపారు. తగ్గించిన ధరలు ఈ నెల 8 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారం తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

మెట్రోలో పరిమితంగా.. బస్సులో అపరిమితంగా..


రోజువారీ, నెలవారీ పాసులు తీసుకునే ప్రయాణికులకు ఆర్టీసీ బస్సుల్లో అపరిమితంగా ప్రయాణానికి అనుమతి ఉంటుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. మెట్రో రైల్లో మాత్రం ప్రయాణాల సంఖ్యపై పరిమితి ఉంటుందని అన్నారు. రూ.275 డైలీ పాస్‌తో మెట్రో రైల్లో ఒక రోజులో నాలుగు సింగిల్ జర్నీలకు అనుమతిస్తారని పేర్కొన్నారు. రూ.4 వేలతో తీసుకునే నెలవారీ పాస్‌తో మెట్రో రైల్లో ఒక నెలలో గరిష్ఠంగా 50 సింగిల్ ట్రిప్పులు ప్రయాణం చేయవచ్చన్నారు. ఉమ్మడి పాస్ ధరల తగ్గింపుతో నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ వినియోగదారులకు రూ.4,500 ఆదా అవుతుందన్నారు. ఈ మేరకు మంత్రి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

బీసీ స్టడీ సర్కిల్ అభ్యర్థుల స్టైపెండ్ పెంపు

రాష్ట్రంలో 12 బీసీ స్టడీ సర్కిళ్లలో పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు నవంబరు నుంచి స్టైపెండ్ పెంచినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సివిల్స్ ఉచిత కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థులకు నెలకు ప్రస్తుత స్టైపెండ్ రూ.5వేల నుంచి రూ.7వేలకు, బుక్ ఫండ్ పేరిట ఏక మొత్తంగా ఇస్తున్న డబ్బును రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచినట్లు పేర్కొన్నారు. టీజీపీఎస్సీ, ఇతర నియామక సంస్థలైన రైల్వే, ఐబీపీఎస్, పోలీసు, ఎస్ఎస్‌సీ పోటీ పరీక్షలకు ఉద్దేశించిన ఫౌండేషన్ కోర్సులో శిక్షణ తీసుకునే అభ్యర్థులకు స్టైపెండ్ నెలకు రూ.వెయ్యి నుంచి రూ.1,500కు పెంచినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వివరించారు. “సివిల్స్ సాధించాలంటే నిరంతర సాధన అవసరం. ఈ మేరకు గత రెండేళ్లలో బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకుని సివిల్స్ సాధించలేకపోయిన వారికి స్టైపెండ్ ఇస్తూ ప్రవేశాలు కల్పిస్తున్నాం. యూపీఎస్సీ తరహాలో ప్రవేశపరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాం. బీసీ స్టడీ సర్కిల్‌లో సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సుల్లో భాగంగా వెంటనే స్టైపెండ్ పెంచాం. మిగతా సిఫార్సులు త్వరలోనే అమలు చేస్తాం. బీసీ స్టడీ సర్కిల్ సొంత భవనాల్లో స్టడీ రూమ్, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తాం” అని తెలిపారు.

బొత్స సత్యనారాయణకు బిగ్ షాక్..

ఓటమి బాటలో కుమార్తె



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. వెలువడుతున్న ట్రెండ్స్ ప్రకారం, ఈ ఎన్నికల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తుండగా, ప్రతిపక్ష వైసీపీ భారీ పరాజయం దిశగా పయనిస్తోంది. వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గంలోని పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని కూడా ఆ పార్టీ కోల్పోవడం గమనార్హం. ఈ ఫలితాలతో వైసీపీ శ్రేణులు తీవ్ర నిరాశలో మునిగిపోయాయి. మరోవైపు, ఈ ఎన్నికల ఫలితాలు వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణకు మిశ్రమ అనుభవాన్ని మిగిల్చాయి. విజయనగరం జిల్లా బొండపల్లి జడ్పీటీసీ స్థానం నుంచి పోటీ చేసిన ఆయన కుమార్తె అనూష ఓటమి బాటలో ఉన్నారు. ఇక్కడ కూటమి అభ్యర్థి నీరజ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. దీంతో బొత్స సత్యనారాయణకు ఊహించని షాక్ తగిలినట్లయింది. అయితే, ఇదే జిల్లాలోని గరివిడి జడ్పీటీసీ స్థానంలో బొత్స కోడలు, బొత్స పూజిత ముందంజలో ఉన్నారు. ఆమెపై పోటీ చేసిన టీడీపీ నేత కిమిడి కళా వెంకట్రావు కోడలైన కిమిడి సంధ్య వెనుకంజలో ఉన్నారు. దీంతో ఒకే కుటుంబంలో ఒకరు ఓటమి దిశగా, మరొకరు గెలుపు దిశగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక

వంగూరి వాచకం- నవరత్నాలు

1. ఒంటరి వాడివని నీవు
బాధపడిపోతావేల
ఒంట్లో అవయవాలెన్నో
తోడని మరిచెదవేల.

2.ముక్కులను మురిపించేను
కాగిన కాఫీ
నరాలను పురికొల్పేను
తాగిన కాఫీ

3.ఆస్తుల కోసం
పెద్దల ఆరాటం
దోస్తుల కోసం
పిల్లల ఉబలాటం.

4.యాక్షన్
తీసుకునేవారు కొందరు
యాక్షన్
చేసేవారెందరో.

5.చిత్రం
విచిత్రం
విధి
ఒక విచిత్రం.

6.పొగాకు
అది
నీ పాలిట
పగ ఆకు.

7.వంకర మాటలు
వయసు వదలాలి
సానుకూల మాటలు
మనసు మలచాలి.

8.ధరణిలోన దాగిన బీజం
అదునులో జన్మనెత్తు
వరుణుడికి నమస్కరించు
రెండు చేతులెత్తి.

9.ప్రకృతి వ్యవస్థల విధ్వంసం
పరిపరి విధాల దుష్ప్రభావం
విరివిగా పెంచాలి పచ్చదనం
పర్యావరణకు అదే రక్షణ దళం.

వంగూరి గంగిరెడ్డి
షాద్ నగర్
9652286270



MoU మెరుపు కాదు.. మట్టిలో పునాది కావాలి

పెట్టుబడుల పోటీలో తెలంగాణకు అసలు పరీక్ష ఇదే

సంపాదకీయం ၊ వనం రామకృష్ణ



రాష్ట్రాల మధ్య పెట్టుబడుల పోరు కొత్త దశకు చేరింది. ఎవరి వద్ద ఎక్కువ కోట్ల ప్రతిపాదనలు వచ్చాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రచారాంశంగా మారుతోంది. కానీ ఆర్భాటపు అంకెల వెనుక అసలు ఆర్థిక వాస్తవం దాగిపోకూడదు. వీశీఖ అంటే పెట్టుబడి కాదు. ప్రకటన అంటే పరిశ్రమ కాదు. పరిశ్రమ అంటే ఉద్యోగం కాదు. కాగితంపై కుదిరిన ఒప్పందం.. కర్మాగారంగా రూపుదిద్దుకుని ఉత్పత్తి మొదలుపెట్టినప్పుడే దాని విలువ తెలుస్తుంది. గత తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో భారీగా పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం 108 వీశీఖల విలువ రూ.5.86 లక్షల కోట్లుగా ఉంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ కూడా భారీ పెట్టుబడి ప్రతిపాదనలతో ముందుకు వెళ్తోంది. ఈ అంకెలను పక్కపక్కన పెట్టి ఎవరు ముందున్నారు, ఎవరు వెనుకబడ్డారు అని తేల్చడం సులభమే. కానీ అది సరైన ఆర్థిక కొలమానం కాదు. అసలు ప్రశ్న ఒక్కటే---ఎంత పెట్టుబడి నేలమీదకు వచ్చింది అమలే అసలు అర్థం తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి అసెంబ్లీలో వెల్లడించిన వివరాలే ఈ విషయంలో కీలకం. 2025--26లో కుదిరిన 108 వీశీఖల్లో దాదాపు 45 శాతం గ్రౌండింగ్ దశకు చేరినట్లు ప్రభుత్వం తెలిపింది. గత తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో కుదిరిన 75 వీశీఖల్లో 17 ప్రాజెక్టులు కార్యకలాపాలు ప్రారంభించాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించింది. ఆర్థిక ముగింపు తదితర కారణాలతో ప్రతి ఒప్పందం ప్రాజెక్టుగా మారదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది సహజమే కావచ్చు. ప్రతి వీశీఖ చివరకు పరిశ్రమగా మారదు. పెట్టుబడిదారుడి వ్యాపార నిర్ణయాలు, మార్కెట్ పరిస్థితులు, ఆర్థిక వనరులు, సాంకేతిక మార్పులు అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. అయితే ప్రభుత్వం కూడా అంతే స్పష్టంగా చెప్పాల్సిన బాధ్యత ఉంది ఎన్ని ఒప్పందాలు ముందుకు వెళ్లాయి ఎన్ని ఆగిపోయాయి ఎందుకు ఆగిపోయాయి ఎన్ని ఉపసంహరించుకున్నారు ఎన్ని ఉత్పత్తి ప్రారంభించాయి ఎన్ని ఉద్యోగాలు కల్పించాయి ఈ లెక్కలు బయటకు వస్తేనే పెట్టుబడుల కథనానికి విశ్వసనీయత పెరుగుతుంది. సింగిల్ విండో.. గమ్యానికి చేరుస్తుందా? తెలంగాణకు ౨+-ఊూూూ, పెట్టుబడిదారుల సౌలభ్య వ్యవస్థలు బలాలు. అనుమతుల ప్రక్రియను సరళీకరించడం, వివిధ శాఖలను సమన్వయం చేయడం పెట్టుబడి ఆకర్షణకు అవసరం. కానీ అనుమతి రావడం ప్రారంభం మాత్రమే. ఆ తర్వాత భూమి కావాలి. విద్యుత్తు కావాలి. నీరు కావాలి. రహదారి కావాలి. రవాణా సదుపాయం కావాలి. నైపుణ్యంతో కూడిన సిబ్బంది కావాలి. పర్యావరణ, స్థానిక అనుమతులు సమయానికి రావాలి. ఆర్థిక ముగింపు జరగాలి. అంటే సింగిల్ విండో నుంచి బయటకు వచ్చిన ప్రాజెక్టు.. మరిన్ని కిటికీల కోసం వెతకాల్సిన పరిస్థితి ఉండకూడదు. పెట్టుబడిదారుడికి ఇచ్చిన హామీ కాగితంపై కాకుండా కార్యాచరణలో కనిపించాలి. పక్క రాష్ట్రం వేగం.. తెలంగాణకు హెచ్చరిక ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల కోసం దూకుడుగా ముందుకు సాగుతోంది. తెలంగాణ కూడా వెనుకంజ వేయడం లేదు. డిసెంబరు 7--9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గత ఏడాది కంటే మరింత విస్తృతంగా ఈసారి ఆరు ప్రదర్శనశాలలు, రక్షా ఎక్స్‌పో, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా--లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ ప్రదర్శన, విద్యా ఎక్స్‌పో వంటి కార్యక్రమాలను రూపొందించింది. ప్రచారానికి ఇది ఆకర్షణీయమే.కానీ ఈసారి సమ్మిట్ ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాలి గత సమ్మిట్‌లో ప్రకటించిన పెట్టుబడుల పరిస్థితి ఏమిటి కొత్త వీశీఖలతో మరో భారీ అంకెను ప్రకటించడం కంటే.. పాత వీశీఖల పురోగతిని ప్రజల ముందు ఉంచడం మరింత ముఖ్యమేమో ఆలోచించాలి. హైదరాబాద్ బలం.. తెలంగాణ భవిష్యత్తుకు సరిపోతుందా తెలంగాణ బలహీన రాష్ట్రం కాదు. హైదరాబాద్ ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, డేటా సెంటర్లు, ఏరోస్పేస్, డిఫెన్స్, , స్టార్టప్‌లకు బలమైన కేంద్రం. ప్రభుత్వం ప్రస్తుత పెట్టుబడి ప్రచారంలో 500కుపైగా +జజలు, 10 లక్షలకు పైగా టెక్ ప్రొఫెషనల్స్ ఉన్నట్లు పేర్కొంటోంది. ఇదే తెలంగాణకు గొప్ప ఆస్తి. కానీ ఒక నగర విజయమే మొత్తం రాష్ట్ర విజయంగా మారాలంటే పెట్టుబడులు జిల్లాలకూ విస్తరించాలి. హైదరాబాద్ పెట్టుబడుల ముఖద్వారం కావచ్చు.. తెలంగాణ మొత్తం పెట్టుబడుల గమ్యస్థానం కావాలి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో స్థానిక వనరులకు అనుగుణంగా పారిశ్రామిక క్లస్టర్లు పెరగాలి. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, పునరుత్పాదక ఇంధనం, పర్యాటకం వంటి రంగాలకు ప్రత్యేక దృష్టి అవసరం. ఫ్యూచర్ సిటీ.. భవిష్యత్తుకు పునాదా భారత్ ఫ్యూచర్ సిటీని ప్రభుత్వం 30 వేల ఎకరాల నెట్-జీరో నగరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు తీసుకెళ్తోంది. ఇది కేవలం భవనాల సముదాయం కాకుండా పని, నివాసం, విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు కేంద్రంగా మారాలి. అక్కడ భారీ కంపెనీలు రావడం మాత్రమే సరిపోదు. వాటితో పాటు ఉద్యోగాలు రావాలి. నైపుణ్య కేంద్రాలు రావాలి. పరిశోధనా సంస్థలు రావాలి. స్టార్టప్‌లు ఎదగాలి. చిన్న పరిశ్రమలకు అవకాశాలు రావాలి. స్థానిక యువతకు ప్రాధాన్యం దక్కాలి. లేకపోతే 'ఫ్యూచర్ సిటీ' అనే పేరు గొప్పగా ఉన్నా.. ప్రజల జీవితాల్లో మార్పు పరిమితంగానే ఉంటుంది. ప్రతి వీశీఖకు ఒక 'ట్రాకింగ్ నంబర్' ఉండాలి ఇకపై పెట్టుబడుల విధానంలో కొత్త పద్ధతి అవసరం. ప్రతి వీశీఖకి ఒక ప్రత్యేక ట్రాకింగ్ వ్యవస్థ ఉండాలి. దాని ద్వారా ప్రజలు ప్రాజెక్టు ఏ దశలో ఉందో తెలుసుకునే అవకాశం ఉండాలి. వీశీఖ కుదిరిందా భూమి కేటాయించారా ఆర్థిక ముగింపు జరిగిందా నిర్మాణం మొదలైందా ఉత్పత్తి ప్రారంభమైందా ఉద్యోగాలు ఎన్ని ఈ వివరాలు నిర్దిష్ట వ్యవధిలో నవీకరించాలి. ఇది ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టే విధానం కాదు. ప్రభుత్వం ఇచ్చిన హామీపై పెట్టుబడిదారుడికి, ప్రజలకు విశ్వాసం కలిగించే విధానం. కోట్ల కంటే ఉద్యోగాలే ముఖ్యంరూ.లక్షల కోట్ల పెట్టుబడుల ప్రకటనలు ఆకర్షణీయంగా ఉంటాయి. కానీ సామాన్యుడికి ఆ అంకెలతో ప్రత్యక్ష సంబంధం ఉండదు. అతను అడిగేది నా ప్రాంతంలో పరిశ్రమ వచ్చిందా నా పిల్లలకు ఉద్యోగం వచ్చిందా నా వ్యాపారానికి ఆర్డర్ వచ్చిందా నా జిల్లాలో ఆదాయం పెరిగిందా అందుకే పెట్టుబడుల విజయాన్ని కోట్లతో కాకుండా ఉత్పత్తి, ఉపాధి, ప్రాంతీయ అభివృద్ధితో కొలవాలి. ముగింపుతెలంగాణ పెట్టుబడుల పోటీలో వెనుకబడుతోందని ఇప్పుడే తీర్పు ఇవ్వడం తొందరపాటు. కానీ పోటీ తీవ్రతను తక్కువ అంచనా వేయడం మాత్రం ప్రమాదకరం. తెలంగాణకు హైదరాబాద్ ఉంది. పరిశ్రమల పునాది ఉంది. ప్రతిభ ఉంది. సాంకేతిక సామర్థ్యం ఉంది. లైఫ్ సైన్సెస్ బలం ఉంది. భవిష్యత్ నగరాల ఆలోచన ఉంది. ఇప్పుడు అవసరమైనది ఒక్కటే ప్రకటనల నుంచి అమలుకు వేగం. సమ్మిట్‌లో సంతకం చేయడం విజయం కాదు. పరిశ్రమకు పునాది వేయడం విజయం. పునాది వేయడం మాత్రమే కాదు. యంత్రాలు తిరగాలి. యంత్రాలు తిరగడం మాత్రమే కాదు. ఉద్యోగాలు రావాలి.ఉద్యోగాలు రావడం మాత్రమే కాదు.ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలపడాలి.అప్పుడే పెట్టుబడి ప్రజల జీవితాల్లోకి చేరుతుంది.వీశీఖల మెరుపు కళ్లను మిరుమిట్లు గొలిపొచ్చు.కానీ రాష్ట్ర భవిష్యత్తును నిలబెట్టేది మట్టిలో పడిన పునాదే.కోట్ల ప్రకటనలతో కాదు..కర్మాగారాల పొగగొట్టాలతో తెలంగాణ పారిశ్రామిక ప్రగతి కనిపించాలి.సమ్మిట్ వేదికపై గెలుపు కాదు..తెలంగాణ నేలపై పరిశ్రమ నిలిచినప్పుడే అసలైన గెలుపు.

వనం రామకృష్ణ,
9440724576
మేడ్చల్ జిల్లా లోకల్ గైడ్ ప్రతినిధి.

పరిశుభ్రతకు పెద్దపీట..
భాగ్యనగర్ తండా సర్పంచ్ హీరాలాల్ ప్రత్యేక చొరవ

వర్షాల అనంతరం పారిశుధ్య పనులు ముమ్మరం.. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కారేపల్లి, నవంబర్ 7 (లోకల్ గైడ్ న్యూస్) : ఇటీవల కురిసిన భారీ తుపాను వర్షాల నేపథ్యంలో గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. సర్పంచ్ బానోత్ హీరాలాల్ ప్రత్యేక చొరవతో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే చర్యలు చేపట్టారు. భారీ వర్షాల కారణంగా దోమలు, క్రిమికీటకాలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తగా పారిశుధ్య కార్యక్రమానికి ప్రాధాన్యతనిచ్చారు. గ్రామంలోని వీధులు, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటిస్తూ ప్రజారోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ హీరాలాల్ మాట్లాడుతూ....గ్రామ పరిశుభ్రతే తమ ప్రథమ ప్రాధాన్యతని, ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ బాధ్యతని...తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెండ్రా అనిల్ కుమార్, వార్డు సభ్యులు గాంధీ, మాజీ ఎంపీటీసీ బానోత్ రాంచందర్, పంచాయతీ సిబ్బంది హేచంద్, నంద, రమేష్, రాందాస్, గణేష్, రాధా, లకన్, రాకేష్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి మల్లన్న స్వామికి కుమార్తె వివాహ ఆహ్వాన పత్రిక సమర్పించిన రామకృష్ణ దంపతులు



కుత్బుల్లాపూర్ నవంబర్ 07 (లోకల్ గైడ్ ప్రతినిధి) : తమ కుమార్తె వివాహమహోత్సవానికి సంబంధించిన తొలి ఆహ్వాన పత్రికను రామకృష్ణ దంపతులు కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి (మల్లన్న స్వామి) వారికి సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించి, వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం రామకృష్ణ దంపతులు మాట్లాడుతూ.. తమ కుటుంబంపై కొమురవెల్లి మల్లన్న స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, తమ కుమార్తె వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తమ బిడ్డలపై స్వామివారి ఆశీస్సులు, దీవెనలు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. మల్లన్న స్వామివారి ఆశీస్సులతో వివాహ వేడుక ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆనందోత్సాహాల మధ్య జరగాలని కోరుకున్నారు.

పెన్షన్, జీపీఎఫ్ పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఈ నెల 13న అదాలత్-కమ్- వర్క్‌షాప్ నిర్వహణ

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

పెన్షనర్లు, ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అవకాశం

సంబంధిత శాఖల అధికారులు, డీడీఓలు అవసరమైన రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలి

ఖమ్మం, నవంబర్- 07: లోకల్ గైడ్ : పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్), అకౌంట్స్ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13వ తేదీన (శుక్రవారం) కలెక్టరేట్ (ఐడీఓసీ)లో పెన్షన్-జీపీఎఫ్ అదాలత్- కమ్-వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు ప్రారంభ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్, జీపీఎఫ్ కేసుల పరిష్కారం, పెన్షనర్ల సమస్యల పరిశీలన, ఉద్యోగులకు పెన్షన్ ప్రతిపాదనలను సకాలంలో సమర్పించే విధానంపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ఏసీ బిల్లులు, పెండింగ్ వోచర్లు, ట్రెజరీ తనిఖీ అభ్యంతరాలు, చెల్లించిన చెక్కులకు సంబంధించిన వివరాలు, జీపీఎఫ్ పెండింగ్ అంశాలను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, శాఖాధిపతులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు), జిల్లా ట్రెజరీ అధికారులు, సబ్ ట్రెజరీ అధికారులు తమ సంబంధిత సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్ ఫైళ్లు, సర్వీస్ బుక్కులు, జీపీఎఫ్ తుది చెల్లింపు దరఖాస్తులు, సమర్పించాల్సిన వోచర్లు, పెండింగ్ ఏసీ బిల్లుల క్లియరెన్స్ వివరాలు, ట్రెజరీ తనిఖీ అభ్యంతరాలకు సంబంధించిన అనుసరణ నివేదికలు తదితర అవసరమైన రికార్డులన్నింటినీ వెంట తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. తద్వారా సాధ్యమైనంత వరకు సమస్యలను కార్యక్రమంలోనే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్హులైన పెన్షనర్లకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్లు (పీపీఓలు), జీపీఎఫ్ చందాదారులకు జీపీఎఫ్ ఆథరైజేషన్ లేఖలను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని పెన్షనర్లకు, ఉద్యోగులకు ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాలని, స్థానిక పెన్షనర్ల సంఘాలకు సమాచారం అందించి, సమస్యలు ఉన్న పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

వైరా మండల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘానికి నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా చావా శ్రీనివాసరావు..

ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి విజయబాబు ఏకగ్రీవ ఎన్నిక



ఖమ్మం జిల్లా ప్రతినిధి వైరా నవంబర్ 07: లోకల్ గైడ్ : వైరా మండల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘానికి నూతన నాయకత్వం కొలువుదీరింది. రాబోయే రెండేళ్ల కాలానికి సంఘం అధ్యక్షుడిగా చావా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి విజయబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం వైరా మండల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సమావేశానికి జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆర్. వీరస్వామి, ప్రధాన కార్యదర్శి డి. పుల్లయ్యతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సంఘం బాధ్యత, భవిష్యత్తు కార్యాచరణపై జిల్లా అధ్యక్షుడు దిశానిర్దేశం చేశారు.అనంతరం గన్నవరం ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ చావా శ్రీనివాసరావును మండల సంఘం అధ్యక్షుడిగా, గొల్లపూడి ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి విజయబాబును ప్రధాన కార్యదర్శిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రెబ్బవరం, కేజీ సిరిపురం ప్రధానోపాధ్యాయులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఐ. సూర్యకుమారి, పి. శివనారాయణ, కే. మార్క్, కే. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు నవంబర్ 10లోగా సమర్పించాలి .....

ప్రిన్సిపాల్ అనురాధ దేవి

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన 17 ఏళ్లు నిండిన మహిళా అభ్యర్థులు అర్హులు

నవంబర్ 16 నుంచి తరగతులు ప్రారంభం

ఖమ్మం, నవంబర్ -07: లోకల్ గైడ్ : ఖమ్మం ప్రభుత్వ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) ట్రైనింగ్ స్కూల్ లో 2026--27 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం ఏఎన్ఎం శిక్షణ కోర్సులో ప్రవేశాల కోసం నవంబర్ 10 లోగా అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని శిక్షణ పాఠశాల ప్రిన్సిపాల్ పి. అనురాధ దేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఏ గ్రూపు మహిళ అభ్యర్థులైనా, 17 సంవత్సరాలు నిండిన వారు ఈ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తెలంగాణ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్ , ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ రుసుము రూ. 200ను ఏదైనా జాతీయ బ్యాంకు ద్వారా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో డిమాండ్ డ్రాఫ్టను హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా పేరుతో తీసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవసరమైన ధృవపత్రాల ప్రతులతో పాటు నవంబర్ 10లోగా ప్రభుత్వ మహిళా బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల శిక్షణ పాఠశాల ప్రిన్సిపాల్‌కు లేదా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని, మరిన్ని వివరాలకు 8919393686, 8374706381 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ బలోపేతానికి ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ నాయకులు ప్రతిష్టంగా పనిచేయాలి

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు



మధిర, నవంబర్,7: లోకల్ గైడ్ : స్థానిక మధిరలో రిక్లేషన్ క్లబ్ నందు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ,మహాజన సోషలిస్టు పార్టీ,మధిర మండల ముఖ్య కార్యకర్తలు సమావేశం కి ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి పార్శపు ఏనూక మాదిగ అధ్యక్షా సమావేశం జరిగినది సమావేశంలో ఇంచార్జి మాట్లాడుతూ ప్రతి గ్రామ గ్రామాన మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని రానున్న రోజుల్లో మాదిగ విద్యార్థులే జాతి భవిష్యత్తు మార్చే విధంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేసిన పోరాటంతో మనం సాధించిన ఏబిసిడి,వర్గీకరణ తరతరాల మన జాతి బాగుండాలని దుడసంకల్పంతో వర్గీకరణ సాధించుకోవడం జరిగినది అంతేకాకుండా ప్రతి గ్రామమున మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ప్రతిష్టమైన కమిటీలు నిర్మించాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో) ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్ జిల్లా సీనియర్ నాయకులు రాయబారపు దాసు మాదిగ తేలూరి రాజరత్నం మాదిగ మండల నాయకులు పుట్ట భాస్కర్ మాదిగ రాయబారపు పుల్లారావు మాదిగ విశ్వేశ్వర రావు మండల నాయకులు చాట్ల ఈశ్వరయ్య పల్లపాటి దేవదానం పార్శపు నాగేశ్వరరావు కొంగల సురేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు

కార్మిక కర్షక ఐక్యతను బలోపేతం చేద్దాం

15 బహిరంగ సభ జయప్రదం చేయాలి -సీఐటీయూ.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక కర్షక ఐక్యత తో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని ఏ ఐ కేస్ జాతీయ మహాసభల సందర్భంగా 15న జరుగుతున్న బహిరంగ సభ జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ పిలుపునిచ్చారు.శనివారం ఎఫ్సీఐ బేవరేజ్ ఎలక్ట్రిసిటీ స్టోర్ హమాలి వర్కర్స్ యూనియన్ ల జనరల్ బాడీ సమావేశాలు వేరువేరుగా ఆయా కార్యాలయాల దగ్గర జరిగినవి ఈ సమావేశాలకు ముఖ్య అతిథులు హాజరైన వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ విదేశీ కార్పొరేట్ శక్తులకు వంత పాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు కనీసం మద్దతుల చట్టం చేయాలని స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం పేరుతో విదేశా వ్యవసాయ ఉత్పత్తులను మన దేశంలో దిగుమతి చేయడం ద్వారా రైతాంగం దివాలా తీసే స్థితికి చేరిందని అన్నారు రైతు బాగుంటునప్పుడే దేశం బాగుంటుంది అని రైతు రక్షణ కోసం జరుగుతున్న ఉద్యమాలకు మద్దతుగా కార్మిక వర్గం కలిసి రావాలని కోరారు.నవంబర్ 15 నుండి 18 వరకు జరుగుతున్న ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభల సందర్భంగా 14 నుండి 16 వరకు పెద్ద గడియారం సెంటర్లో వ్యవసాయ ప్రదర్శన ఫెస్ట్ కళాకారుల ఆటపాట కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి తిలకించాలని ఆధునిక వ్యవసాయ పనిముట్లు వెలిసోవా ప్రభావము వ్యవసాయ పంటల పరిస్థితులు ఆధునిక వంగడాలు తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు .వేరువేరుగా జరిగిన ఈ సమావేశాలలో ఎలక్ట్రిసిటీ స్టోర్ అమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కత్తుల యాదయ్య ఎఫ్సీఐ హమాలీ యూనియన్ అధ్యక్షుడు సుంకరబోయిన వెంకన్న బెవరైజర్స్ హమాలి యూనియన్ అధ్యక్షుడు సల్ల యాదయ్య నాయకులు జేరిపోతుల సైదులు పజ్జురి యాదగిరి వెంకన్న రాములు శంకర్ తదితరులు పాల్గొన్నారు

ఇస్నాపూర్ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్న అయ్యప్ప స్వాముల కారు

ప్రమాదంలో అసలు డ్రైవర్ ఎవరు స్వాముల పరస్పర విరుద్ధ సమాధానాలతో అనుమానాలు

పోలీసులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారా



పఠాన్ చేరు, నవంబర్ 07 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ) : ఇస్నాపూర్ ముంబై జాతీయ రహదారి ఎన్‌హెచ్-65పై పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్నాపూర్ సమీపంలో భాగ్యనగర్ గ్యాస్ వద్ద అయ్యప్ప స్వాములు ప్రయాణిస్తున్న ఐ20 కారు (టిఎస్ 35ఎఫ్ 3623) ప్రమాదానికి గురైంది. పఠాన్ చేరు నుండి సంగారెడ్డి వైపు వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వేలుచున్న మరో వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి రహదారి మధ్యలోని డివైడర్‌పై ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారు ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో వాహనంలో ఉన్నవారు ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదం అనంతరం అసలు డ్రైవింగ్ చేసింది ఎవరనే విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు అయ్యప్ప స్వాములను ప్రశ్నించగా, ఒక స్వామి డ్రైవర్ ప్రమాదం జరిగిన తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయి ఇంటికి వెళ్లిపోయాడని చెప్పినట్లు సమాచారం. మరో స్వామి మాత్రం తానే కారు నడిపానని చెబుతున్నాడు. అయితే తానే డ్రైవింగ్ చేశానని చెబుతున్న వ్యక్తికి కనీసం చిన్న గాయం కూడా కాకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. ఒకరు డ్రైవర్ వెళ్లిపోయాడని, మరొకరు తానే డ్రైవింగ్ చేశానని చెప్పడంతో అసలు ప్రమాద సమయంలో స్టీరింగ్ పట్టుకున్నది ఎవరు? డ్రైవర్‌కు ఏమైంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో పోలీసులకు కూడా ప్రమాదానికి సంబంధించిన వాస్తవ వివరాలు వెల్లడించకుండా పరస్పర విరుద్ధ సమాచారం ఇస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పటాన్‌చెరు పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, ప్రమాద సమయంలో కారు నడిపిన అసలు డ్రైవర్ ఎవరు? అతను ఎక్కడ ఉన్నాడు? అనే విషయాలను నిర్ధారించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిది.

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.లోకల్ గైడ్ : ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శనివారం వివిధ అనారోగ్య సమస్యలతో పలు ప్రైవేట్ హాస్పిటల్స్ లో చికిత్స పొందిన 60 మంది నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిది పథకం ద్వారా మంజూరు అయిన రూ. .33,55,500 /- విలువ గల చెక్ లను నల్గొండ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ" ముఖ్యమంత్రి సహాయనిధీ పథకం వలన నిరుపేదలకు లబ్ది చేకూరుతుందని చెప్పారు. ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేదలకు సహాయం అందుతుందన్నారు . నిరుపేద ప్రజలకు సహాయాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు.

అమరవీరుల ఆశయ సాధనే మన లక్ష్యం

-- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

టేకులగూడెంలో ఘనంగా అమరవీరుల సంస్మరణ సభ..

లక్ష్మీనరసి, పాయం లక్ష్మీనారాయణలకు ఘన నివాళులు





సింగరేణి, నవంబర్ 7 (లోకల్ గైడ్ న్యూస్): అమరవీరుల ఆశయ సాధనే మన లక్ష్యమని, వారి త్యాగాల స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. సింగరేణి మండలం టేకులగూడెం గ్రామంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అమరవీరులు కామ్రేడ్ స్వర్ణపాక లక్ష్మీనరసి, కామ్రేడ్ పాయం లక్ష్మీనారాయణల త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళు లర్పించారు. మాస్‌లైన్ మండల కార్యదర్శి, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రారంభమైన భారత కమ్యూనిస్టు విప్లవోద్యమంలో ఎందరో విప్లవకారులు ప్రజల హక్కుల కోసం, పేదల విముక్తి కోసం తమ ప్రాణాలను అర్పించారని పేర్కొన్నారు. భూస్వామ్య దోపిడీ, సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. టేకులగూడెం గ్రామానికి చెందిన స్వర్ణపాక లక్ష్మీనరసి, పాయం లక్ష్మీనారాయణల త్యాగాలు గ్రామ ప్రజలకు, రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దేశంలో పేదలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఐక్యంగా ఉద్యమిస్తూ, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు గుగులోతు తేజ నాయక్, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. రాకేష్, కార్మిక సంఘం సంయుక్త మండల కార్యదర్శి ధరావత్ సక్రు, పార్టీ మండల నాయకులు కొలిసెలం శ్రీను, స్వర్ణపాక అనసూర్య, రామారావు, గుమ్మడి ఎర్రయ్య, నాగేశ్వరరావు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక..
శుభాకాంక్షలు తెలిపిన గ్రామస్తులకు కృతజ్ఞతలు

-తన ఎన్నికకు అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన

-నూతన అధ్యక్షుడు.. వి.నారాయణ చారి



హన్వాడ, నవంబర్ 07 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పంచాయతీ వెల్ఫేర్ సొసైటీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా తాను ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శు భాకాంక్షలు, అభినందనలు తెలిపిన గ్రామస్తులందరికీ నూతన అధ్యక్షుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వి.నారాయణ చారి మాట్లాడుతూ.. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం తనకు ఎంతో ఆనందంగా, గౌరవంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తన ఎన్నిక పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసిన కె. చెన్నారెడ్డి, వి.శ్రీనివాసులు, వి.సత్తయ్య చారి, సంధుల కిష్టయ్య, ఎన్.శ్రీనివాస్, సుదర్శన్ రెడ్డి, పూజారి రవి కుమార్, వి. శ్రీహరి చారి, పి.మోహన్ రెడ్డి, కెబిఆర్, పి.యాదయ్య తో పాటు గ్రామానికి చెందిన పలువురు పెద్దలు, సోదరులు, మిత్రులు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకం, అభిమానంతో శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరి ప్రోత్సాహం తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఉద్యోగుల సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే తన ఎన్నిక సందర్భంగా ప్రత్యక్షంగా, ఫోన్ ద్వారా, సందేశాల రూపంలో అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామస్తులు, సంఘ సభ్యుల సహకారం, ఆశీస్సులు అందించాలని కోరారు. అందరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

డిసెంబర్ 15 నుంచి ఆశా కార్యకర్తల నిరవధిక సమ్మెకు నోటీసు

రూ.18 వేల కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ ఐ అమలు చేయాలని డిమాండ్



నారాయణపేట, నవంబర్ 7 : ఆశా కార్యకర్తల సమ స్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ రాష్ట్ర యూనియన్ (బీఆర్‌టీయూ--సీఐటీయూ--ఏఐటీయూసీ) సమన్వయ సాధన కమిటీ నిరవధిక సమ్మెకు సిద్ధమైంది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించక పోతే డిసెంబర్ 15, 2026 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించిం ది. ఈ మేరకు నవంబర్ 7న సమ్మె నోటీసు జారీ చేసిం ది. రాష్ట్రవ్యాప్తంగా సుమా రు 27,130 మంది ఆశా కార్యకర్తలు గత 20 సంవ త్సరాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్ష ణలో కీలక పాత్ర పోషిస్తు న్నారని తెలిపారు. కరోనా సమయంలోనూ ప్రాణాల ను సైతం లెక్కచేయకుండా సేవలందించారని గుర్తు చేశారు. అయినప్పటికీ ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించ డంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అందిస్తు న్న పారితోషికం సరిపోవ డం లేదని, గత ఐదేళ్లుగా పారితోషికంలో పెరుగుదల లేదని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18,000 కనీస వేతనం ఫిక్స్‌డ్ వేతనంగా చెల్లిం చాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాల ని ప్రధానంగా డిమాండ్ చేశారు. ప్రస్తుతం అందిస్తు న్న రూ.9,750 పారితోషి కాన్ని పెంచడంతో పాటు సామాజిక భద్రత కల్పించా లని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలపై సాను కూలంగా స్పందించి డిమాం డ్లను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేపడతా మని యూనియన్ స్పష్టం చేసింది. 25 పేజీల డిమాం డ్లతో కూడిన సమ్మె నోటీసు ను కలెక్టర్ కార్యాలయంలో శనివారం అందజేసినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో డి.నాగమ్మ, పి.జయసుధ, సుజాత, వి.అరుణ, అంజమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిరలో
జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం నిర్వహణ



మధిర , నవంబర్,7: లోకల్ గైడ్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీ జి. శంకర్ , డాక్టర్ రామ్మోహన్ నాయక్ ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ రామ్మోహన్ నాయక్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే సరైన వైద్య చికిత్స ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. పొగాకు, గుట్కా, మద్యపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ ప్రతిరోజూ వ్యాయామం చేయాలని విద్యార్థులకు సూచించారు. క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. క్యాన్సర్ బాధితుల పట్ల వివక్ష చూపకుండా వారికి మనోధైర్యం కల్పించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ,బి తౌరియా,కృష్ణ, గురవయ్య అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి క్రీడల వైపు అడుగులు వేయాలి.

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్





నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ : నేటి సమాజంలో పిల్లలు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువ సమయం కేటాయిస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆలోచనలు పెంపొందించడంతో పాటు, వారిని క్రీడల వైపు ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శనివారం నల్గొండలోని మేకల అభినవ్ స్టేడియంలో కలెక్టర్ ఎలెవన్ ఎస్పీ ఎలెవన్ జట్ల మధ్య నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను జిల్లా కలెక్టర్ ఎస్ పి శరత్ చంద్ర పవర్ తో కలిసి ప్రారంభించారు.అనంతరం ఈ పోటీలో విజయం సాధించిన ఎస్పీ జట్టుకు ట్రోఫీ ప్రదానం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విధుల్లో నిత్యం ఎంతో బిజీగా ఉండే అధికారులు తమలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు మంచి అవకాశమని అన్నారు. రోజువారీ విధులతో పాటు, అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెరుగుతాయని , ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేకంగా 10 నుంచి 18 సంవత్సరాల వయస్సు విద్యార్థులు, పిల్లలకు క్రీడల ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ స్నేహపూర్వక మ్యాచ్ నిర్వహించినట్లు చెప్పారు. నేటి పిల్లలు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు అలవాటుపడి తల్లిదండ్రులకు తెలియకుండానే విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, తోటి వారితో మాట్లాడటం, కలిసిమెలిసి ఉండటం తగ్గిపోతోందని అన్నారు. పిల్లల ఆలోచనా విధానం ఆరోగ్యకరంగా ఉండాలంటే వారిని క్రీడల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలో మంచి సందేశం తీసుకెళ్లేందుకు, పిల్లల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు తమ వంతు సహకారంగా ఈ మ్యాచ్ నిర్వహించినట్లు కలెక్టర్ వివరించారు. 12 ఓవర్ల కు జరిగిన ఈ ఫ్రెండ్లీ మ్యాచ్ కు జిల్లా కలెక్టర్ టాస్ వేయగా ఎస్ పి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్లు ఇరు జట్లకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా, స్వయంగా బ్యాటింగ్, బౌలింగ్ చేసి మాచ్ ను ప్రారంభించి క్రీడాకారులలో స్ఫూర్తిని నింపారు. అనంతరం జరిగిన మ్యాచ్ లో ఎస్పీ జట్టు 118 పరుగులు సాధించి విజయం సాధించగా, కలెక్టర్ జట్టు 107 పరుగులతో రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా బెస్ట్ బౌలర్‌గా ఇరుగు రవి, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా శ్రీరామ్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా హరిబాబు ట్రోఫీ లు అందుకున్నారు.విజయం సాధించిన ఎస్పీ జట్టుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని స్నేహపూర్వక క్రీడా పోటీలు నిర్వహించి క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ ,స్థానిక కార్పొరేటర్ సుభాష్ లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్ నిధులు 1,80,000 రూపాయలతో ఏర్పాటు చేసిన ఆర్ ఓ ప్లాంట్ ను ప్రారంభించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, అడిషనల్ ఎస్పీ రమేష్, స్థానిక కార్పొరేటర్ సుభాష్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ పద్మ బాబుగౌడ్, చీఫ్ మేనేజర్ శ్రీరాములు ఎస్బిఐ కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ ఆర్ సౌమిత,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు .వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్, కామెంటేటర్ గిరిబాబు, రెవిన్యూ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు .

నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణపై మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆగ్రహం

ఎక్స్‌రే విభాగానికి తాళం.. పారిశుధ్య నిర్వహణ అధ్వానం.. చిన్నారులకు కనీస వసతుల కరువు.

ఆసుపత్రిలో అన్ని వార్డులను పరిశీలించి, రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వైద్యుల దృష్టికి తీసుకెళ్లిన కంచర్ల.





నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ : నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, నిర్వహణ లోపాలపై మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నేడు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లతో కలిసి ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలు, వార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే పేద, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో పలు సమస్యలు ఆయన దృష్టికి వచ్చాయి. మూడు సంవత్సరాల క్రితమే మంజూరైన ఎంఆర్ఐ స్కాన్ సేవలు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సిటీ స్కాన్ సేవలు సక్రమంగా అందడం లేదని, త్రీడీ ఎక్స్‌రే విభాగానికి తాళం వేసి ఉండటాన్ని గమనించి అధికారులను ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఎలా అందుతాయని నిలదీశారు. చిన్నపిల్లల విభాగంలో న్యూబార్న్ బేబీ ర్యాప్‌లు అందుబాటులో లేకపోవడంతో అప్పుడే పుట్టిన శిశువులను పాత బట్టల్లో చుట్టి ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ కూడా సరిగా లేదని, గత జనవరి నెలతోనే పాత శానిటేషన్ కాంట్రాక్ట్ ముగిసినప్పటికీ ఇప్పటివరకు కొత్త కాంట్రాక్టర్‌ను నియమించకపోవడం వల్ల ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని అన్నారు.వెంటనే కొత్త కాంట్రాక్టర్‌ను నియమించి పారిశు ధ్య పనులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లల కేసులు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిపోతున్నాయని, ప్రైవేట్ ఆసుపత్రులతో కుమ్మక్కు కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతోందని కంచర్ల ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య కూడా తగ్గుతోందని పేర్కొంటూ, ఈ అంశంపై అధికారులు సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.తాము ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సుమారు రూ.35 కోట్లతో క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణం చేపట్టామని కంచర్ల తెలిపారు. ఇందులో 50 ఐసీయూ పడకలు, 25 దయాలసిస్ పడకలు ఏర్పాటు చేసి పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనుకున్నామని చెప్పారు. అయితే ప్రస్తుతం ఆ విభాగం నిరుపయోగంగా ఉండటం బాధాకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రూ.270 కోట్లతో 42 ఎకరాల విస్తీర్ణంలో నల్గొండ మెడికల్ కళాశాలను నిర్మించామని, రూ.45 కోట్లతో నర్సింగ్ కళాశాల, క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెడికల్ కళాశాలను ప్రారంభించిన సమయంలోనే స్థానిక మంత్రికి ఆసుపత్రి విస్తరణ అవసరాన్ని వివరించినట్లు తెలిపారు. అప్పటికే రూ.20 కోట్లతో నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, మరో రూ.250 కోట్లు కేటాయించి 1200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు నిలిచిపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అవసరమైన నిధులు కేటాయించి నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి ఉన్నతాధికారులు తక్షణమే సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్ నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, సింగం రామ్మోహన్ అభిమన్యు శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ దోటి శ్రీనివాస్. కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్ పెరిక యాదయ్య పేర్ల మల్లీశ్వరి అశోక్,రత్నగిరి తారకమ్మ శ్రీనివాస్, కుందూరు దీపికా ప్రవీణ్ రెడ్డి,బాణావత్ దీప్లా, దొడ్డి రమేష్ గోపగోని స్వాతి రాజశేఖర్. కనగల్ మండల పార్టీ అధ్యక్షులు ఐతగోని యాదయ్య,మాజీ కౌన్సిలర్లు రావుల శ్రీనివాస్ రెడ్డి, మిర్యాల యాదగిరి భాష పాక హరికృష్ణ, దండంపెల్లి సత్తయ్య మెరుగు గోపి, లతీఫ్,జమాల్ ఖాద్రి, పెరిక కరణ్ జయరాజ్,అశ్వాక్, అఫ్జల్, శంషుద్దీన్, సింగం లక్ష్మి మిర్యాల యాదగిరి,వజ్జ శ్రీనివాస్,వంటల అవినాష్ అశోక్ రెడ్డికంకణాల వెంకటరెడ్డి కందుల లక్ష్మయ్య, అనిల్ నాయక్, నాగరాజు తదితరులు వెంట ఉన్నారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి ఆగదు

మక్తల్ నియోజ కవర్గంలో రూ.2,200 కోట్ల అభివృద్ధి పనులు

పట్టణంలోని పూర్తయి న అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి



నారాయణపేట నవంబర్ 7 : అభివృద్ధి పనులను అడ్డుకునే ప్రయత్నాలు ఎన్ని చేసినా వెనక్కి తగ్గేది లేదని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా మక్తల్ నియోజక వర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా నని రాష్ట్ర క్రీడా , పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసం వర్ధక, మత్స్య యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. మక్తల్ పట్టణంలో ని 7వ వార్డులో గుర్లపల్లి వరకు 3 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడు తూవేగవంతంగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడం పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు.ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిరంతరం అభివృద్ధి పనులు చేస్తున్నా నని తెలిపారు. తనను విమర్శించే వారికి ఒక్కటే సూచన చేస్తున్నానని, పని చేసే వారిని వెనక్కి నెట్టే ప్రయత్నం చేయవద్దని, వ్యక్తులను మానసికంగా వేధించవద్దని హితవు పలికారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా అంతకంటే వేగంగా ముందుకు సాగు తానన్నారు.మక్తల్ అభి వృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

పట్టణ అభివృద్ధికి రూ.45 కోట్లు

మక్తల్ పట్టణ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.45 కోట్లు ఖర్చు చేశామని, నియోజకవర్గంలో సుమా రు రూ.2,200 కోట్ల విలు వైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు మక్తల్‌కు 200 కోట్ల అభి వృద్ధి నిధులు కూడా రాని పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుత మూడేళ్లలో ప్రజల ఆశీస్సులతో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లభించిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ.550 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు.గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి పేరుతో కొబ్బరికాయలు కొట్టి వెళ్లారే తప్ప క్షేత్రస్థా యిలో ప్రజలకు ఉపయోగ పడే పనులు జరగలేదని విమర్శించారు. గతంలో రాష్ట్రంలో ఎక్కడో మరుగు న పడిన మక్తల్ నేడు అభివృద్ధిలో అగ్రభాగాన నిలుస్తోందని అన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టేం దుకు కౌన్సిలర్లు పోటీపడు తున్నారని, ఇది ప్రజల్లో పెరిగిన అభివృద్ధి ఆకాంక్ష కు నిదర్శనమని పేర్కొన్నా రు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

నియోజకవర్గంలోని సహజ వనరులను అమ్ముకుంటు న్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి ఖండించారు. పేదలు నిర్మించుకునే ఇళ్లు, ప్రభు త్వ అభివృద్ధి పనుల అవసరాల కోసమే ఇసుకను వినియోగిస్తు న్నామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధుల్లోనూ సింహభాగం తెలంగాణ ప్రజలు చెల్లించే పన్నుల రూపంలోనే సమకూరు తోందనే విషయాన్ని ప్రతిపక్షాలు గుర్తించాలని సూచించారు.మంత్రి అనే హోదాను పక్కనపెట్టి ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తు న్నానని తెలిపారు. మంచి ఎక్కడ జరిగినా గుర్తించాల ని, అభివృద్ధిలోని లోపాలనునిర్మాణాత్మకంగా సూచించాలే తప్ప, చెడును వెతుకుతూ అసత్య ప్రచా రాలు చేయడం సరికాద న్నారు. మన రాతలు మనమేమార్చుకోవాలని...ఖామోషీ బహుత్ ఖతర్నాక్ హై అంటూ ప్రజలు కూడా అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

మక్తల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మీడియా వేదికగా బహిరంగ చర్చకు తాను సిద్ధమని మంత్రి ప్రతిప క్షాలకు సవాల్ విసిరారు. మీరు లక్ష ప్రశ్నలు వేసినా ప్రతి ప్రశ్నకు ఆధారాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అభివృద్ధి గురించి తెలిసిన ప్రతి ఒక్కరూ ప్రతిపక్షాల విమర్శలకు వాస్తవాలతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.మక్తల్ పట్టణంలోని ప్రతి వార్డుకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా మని, గ్రామీణ ప్రాంతాల్లో నూ రహదారుల నిర్మాణా నికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.విమర్శలకు సమాధానం అభివృద్ధి పనులే.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తన లక్ష్యమని, మక్తల్‌ను అన్ని రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించబోనని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హన్మంతు, 7వ వార్డు కౌన్సిలర్ కలాల్ శ్రీవిద్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

కార్తీ కోత్సవ గోడపత్రిక ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి యాదగిరిగుట్ట నవంబర్ 7 (లోకల్ గైడ్) : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో కార్తీక శుద్ధ ఏకాదశి నుండి కార్తీక శుద్ధ త్రయోదశి వరకు నవంబర్ 20 నుండి 22 వరకు కార్తీకో త్సవం ను నిర్వహించనున్నారు. ఈ ఉత్సవానికి సంబంధించిన గోడ పత్రికను రాష్ట్ర రోడ్ల భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, ధైర్యసహసాలు పెంపొందించడానికి స్కాట్ ఎంతో ఉపయోగపడుతుంది.

జిల్లా కలెక్టర్ బి . చంద్రశేఖర్ .






నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ యశోదు బి చంద్రశేఖర్ జిల్లా కలెక్టర్ఉ ప్రెసిడెంట బి ఎస్ జి 76వ భారత్ స్కౌట్స్ ఉ గైడ్స్ ఫ్లాగ్ డే ఘనంగా నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ మరియు ప్రెసిడెంట్ గారికి జిల్లా సెక్రెటరీ చేతుల మీదుగా స్కార్ఫ్ వేసి స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులకు స్కౌట్ ప్రామిస్ చేయించడం జరిగింది. క్రమశిక్షణ ఉ ధైర్య సాహసాలు పెంపొందించుకోవడానికి విద్యార్థులు భారత్ స్కౌట్స్ ఉ గైడ్స్ సమస్త యందు చేరి బావి భారత పౌరులు గా తీర్చిదిద్దడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.ఇ. కరుణాకర్ జిల్లా సెక్రెటరీ బి ఎస్ జి నల్గొండ,జిల్లా వైస్ ప్రెసిడెంట్ సురేష్ గుప్తా పర్యావరణ ప్రేమికుడు , గైడ్ కెప్టెన్ సుజాత, స్కౌట్ మాస్టర్ శీను నాయక్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆర్. విమల సెంట్ అల్ఫోన్సెస్ హై స్కూల్ స్కౌట్ విద్యార్థులు, కే జి బి వి కట్టంగూర్ గైడ్స్ విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

సింగరేణి మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన గుడిపూడి తిరుమల రావు

పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి.. బాణసంచా కాల్చేటప్పుడు పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



కారేపల్లి(సింగరేణి), నవంబర్ 7 (లోకల్ గైడ్ న్యూస్) : దీపావళి పండుగను పురస్కరించుకొని సింగరేణి మండల ప్రజలకు కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో, కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. చిన్నారులను ఒంటరిగా టపాసులు కాల్చేందుకు అనుమతించకూడదని, పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చేలా చూడాలని తెలిపారు. టపాసులు కాల్చేటప్పుడు నీటి బకెట్, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని, మండే స్వభావం కలిగిన వస్తువులకు దూరంగా ఉండాలని, కాలిన దుస్తులతో బాణసంచా కాల్చకూడదని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా శబ్ద కాలుష్యం తగ్గించేలా పర్యావరణహిత దీపావళిని జరుపుకోవాలని కోరారు. పిల్లల భద్రతే తల్లిదండ్రుల మొదటి బాధ్యత అని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితమైన, సంతోషకరమైన దీపావళి వేడుకలు జరుపుకోవాలని గుడిపూడి తిరుమల రావు ఆకాంక్షించారు.

ఐపీఎస్ పాఠశాలలో ఘనంగా దీపావళి వేడుకలు

సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల సందడి



పెద్దపల్లి జిల్లా, నవంబర్ 7 (లోకల్ గైడ్) : సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ (ఐపీఎస్)లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది, దీపాలను వెలిగించి దీపావళి సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. విద్యార్థుల సందడితో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ హాజరై విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీపావళి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇటువంటి పండుగల నిర్వహణ ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని, బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సురక్షితమైన దీపావళిని జరుపుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు.ఈ వేడుకల్లో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సునీత ఉపాధ్యాయినులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

కరీంనగర్ డైరీ ఆస్థులను ప్రభుత్వ స్వాధీన పరుచుకోవాలి

కరీంనగర్ డైరీ క్రమాలపై సిబిఐ తో విచారణ జరిపించాలి

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఏఐబిపార్టీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్





కరీంనగర్ నవంబర్ 8 లోకల్ గైడ్ ప్రతినిధి : కరీంనగర్ డెయిరీ ఆస్తులను ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలి!కోట్ల లావాదేవీలు, పరిపాలనా మార్పులపై , ప్రభుత్వ భూములు మార్పులు పై సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఏఐబీపార్టీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు.వేలాది మంది పాడి రైతుల నిరంతర శ్రమ, పాల ప్యాకెట్ల అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయంతో రూపుదిద్దుకున్న కరీంనగర్ డెయిరీ ఆస్తులను తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. డెయిరీ స్థాపన నుండి నేటి వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ భూములు, బిల్డింగ్ లు మార్పులు మరియు పరిపాలనా విధానాలు మరియు చట్టపరమైన మార్పులపై సీబీఐ తో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు. డెయిరీ నిర్వహణలో పారదర్శకత పూర్తిగా లోపించిందని, రైతుల హక్కులను, ఆస్తులను కాపాడటానికి ప్రభుత్వ జోక్యం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. - విజయ డెయిరీ కాస్తా కరీంనగర్ డెయిరీగా ఎలా మారింది? -- అనేది ప్రజలు అన్నీ విషయాలు తెల్సుకోవాలని అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనగర్ ప్రాంతంలో ఉన్న కరీంనగర్ డెయిరీకి దాదాపు ఐదు దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. నేడు రాష్ట్రంలోనే అత్యంత ప్రముఖ పాల ఉత్పత్తి సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ సంస్థ ఒకప్పుడు ప్రభుత్వ పరిధిలోని 'విజయ డెయిరీ' పేరుతో కార్యకలాపాలు నిర్వహించేది. అయితే విజయ డెయిరీగా ఉన్న ఈ సంస్థ కరీంనగర్ డెయిరీగా ఎలా మారింది? ఈ మార్పు వెనుక ఉన్న చట్టపరమైన, పరిపాలనా పరిణామాలేమిటి? అనే విషయాలు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారాయన్నారు. కరీంనగర్ ప్రాంతంలో పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు 1971 అక్టోబర్ 16న అప్పటి ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు, వ్యవసాయ శాఖ మంత్రి జె. చొక్కారావుల కృషి ద్వారా రోజుకు 12 వేల లీటర్ల సామర్థ్యంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ డెయిరీ ప్రారంభమైందన్నారు. - విజయ డెయిరీ అనుబంధం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పరిధిలోని 'విజయ' బ్రాండ్ కిందే ప్రారంభంలో ఈ సంస్థ ఉత్పత్తులు అమ్ముడయ్యేవి. చట్టపరమైన మార్పులు 1997 - 2003 1997 వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న ఈ సంస్థ, 1964 సహకార సంఘాల చట్టం కింద నమోదు కాబడి, 2003 నాటికి 1995 పరస్పర సహాయక సహకార సంఘాల చట్టం కింద పునర్నమోదు చేయబడింది. బుల్లెట్ కంపెనీగా మార్పు జూన్ 1న 1956 కంపెనీల చట్టం ప్రకారం ఈ సంస్థను 'కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' గా మార్చారు. విజయ బ్రాండ్ స్థానంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి కోడె మొక్కు ప్రతీక అయిన 'నంది' లోగోతో కరీంనగర్ డెయిరీ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెచ్చారు అని తెలిపారు. రాజకీయ ఆరోపణలు - చుట్టుముట్టిన వివాదాలు కరీంనగర్ డెయిరీ నిర్వహణ, రైతుల ప్రయోజనాలు, పాల కొనుగోలు ధరలకు సంబంధించి అప్పట్లో తీవ్ర రాజకీయ వివాదాలు చెలరేగాయి. 2014లో అప్పటి కరీంనగర్ ఎంపీ ప్రస్తుతం మంత్రి పొన్నం ప్రభాకర్ డెయిరీ నిర్వహణ రైతులకు అందాల్సిన ప్రయోజనాలపై తీవ్రస్థాయిలో ఆరోపణలు లేవనెత్తారని గుర్తు?చేశారు. ప్రభుత్వ స్వాధీనం: వేలాది మంది రైతుల కష్టార్జితం, ప్యాకెట్ల విక్రయాల ద్వారా రూపుదిద్దుకున్న కరీంనగర్ డెయిరీ ఆస్తులన్నింటినీ ప్రభుత్వం వెంటనే తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలి. విజయ డెయిరీగా ఉన్న నాటి నుండి కంపెనీగా మారిన ఇప్పటి వరకు జరిగిన నిధుల మళ్లింపు, నిబంధనల ఉల్లంఘనలపై కేంద్రీయ దర్యాప్తు సంస్థ సిబీఐ తో విచారణ జరిపించాలి. రైతుల ప్రయోజనాల పరిరక్షణ: సహకార సూత్రాలకు విరుద్ధంగా సంస్థను ప్రైవేట్ లేదా కార్పొరేట్ తరహాలో నడపడాన్ని అడ్డుకొని, లాభాలన్నింటినీ నేరుగా పాడి రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలి. కరీంనగర్ డెయిరీ ఆస్తులు వేలాది రైతుల జీవనాధారమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ ఆదేశించకపోతే ఏఐఎఫ్బీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పేట జిల్లా కేంద్రంలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలి

పి డి ఎస్ యు




నారాయణపేట నవంబర్ 7:నారాయణపేట జిల్లా కేంద్రంలో పీజీ కళాశాల ను ఏర్పాటు చేయాలని పిడి ఎస్ యు రాష్ట్ర నాయకు లు మారుతి ,జిల్లా అధ్యక్షు డు వెంకటేష్,జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. నారా యణపేట జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని పిడిఎస్ యు ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ విసి శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారుఈ సందర్భం గా వారు మాట్లాడుతూ నారాయణపేట జిల్లా లో చదువుతున్న విద్యార్థులు డిగ్రీ పూర్తి అయిన తర్వాత పై చదువుల కోసం, మహ బూబ్నగర్, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లవ లసిన పరిస్థితి ఏర్పడతా ఉన్నది. హార్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనేక మంది విద్యార్థులు పై చదు వుల కోసం దూరప్రాంత లకు వెళ్లలేక చదువుకు దూరమైతున్న పరిస్థితి ఈ ప్రాంతంలో ఉన్నది. నారా యణపేట జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని గత దశాబ్ద లుగా ఉద్యమాలు కొనసా గిస్తున్నప్పటికిని ప్రభుత్వం లో చలనం లేని పరిస్థితి ఉన్నదన్నారు. వెంటనే నారాయణపేట జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నారా యణపేట జిల్లా కేంద్రంలో ఉన్న శ్రీ చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ల్యాబ్ లను నిర్వహించుకోవడం కోసం కావలసిన వస్తువులు కూడా లేకపోవడం సిగ్గుచే టు అని అన్నారు. అంతే కాకుండా టాయిలెట్స్ కూడా సరిగా లేవు అని, బ్లాక్ బోర్డ్, ఫ్యాన్స్, లైబ్రరీ, ఇలా అనేక సమస్యలతో ఆ కాలేజీలో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్న పరిస్థి తి ఉందని అందుకని ఆ సమస్యలను వెంటనే పరిష్కరించుకోవడం కోసం ఆ కాలేజీకి నిధులు కేటా యించాలని వారుడిమాండ్ చేశారు. ఒకవేళ లేని పక్షం లో యూనివర్సిటీ ముట్ట డిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి. ఎస్.యు జిల్లా కార్యదర్శి మహేష్, జిల్లా సహాయ కార్యదర్శి రాజు, జిల్లా నాయకులు సురేష్, నరసింహ పాల్గొన్నారు.

హాకింపేట ప్యాకేజీని మక్తల్ -నారాయణపేట

- ఎత్తిపో తల పథకం భూనిర్వాసి తులకు వర్తింప చేయాలి

భూనిర్వాసితుల సంఘం డిమాండ్



నారాయణపేట నవంబర్ 7: హకీంపేట లగాచర్ల భూ నిర్వాసితులకు ఇచ్చిన పరిహారం నారాయణపేట మక్తల్ నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకం నిర్వాసితులకు వర్తింప చేయాలని నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షులు జి వెంకట్రాం రెడ్డి, ఉపా ఉపాధ్యక్షులు ధర్మరాజు గౌడ్, గోపాల్ రెడ్డి, గోపాల్ డిమాండ్ చేశారు .శనివారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ దగ్గర ప్లే కార్డ్స్ పట్టు కొని నిరసన తెలియ జేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఉమ్మడి పాలమూరు జిల్లా వాసి అయి ఉండి హాక్కింపేట, లగచర్ల భూనిర్వాసితులకు ఒక న్యాయం మక్తల్ నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు మరో న్యాయం చేయడం సరైంది కాదన్నారు.మక్తల్ నారాయ ణపేట కొడంగల్ఎత్తిపోతల భూ నిర్వాసితులపై వివక్షత పూరితంగా ఉన్న తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులు గొంతెమ్మ కోరికలు కోరట్లేదన్నారు హాకింపేట లగాచర్లలో ఎకరముకు 25 లక్షల రూపాయలతో పాటు ప్లాట్లు ఇందిరమ్మ ఇల్లు తదితర ప్రయోజనాలు కల్పించరన్నారు.తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి వినతి పత్రం అందజేయాలని సమావే శంలో నిర్ణయించుకోవడం జరిగిందన్నారుఈ నిరసన కార్యక్రమంలో భూ నిర్వా సితుల సంఘం సలహాదా రులు బండమీది బలరాం, నాయకులు నర్సింలు , ఆంజనేయులు,లక్ష్మీకాంత్,మహేష్ కుమార్ గౌడ్ ,మొగులప్ప, ఆంజనేయు లు,నారాయ ణ,రవి,వెంకటప్ప,కురుమూర్తి, రాజుగౌడ్, నర్సిం లు,నరసప్ప నర్సింలు గౌడ్,శివప్పయ్య తదితరు లు పాల్గొన్నారు


పంతంగి లో మద్యపానం నిషేధిస్తూ ఏకగ్రీవ తీర్మానం.. అభినందించిన సీఐ



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి చౌటుప్పల్ నవంబర్ 7 (లోకల్ గైడ్): చౌటుప్పల మండలం లోని పంతంగి గ్రామంలో మద్యపానం నిషేధం బెల్ట్ షాపులను బందు చేయాలని శనివారం జరిగిన గ్రామసభలో అధికార, ప్రతిపక్ష రాజకీయ నాయకులు ప్రజలు ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చౌటుప్పల ఇన్స్పెక్టర్ దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మద్యపానం అమ్మిన తయారు చేసిన సమాచారం అందించాలని బెల్టు షాపులపై దాడి చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మద్యపానం, బెల్ట్ షాపుల నిషేధంపై మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత సుందర్ ఉపసర్పంచ్ బోయ సదానందం పంతంగి కార్యదర్శి కె పద్మజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయ దేవేందర్, టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కడగంచి చలమంద రాజు ,సిపిఎం నాయకులు రాజు మాజీ సర్పంచ్ చీరిక సంజీవరెడ్డి, బోయ అంబేద్కర్, బోయ రామచందర్, ప్రభాకర్ రెడ్డి, హరిత, కిరణ్, నరేష్, శేఖ,ర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మురస తుఫాను దెబ్బ.. రైతుకు కన్నీటి శాపం!

పంట నష్టంపై తక్షణ సర్వే చేపట్టి ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి -- సీపీఎం నేత కే. నరేంద్ర డిమాండ్



కారేపల్లి, నవంబర్ 7 (లోకల్ గైడ్ న్యూస్): మురస తుఫాను రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో నేలకొరగడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో సింగరేణి మండలంలోని పలు గ్రామాల్లో వరి, మిర్చి తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సింగరేణి మండలం ఎర్రబోడు గ్రామానికి చెందిన రైతు కురుసం శ్రీను సాగు చేసిన వరి పంట నేలవాలడంతో తీవ్రంగా నష్టపోయాడు. నవంబర్ చివరి నాటికి కోతకు సిద్ధం కావాల్సిన పంట తుఫాను దెబ్బకు నేలకొరగడంతో పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగిరాని పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు సుమారు రూ.30 వేల వరకు ఖర్చు చేసి, అప్పులు తెచ్చి సాగు చేశానని రైతు శ్రీను ఆవేదన వ్యక్తం చేశాడు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, దుక్కి దున్నడం వరకు అన్ని ఖర్చులు భరించి పంటను కాపాడుకుంటూ వస్తే ప్రకృతి వైపరీత్యం తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని వాపోయాడు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. ఈ సందర్భంగా సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర మాట్లాడుతూ.. ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, సాగు పెట్టుబడుల భారంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు మురస తుఫాను మరో గట్టి దెబ్బగా మారిందన్నారు. రైతులు తమ కుటుంబ సభ్యుల కంటే మిన్నగా భావించి పెంచుకున్న పంటలు కళ్లముందే నేలపాలు కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాను కారణంగా నష్టపోయిన వరి, మిర్చి, ఇతర పంటల రైతులను వ్యవసాయ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర పంట నష్టం అంచనా వేయాలని కే. నరేంద్ర డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, రైతు కుటుంబాల జీవనానికి తోడ్పడేలా 14 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, తక్షణమే పరిహారం ప్రకటించి రైతులకు అండగా నిలవాలని అన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతులకు న్యాయం చేయకపోతే రైతులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని కే. నరేంద్ర హెచ్చరించారు.

రైతులు, కూలీల సంక్షేమానికి పెద్దపీట.. మొట్లగూడెం సర్పంచ్ పొడుగు పెంటయ్య పిలుపు

జాబ్ కార్డులు, ఇంకుడు గుంతలు, వ్యవసాయ కుంటలకు దరఖాస్తుల ఆహ్వానం..

సోమవారం గ్రామసభ



కారేపల్లి, నవంబర్ 7 (లోకల్ గైడ్ న్యూస్): గ్రామంలోని రైతులు, కూలీల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మొట్లగూడెం గ్రామ సర్పంచ్ పొడుగు పెంటయ్య పిలుపునిచ్చారు. వీబీజీ రామ్‌జీ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు అర్హులైన ప్రజలు, రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారు కొత్త జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఇప్పటికే జాబ్ కార్డులు ఉన్నవారు పేర్ల జత, తొలగింపు, కుటుంబ సభ్యుల విభజన వంటి మార్పుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే గతంలో ఇంకుడు గుంతలు మంజూరు కాని, ప్రస్తుతం లేని వారు కొత్తగా నిర్మించుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఐదు ఎకరాల్లోపు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ కుంటలు, ఫామ్ పాండ్స్ నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభమైనందున పని చేయడానికి ఆసక్తి ఉన్న కూలీలు ముందుగానే తమ పని డిమాండ్‌ను గ్రామ ఉపాధి హామీ సిబ్బంది లేదా మేట్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అంశాలపై చర్చించి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు లిసోమవారం 9వ తేదీ ఉదయం 10:30 గంటలకు మొట్లగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించనున్నట్లుల సర్పంచ్ పొడుగు పెంటయ్య వెల్లడించారు. కావున గ్రామ ప్రజలు, రైతులు, కూలీలు, ప్రజాప్రతినిధులు గ్రామసభకు తప్పనిసరిగా హాజరై ప్రభుత్వ పథకాల ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పొడుగు పెంటయ్య, గ్రామ పంచాయతీ పాలకవర్గం కోరారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ యువ నాయకులు.. మిరియాల ప్రీతమ్

కేక్ కట్ చేసి పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



సైబరాబాద్, నవంబర్ 07 (లోకల్ గైడ్ ప్రతినిధి బి ఎన్ చంద్ర): శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మిరియాల ప్రీతమ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మిరియాల ప్రీతమ్‌తో పాటు ఆయన సతీమణి యామిని దివ్య పాల్గొని కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు నింపేలా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్ళ జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చేపడుతున్న కార్యక్రమాలు మరింత విజయవంతం కావాలని కోరుకున్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన స్కూల్ బ్యాగులను అందించడం ద్వారా విద్యకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో ముడిపెట్టి నిర్వహించడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి

ఆత్మహత్యల నివారణకు విస్తృత అవగాహన కల్పించాలి: కలెక్టర్ రాజర్షి షా

అదిలాబాదు లోకల్ గైడ్ నవంబర్ 7 : ఎల్‌నినో ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల్లో భరోసా కల్పించాలని, పంట రుణాల రీషెడ్యూలింగ్‌పై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. రైతుల ఆత్మహత్యల నివారణకు గ్రామస్థాయిలో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శనివారం సంబంధిత శాఖల అధికారులు, డీఆర్‌డీఓ, జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఎంపీడీఓలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో రైతుల సంక్షేమం, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, ఆత్మహత్యల నివారణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో 33 శాతానికి పైగా పంట నష్టం జరిగిన రైతుల వివరాలను వ్యవసాయ శాఖ వేగంగా సేకరించి సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. రైతులు తీసుకున్న పంట రుణాలను బ్యాంకుల ద్వారా రీషెడ్యూల్ చేసేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ వెసులుబాటుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయక చర్యలు, బ్యాంకులు కల్పిస్తున్న రుణ సదుపాయాలపై రైతులకు సరైన సమాచారం చేరవేయాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించాలి, విస్తృత ప్రచారం చేపట్టాలని డీపీఓ, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రైతుల్లో ఉన్న అపోహలు, ఆందోళనలను తొలగించి ధైర్యం కల్పించాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆత్మహత్యల నివారణకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం పింఛన్ దరఖాస్తులు, దివ్యాంగుల యూడీఐడీ ధ్రువీకరణ పత్రాలు, బీడీ కార్మికుల పింఛన్లపై సమీక్షించారు. అనర్హులు, సందేహాస్పదంగా ఉన్న కేసులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ జరపాలని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


ఓటరు జాబితాలో పేరు తొలగింపునకు గురైన వారికి మరో అవకాశం

ఎన్యుమరేషన్ ఫారం సమర్పించి ఓటు హక్కును పునరుద్ధరించుకోవాలి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్




అదిలాబాదులో కలిగే నవంబర్ 7 : ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగింపునకు గురైన వారికి తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏఎస్‌డీ జాబితాలో పేర్లు ఉన్నవారు మరోసారి ఎన్యుమరేషన్ ఫారం నింపి సమర్పించడం ద్వారా ఓటరు జాబితాలో తమ పేరును పునరుద్ధరించుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్న అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్ మాట్లాడుతూ, ఏఎస్‌డీ జాబితాను ప్రతి పోలింగ్ కేంద్రం, గ్రామపంచాయతీ నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు, ఓటర్లందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఏఎస్‌డీ జాబితాలో పేర్లు ఉండి, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు నిబంధనల ప్రకారం ఫారం-సి ద్వారా మరోసారి ఎన్యుమరేషన్ ఫారం సమర్పించవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియపై నియోజకవర్గ, జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పూర్తి వివరాలను తెలియజేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా చర్యలు చేపట్టి, ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఓటరు జాబితాలో పేరు తొలగింపునకు గురైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు రెవెన్యూ కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, డీఆర్‌ఓ ప్రవంతి, ఎన్నికల పర్యవేక్షణ అధికారి నలందప్రియ, నాయబ్ తహసీల్దార్ మధుసూదన్, వివిధ మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ కమిటీ ఎన్నిక



బహుజన సమాజ్ పార్టీ వికారాబాద్ నియోజకవర్గ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ ఇంచార్జీలుగా ఫిరంగి జనార్ధన్, శ్యామ్ అధ్యక్షుడిగా మహేందర్, ఉపాధ్యక్షులుగా వేణు, కార్యదర్శిగా అశోక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ముద్దమల్లప్ప గెస్ట్ హౌస్ లో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి బీఎస్పీ పార్లమెంట్ చేవెళ్ల ఇంచార్జ్ సయ్యద్ అమీర్, జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా కన్వీనర్ సౌమ్య, తాండూర్ నియోజకవర్గం అధ్యక్షులు మ్యాతరి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు టిప్పర్ శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్, కుమార్, అడికె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికైన నారాయణపేట విద్యార్థి



నారాయణపేట నవంబర్ 7: నారాయణపేటలోని శ్రీ సాయి జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి మహ్మద్ అఫ్వాన్ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికయ్యాడు. మధ్యప్రదే శ్‌లో జరగనున్న ఈ జాతీ య స్థాయి పోటీల్లో తెలం గాణ జట్టు తరపున అఫ్వా న్ పాల్గొననున్నాడు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో అద్భు త ప్రతిభ కనబరిచి, తన క్రీడా నైపుణ్యాన్ని చాటుకు న్న అఫ్వాన్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల కళాశాల యాజమా న్యం హర్షం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా శ్రీ సాయి జూనియర్ కళాశాల ప్రిన్సి పాల్ రామకృష్ణ అఫ్వాన్ ను ప్రత్యేకంగా అభినందిం చి, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబ రిచి తెలంగాణ రాష్ట్రానికి, నారాయణపేట జిల్లాకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి స్తూ శుభాకాంక్షలు తెలిపా రు. ఎన్‌డీసీఏ క్రికెట్ కోచ్ అజయ్ అఫ్వాన్‌ను అభినందించారు.ఈ విజ యంపై కళాశాల అధ్యాప కులు, విద్యార్థులు, కుటుం బ సభ్యులు, క్రీడాభిమాను లు హర్షం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి

జిల్లా అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.



నారాయణపేట నవంబర్ 7: నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో ఈ నెల 8 న నిర్మించిన సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియం ప్రారంభోత్సవానికి ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీ గా చేపట్టాలని జిల్లా రెవె న్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అధికారులను ఆదేశించా రు.ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో భాగంగా శని వారం కోస్గి పట్టణంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్‌లో ఏఎస్ఎల్ (అడ్వా న్స్‌డ్ సెక్యూరిటీ లైజన్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ కొడం గల్ నుంచి కోస్గి పట్టణానికి ముఖ్యమంత్రి ప్రయాణించే రహదారి మార్గంలో ఎలాం టి ఇబ్బందులు తలెత్త కుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించా రు. ముఖ్యంగా ఇరుకైన రహదారులు, కీలక కూడ ళ్లు, రద్దీ ప్రాంతాలను గుర్తిం చి అవసరమైన చోట్ల రహ దారి మరమ్మతులు, పారి శుద్ధ్య పనులు, బ్యారికే డింగ్ తదితర ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబం ధిత అధికారులను ఆదే శించారు.ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలో రహదారులకు ఇరువైపులా ఎలాంటి అవరోధాలు లేకుండా చూడాలని, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తమకు కేటాయించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటనలో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి కొడంగల్ నుంచి కోస్గి పట్టణానికి వచ్చే రహదారి మార్గంలో పటి ష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇరుకైన రోడ్లు, మలుపులు, కూడళ్ల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని, ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలో ప్రజలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతిని ధులు అనధికారికంగా భద్రతా పరిధిలోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవా లని తెలిపారు. అవసర మైన ప్రాంతాల్లో సెక్యూరిటీ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, ప్రవేశ మార్గాల వద్ద పటిష్ట మైన నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని, అత్య వసర వాహనాల రాకపోక లకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, విజయవం తంగా జరిగేలా అన్ని శాఖ ల అధికారులు పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రియా జ్ హుల్ హక్, ఏ ఎస్ ఎల్ (ఐఎస్ డబ్ల్యు) ఎస్పీ రామచందర్, డీఎస్పీ నర్సిరెడ్డి, నారాయణపేట డీఎస్పీలు నల్లపు లింగ య్య, మహేశ్, కోస్గి తహ సీల్దార్ కల్యాణి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఎంపీ డీవో శ్రీధర్, సంబంధిత పోలీసు, రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖల అధికా రులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తతే రక్షణ

-- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

వారం రోజుల వ్యవధిలో జిల్లాలో 23 సైబర్ ఫిర్యాదులు

ఆన్‌లైన్ కొనుగోళ్లు, యూపీఐ లావాదేవీలు, నకిలీ పెట్టుబడులు,

ఓటీపీ మోసాలపై అప్రమత్తత అవసరం

అధిక లాభాలు, గిఫ్ట్ ఆఫర్లు, నకిలీ లోన్‌ల పేరుతో సైబర్ మోసాలు

సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి



అదిలాబాద్ లోకల్ గైడ్ నవంబర్ 7 : ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడుతూ ప్రజల డబ్బును దోచుకుంటున్నారని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఆన్‌లైన్ కొనుగోళ్లు, యూపీఐ లావాదేవీలు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఓటీపీ మోసాలు, నకిలీ లోన్ ఆఫర్లు, సోషల్ మీడియా ఖాతాల హ్యాకింగ్ వంటి ఘటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత వారం రోజుల వ్యవధిలో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 23 సైబర్ ఫిర్యాదులు నమోదైనట్లు వెల్లడైంది. బాధితులు వివిధ రకాల సైబర్ మోసాలకు గురైనట్లు ఫిర్యాదులు అందాయి. నమోదైన ఫిర్యాదుల్లో కొన్ని ఉదాహరణలు: 1. అనధికారిక లావాదేవీల ద్వారా మోసం: ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడి అనుమతి లేకుండా బ్యాంకు ఖాతా నుండి రూ.5,500 నగదు బదిలీ అయినట్లు ఫిర్యాదు నమోదైంది.2. ఆన్‌లైన్ కొనుగోలు మోసం: గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా వస్తువు కొనుగోలు చేయగా, డబ్బులు చెల్లించినప్పటికీ వస్తువు డెలివరీ చేయకుండా విక్రేత ఫోన్‌లకు స్పందించకపోవడంతో సుమారు రూ.8,020 మోసపోయినట్లు ఫిర్యాదు నమోదైంది. 3. నకిలీ లింకుల ద్వారా సోషల్ మీడియా ఖాతాల హ్యాకింగ్: గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి ల్యాప్‌టాప్‌లో వచ్చిన అనుమానాస్పద లింకును క్లిక్ చేయడంతో అతని సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఇతరులకు నకిలీ సందేశాలు పంపుతున్నట్లు గుర్తించి ఫిర్యాదు చేశాడు. 4. టెలిగ్రామ్ ద్వారా సేవల పేరుతో మోసం: మావల పోలీస్ స్టేషన్ పరిధిలో టెలిగ్రామ్ ఛానల్ ద్వారా హ్యాండ్‌రైటింగ్ సేవలు అందిస్తామని నమ్మించి బాధితుడి నుంచి రూ.22,695 వసూలు చేసినట్లు ఫిర్యాదు నమోదైంది. 5. ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల ద్వారా వ్యాపార మోసం: ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనను నమ్మి హోల్‌సేల్ దుస్తులు కొనుగోలు చేయగా, డబ్బులు చెల్లించినప్పటికీ వస్తువులు పంపకుండా, చెల్లించిన నగదును తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు రూ.31,887కు సంబంధించిన ఫిర్యాదు నమోదైంది.6. నకిలీ పెట్టుబడి పథకాల ద్వారా మోసం: ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో టెలిగ్రామ్ ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మించి బాధితుడి నుంచి పలుమార్లు నగదు పెట్టుబడిగా తీసుకొని, లాభాలు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు ఫిర్యాదు నమోదైంది.సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు: గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దు. బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్‌లను ఎవరికీ తెలియజేయవద్దు. ఆన్‌లైన్ కొనుగోళ్లలో అధికారిక, నమ్మకమైన వెబ్‌సైట్లనే ఉపయోగించాలి. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయనే ప్రకటనలను నమ్మవద్దు. సోషల్ మీడియా ద్వారా వచ్చే ఉద్యోగాలు, వ్యాపారాలు, ఫ్రాంచైజీ ఆఫర్లను పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలి. అనుమానాస్పద లోన్ యాప్‌లను ఉపయోగించవద్దు. తెలియని వ్యక్తులు చెప్పిన సూచనలతో మొబైల్‌లో అనుమానాస్పద అప్లికేషన్లు ఇన్‌స్టాల్ చేయవద్దు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి, ఞఞఞ.ఎఎవతీ-ఠితీఐఎవ.ప్రశీఙ.ఱఅ ద్వారా ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును గుర్తించి నిలిపివేసే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి డబ్బులు పంపవద్దని సూచించారు.

హామీల అమలులో సీఎం రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం తగదు.

తక్షణమే అమలు చేయాలి.

ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు డిమాండ్


వెల్మ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన జువ్వాడి నర్సింగారావు ను సన్మానించిన ఓసీ జేఏసీ నేతలు



కరీంనగర్ నవంబర్ 7 లోకల్ గైడ్ ప్రతినిధి : రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్ గా శనివారం హైదరాబాద్ లోని మైత్రి వనం లోని కార్యాలయం లో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన జువ్వాడి నర్సింగారావు ను ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ఆధ్వర్యంలో నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం హకీంపేట్ లోని ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ పద్మనాయక కళ్యాణ మంటపం లో నిర్వహించిన జువ్వాడి నర్సింగరావు ఆత్మీయ సన్మాన కార్యక్రమం లో నిర్వహించిన కార్యక్రమంలో ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు హాజరై మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకట్ స్వామి,రాజ్యసభ మాజీ సభ్యులు, వైస్ రాజశేఖర్ రెడ్డి స్నేహితుడు డాక్టర్ కేవీపీ రాంచందర్ రావు,జగిత్యాల ఎం ఎల్ ఏ డాక్టర్ సంజయ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ,భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాంగుండం ఎం ఎల్ ఏ మక్కాన్ సింగ్ టాగూర్,ఆల్ ఇండియా వెల్మ అసోసియేషన్ అధ్యక్షులు పాపారావు, ఉపాధ్యక్షులు తాండ్ర శ్రీనివాస్ రావు,ఉమ్మడి వరంగల్ జిల్లా వెల్మ అసోసియేషన్ అధ్యక్షుడు, ఓసీ జేఏసీ రాష్ట్ర కోశాదికారి నడిపెల్లి వెంకటేశ్వర్ రావు, వరంగల్ జిల్లా ఓసీ జేఏసీ అధ్యక్షుడు కోలగూరి రాజేశ్వర్ రావు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వెలమ సంఘాల అధ్యక్షుడు నీలగిరి హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి బల్మూరి ప్రసాద్ రావు,సిరిసిల్ల జిల్లా వెల్మ అసోసియేషన్ అధ్యక్షులు కమలాకర్ రావు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు మనోహర్ రావు, జగిత్యాల జిల్లా వెలమ అసోసియేషన్ అధ్యక్షులు ఐలినేని సాగర్ రావు, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కిషన్ రావు, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు వెంకట రమణ రావు ఓసీ జేఏసీ రాష్ట్ర నాయకులు జనగామ కరుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓసీ ఐకాస జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో వివిధ ఓసీ సామాజిక వర్గాల పేదల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు కేటాయించి ఓసీ ల కార్పొరేషన్ లు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అధికారం లోకి వచ్చి 3 ఏళ్ళు గడుస్తున్నా ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రస్తుతం వెలమ, వైశ్య, కమ్మ,కార్పొరేషన్ లను నామ మాత్రంగా ప్రకటించి ఎలాంటి నిధులు కేటాయించక కేవలం అధ్యక్షులను మాత్రమే ప్రకటించి పూర్తి స్థాయి పాలక మండల్లు ఏర్పాటు చేయలేదన్నారు. నామ మాత్రంగా ప్రకటించిన రెడ్డి కార్పొరేషన్ కు ఎలాంటి నిధులు కేటాయించక నేటికీ అధ్యక్షున్ని సైతం ప్రకటించక పాలక వర్గాన్ని కూడా ఏర్పాటు చెయక నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. తక్షణమే ఇచ్చిన హామీల ప్రకారం అన్ని ఓసీ కార్పొరేషన్ లకు చట్టబద్ధత గల పూర్తి స్థాయి పాలక మండల్లు ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని రామారావు డిమాండ్ చేశారు.అన్ని వర్గాల ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు విదేశీ విద్యానిది పథకాన్ని వర్తింప జేయాలాన్నారు. సమావేశనికి హాజరైన డాక్టర్ కేవీపీ రాంచందర్ రావు ను ఓసీ జేఏసీ తరపున పోలాడి రామారావు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది వెలమ బంధువుల తో పాటు వివిధ సామాజిక వర్గాల ప్రజలు ఓసీ జేఏసీ రాష్ట్ర జిల్లాల నాయకులు పాల్గొన్నారు...

రాయదుర్గం సదర్ మహోత్సవానికి బేరి రామచందర్ యాదవ్‌కు ఆహ్వానం

ఐక్యతకు, సంప్రదాయాలకు ప్రతీక సదర్ పండుగ.. బేరి రామచందర్ యాదవ్



సైబరాబాద్, నవంబర్ 07 (లోకల్ గైడ్ ప్రతినిధి బి ఎన్ చంద్ర): రాయదుర్గం యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదర్ మహోత్సవానికి బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్‌ను గోకుల్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దానబోయిన రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి నాగపురి అశోక్ యాదవ్, నాగపురి శ్యామ్ యాదవ్, దానబోయిన దినేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ..గత 60 సంవత్సరాలుగా రాయదుర్గం యాదవ సంఘం పెద్దలు, నాయకులు సదర్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. సదర్ పండుగ ఐక్యతకు, సంప్రదాయాలకు ప్రతీక అని, పాడి పశువులను పూజిస్తూ నిర్వహించే ఈ పండుగ యాదవుల సంస్కృతి, వైభవానికి నిదర్శనమని అన్నారు. డోలు, సన్నాయి మేళాలు, కళాకారుల ప్రదర్శనలు, దున్నపోతుల విన్యాసాలతో సదర్ పండుగ సంబరాలు, సరదాలకు వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ వేడుకకు ప్రజాప్రతినిధులు, యాదవ బంధువులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, వల్లాల నవీన్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మారబోయిన భిక్షపతి యాదవ్‌తో పాటు మాధవరం నర్సింగ్ యాదవ్, రవికుమార్ యాదవ్, రఘునాథ్ యాదవ్, జగదీశ్వర్ గౌడ్, మక్తాల కృష్ణ గౌడ్, గొర్ల వెంకటేష్ యాదవ్, గోదా నరేందర్ యాదవ్, కాశ్యం అశోక్ యాదవ్, చిట్టబోయిన లడ్డు యాదవ్, కృష్ణ యాదవ్, చిట్టబోయిన నందకిషోర్ యాదవ్, వాసేపల్లి గంగాధర్ రెడ్డి, కొమిరిశెట్టి సాయిబాబా యాదవ్, బొంతు శ్రీదేవి యాదవ్, రాగం నాగేందర్ యాదవ్, గొంటి శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, వేమూరి రాములు గౌడ్, మన్నె గంగయ్య ముదిరాజ్, బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, కోమలి నాయక్, సాయి ప్రసాద్, భూపతి జహంగీర్ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొననున్నారు.

బోయిని అనూష మహేష్ యాదవ్ జన్మదిన వేడుకలు

-మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు



సైబరాబాద్, నవంబర్ 07 (లోకల్ గైడ్ ప్రతినిధి బి ఎన్ చంద్ర): బోయిని అనూష మహేష్ యాదవ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్‌ను ఆయన నివాసంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనూష మహేష్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ భేటీలో పరస్పరం ఆప్యాయంగా పలకరించుకుని స్నేహపూర్వకంగా ముచ్చటించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, దేవేందర్ దాస్, అఖిల్ యాదవ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

మున్సిపల్ కార్పొరేషన్ లో ఘనంగా దీపావళి వేడుకలు



కరీంనగర్ నవంబర్ 7 లోకల్నగైడ్ ప్రతినిధి : కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన లక్ష్మీపూజ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు దీపావళి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లుమాసం గణేష్, చాడగొండ బుచ్చిరెడ్డి, అడిషనల్ కమిషనర్లు వేణుమాధవ్, ఖాదర్ మోహియోద్దీన్, అయాజ్ మరియు అధికారులు సిబ్బంది సునీల్ కుమార్, సుంచు నర్సయ్య, టి.వెంకటేష్, దుర్గం సంధ్య, తేజస్విని, హరిత, త్రివేణి, విజయలక్ష్మి, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం వికారాబాద్ హా... లేక కొడంగల్ హా...

బి ఆర్ ఎస్ వికారాబాద్ జిల్లా యువ నాయకులు కే అనిల్ కుమార్.



లోకల్ గైడ్, వికారాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి : నాడు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాలను అభివృద్ధి చేశారని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు, నేడు ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కొడంగల్ లో సుమారు రూ. 9,000 కోట్లకు పైగా పెట్టుబడులతో భారీ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. మరి వికారాబాద్ జిల్లా కేంద్రం అభివృద్ధి పరిస్థితి ఏమిటని టిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు కుంటోళ్ల అనిల్ కుమార్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గానికి భారీ నిధులు, పరిశ్రమలు కేటాయిస్తూ, జిల్లా కేంద్రమైన వికారాబాద్ ను విస్మరించడం సరికాదన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రం నుంచి గెలిచి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గా ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్ అభివృద్ధిపై బాధ్యత వహించాలన్నారు.కొడంగల్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి చప్పట్లు కొట్టి రావడమే ఆయన బాధ్యత కాదని విమర్శించారు. వికారాబాద్ జిల్లా ప్రజలకు కూడా పరిశ్రమలు, మెరుగైన రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యం మరియు యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకే జిల్లాలో రెండు ప్రాంతాల మధ్య అభివృద్ధిలో వ్యత్యాసం చూపడం పట్ల ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వానికి మా ప్రశ్న ఒక్కటే – జిల్లా కేంద్రం వికారాబాద్ కు నిధులు ఎప్పుడు? పరిశ్రమలు ఎప్పుడు? ఉద్యోగాలు ఎప్పుడు? అని ప్రశ్నించారు..

డిసెంబర్ 9న చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

కోమరం భీమ్ విగ్రహం వద్ద సభ కరపత్రాన్ని ఆవిష్కరించిన తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కాపుల నాగరాజు



దుమ్ముగూడెం : లోకల్ గైడ్ న్యూస్ : డిసెంబర్ 9న హైదరాబాద్లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం దుమ్ముగూడెం మండల తుడుందెబ్బ కమిటీ ఆధ్వర్యంలో కోమరం భీమ్ విగ్రహం వద్ద తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కాపుల నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలు, ఆదివాసీ హక్కులు, చట్టాల ఉల్లంఘనలపై ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ లంబాడా సమస్యపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించేందుకు ఆదివాసీ యువతీ యువకులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణతో పాటు సహజ వనరుల దోపిడీకి వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణే లక్ష్యం.. జాతి అస్తిత్వమే మన పోరాటం"లిలి అనే నినాదంతో డిసెంబర్ 9న హైదరాబాద్లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, కణితి బాలు, జగదీష్, రమేష్, శంకర్, నర్సింహారావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సేవకురాలికి ఎర్రజెండా సెల్యూట్..

రంగమ్మకు ఘన నివాళి



సీపీఐ గ్రామ శాఖ సభ్యురాలి మృతికి పార్టీ నేతల సంతాపం.. పార్టీ జెండా కప్పి కన్నీటి వీడ్కోలు

కారేపల్లి, నవంబర్ 7 (లోకల్ గైడ్ న్యూస్): కారేపల్లి మండలం బాజుమల్లాయగూడెం గ్రామానికి చెందిన అంగన్వాడీ విశ్రాంతి ఉద్యోగి, సీపీఐ గ్రామ శాఖ సభ్యురాలు కామ్రేడ్ పుసులూరి రంగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల సీపీఐ నాయకులు, కార్యకర్తలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రంగమ్మ పార్థివదేహంపై పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. అంగన్వాడీ ఉద్యోగిగా పనిచేస్తూ ఎన్నో ఏళ్లపాటు ప్రజలకు సేవలందించడంతో పాటు, పార్టీ గ్రామ శాఖ సభ్యురాలిగా పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేశారని నాయకులు గుర్తుచేసుకున్నారు. ఆమె సేవలు, పార్టీ పట్ల చూపిన అంకితభావం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆమె మరణం పార్టీకి తీరని లోటని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, వైరా నియోజకవర్గ ఇన్చార్జి కామ్రేడ్ ఎర్రబాబు, రాష్ట్ర సమితి సభ్యురాలు కామ్రేడ్ ఏపూరి లతాదేవి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకురాలు సీహెచ్ సీతామహాలక్ష్మి, జిల్లా సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్, బాజుమల్లాయగూడెం సర్పంచ్ కోరం కోటమ్మ, నాయకులు భాగం వెంకటేశ్వర్లు, ముత్తినేని మోహన్రావు, కట్టికోల వెంకటేశ్వర్లు, దాసరి కరుణాకర్ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

గురుకుల హాస్టల్ వార్డెన్ గా అరుణాదేవి సేవలు అభినందనీయం...

బీజేపీ నేత యాదగిరి సునీల్ రావు



కరీంనగర్ నవంబర్ 7 లోకల్ గైడ్ ప్రతినిధి : కరీంనగర్ భగత్ నగర్ కు చెందిన అరుణాదేవి సాంఘిక సంక్షేమ శాఖలో గురుకుల హాస్టల్ వార్డెన్ గా 38 సంవత్సరాల సుదీర్ఘమైన, నిస్వార్థమైన సేవలు అందించడం అభినందనీయమని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మే యర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. నగరంలో నిర్వహించిన అరుణాదేవి పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో యాదగిరి సునీల్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణాదేవి- నరసింహస్వామి దంపతులను ఘనంగా సన్మానించి రిటైర్మెంట్ డే విషెస్ తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అరుణా దేవి 38 సంవత్సరాలు గురుకుల హాస్టల్ వార్డెన్ గా ఎంతోమంది విద్యార్థుల బాగోగులను చూసుకొని ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఇందులో భగత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తోకల భూమేశ్వర్, వడ్డే శ్రీరామ్ రెడ్డి, చీకోటి గాంధీ, వెంకటేశ్వరరావు, ఎనగందుల వెంకన్న, తదితరులు ఉన్నారు.

రిమ్స్ ఆసుపత్రిలో రూ 32 లక్షల విలువ చేసే వెంటిలేటర్ల చోరీ కేసు ఛేదన

టెక్నీషియన్ల ముసుగులో వచ్చి వెంటిలేటర్ల చోరీ

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

-- నాలుగు వెంటిలేటర్లు స్వాధీనం

ముగ్గురిపై కేసు నమోదు ఇద్దరి అరెస్ట్.

రూ.32 లక్షల విలువైన వెంటిలేటర్లతో పాటు ఇతర వైద్య పరికరాలు రికవరీ

చోరీ చేసిన వైద్య పరికరాలను కొనుగోలు చేసిన హైదరాబాద్కు చెందిన వ్యక్తి అరెస్ట్

మహారాష్ట్ర, నిజామాబాద్ ప్రాంతాల్లోనూ గతంలో చోరీలకు పాల్పడిన నిందితులు

సీసీటీవీ కెమెరాల వల్ల కేసు ఛేదన.


జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్



అదిలాబాద్ లోకల్ గైడ్ నవంబర్ 7 నిందితుల వివరాలు: 1. సజ్జన్ బసంత్ మోతే (43), o/శే బాసన్, నివాసం మహంకాళి వార్డు, చంద్రపూర్, మహారాష్ట్ర.(అరెస్ట్)2. అభిజిత్ -- మహారాష్ట్ర, చంద్రపూర్.(పరారీ) 3. మేదం కొండా రెడ్డి (35), తండ్రి చిన్నమాల కొండారెడ్డి, నివాసం ప్రగతి నగర్, హైదరాబాద్.(అరెస్ట్) ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు అత్యవసర చికిత్స అందించే వెంటిలేటర్లను చోరీ చేసిన అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి, చోరీకి గురైన వెంటిలేటర్లతో పాటు ఇతర వైద్య పరికరాలను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. గత నెల 30వ తేదీన మహారాష్ట్ర చంద్రపూర్కు చెందిన సజ్జన్ బాసన్ మోతే, అభిజిత్ అనే ఇద్దరు వ్యక్తులు టెక్నీషియన్లుగా ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోకి ప్రవేశించారు. రోగులకు చికిత్స అందిస్తున్న సమయంలో వారి ప్రాణ హాని కలిగించే విధానంగా ఆసుపత్రిలోని రెండో అంతస్తులో ఉన్న వార్డులలో రోగులకు అత్యవసర చికిత్స అందించే నాలుగు పనిచేసే మైండ్ రే బ్రాండ్ కు చెందిన వెంటిలేటర్లను చోరీ చేసి మహారాష్ట్రకు తరలించారు. అనంతరం చోరీ చేసిన వైద్య పరికరాలను విక్రయించేందుకు హైదరాబాద్కు చెందిన మెడికల్ ఎక్విప్మెంట్ సేల్స్ అండ్ సర్వీస్ వ్యాపారి కొండా రెడ్డిని సంప్రదించారు. దొంగిలించిన వస్తువులని తెలిసి కూడా కొనుగోలు చేసేందుకు అంగీకరించిన కొండల్ రెడ్డి, వాటిని కొనుగోలు చేయడానికి చంద్రపూర్కు వచ్చాడు. వైద్య పరికరాలను కారులో పెట్టుకుని హైదరాబాద్కు వెళ్తుండగా, ఆదిలాబాద్ ఆర్టీవో కార్యాలయం సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసులను గమనించిన నిందితులు పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు.. గతంలో మహారాష్ట్రలోని చంద్రపూర్ వద్ద గల నాగ్పీడ్, వని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ వైద్య పరికరాలను చోరీ చేసినట్లు వెల్లడించారు. వీరు దొంగిలించిన వైద్య పరికరాలను హైదరాబాద్కు చెందిన కొండా రెడ్డికి విక్రయించినట్లు విచారణలో తేలింది. పోలీసులు నిందితుల వద్ద నుండి రిమ్స్ ఆసుపత్రిలో చోరీ చేసిన నాలుగు వెంటిలేటర్లు, నిజామాబాద్ ఆసుపత్రిలో చోరీ చేసిన ఒక వెంటిలేటర్, ఒక చీమా మిషన్, మహారాష్ట్ర వని ఆసుపత్రిలో చోరీ చేసిన ఫీటల్ మానిటర్, చంద్రపూర్ నాగభీడ్ ఆసుపత్రిలో చోరీ చేసిన డయాథెరపీ మిషన్తో పాటు నగదు, రూ 1 లక్ష నగదు, సెల్ ఫోన్లు, ఒక బైకు, కారు స్వాధీనం చేసుకున్నారు. రోగుల ప్రాణాలకు అవసరమైన వైద్య పరికరాలను చోరీ చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వైద్య పరికరాల కొనుగోలు, విక్రయాల విషయంలో అనుమానాస్పద లావాదేవీలు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలి. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.సిసి టివి కెమెరాలు ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా కృషి చేయాలని తెలిపారు. సీసీటీవీ కెమెరాల వల్ల నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. సీసీటీవీ కెమెరాలు ఉన్న ప్రదేశాలలో దొంగలు దొంగతనాలు చేయడానికి వెనుకడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె. నాగరాజు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై అఖిల్, ఆర్ఎస్ఐ గోపికృష్ణ, సిబ్బంది హెచ్ సి రమణ, క్రాంతి, త్రిశూల్, అఖిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అండగా నిలిచిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ...

10,959 మంది విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు...



కరీంనగర్ నవంబర్ 7 లోకల్ గైడ్ ప్రతినిధి : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఈ ఏడాది పరీక్ష ఫీజును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వయంగా చెల్లించారు. ఈ మేరకు శనివారం రోజున కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, హనుమకొండ, జగిత్యాల జిల్లాల బీజేపీ ముఖ్య నేతల ఆధ్వర్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లకు చెక్కులను అందజేశారు.మంత్రి తీసుకున్న ఈ నిర్ణయంతో పార్లమెంట్ పరిధిలోని 10,959 మంది పేద విద్యార్థులకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది. పదో తరగతి విద్యార్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కొండంత అభయం: 10,959 మందికి ఉచితంగా పరీక్ష ఫీజు చెల్లింపు కరీంనగర్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఈ ఏడాది కూడా పరీక్ష ఫీజును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వయంగా చెల్లించారు. ఈ మేరకు శనివారం రోజున కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, హనుమకొండ, జగిత్యాల జిల్లాల బీజేపీ ముఖ్య నేతల ఆధ్వర్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లకు చెక్కులను అందజేశారు. మంత్రి తీసుకున్న ఈ నిర్ణయంతో పార్లమెంట్ పరిధిలోని 10,959 మంది పేద విద్యార్థులకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది. జిల్లాల వారీగా విద్యార్థులు. చెల్లించిన మొత్తం వివరాలు కరీంనగర్ జిల్లా: 4,356 మంది విద్యార్థులు5,44,500 రాజన్న సిరిసిల్ల జిల్లా: 3,920 మంది విద్యార్థులు (?4,90,000/-) సిద్దిపేట జిల్లా: 1,133 మంది విద్యార్థులు (?1,37,140/-) జగిత్యాల జిల్లా: 1,087 మంది విద్యార్థులు (?1,35,875/-) హనుమకొండ జిల్లా: 463 మంది విద్యార్థులు (?57,875/-) ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు , పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు బండి సంజయ్ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. గతంలో సి ఎస్ ఆర్ నిధులు ఇతర సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదులు, శౌచాలయాల నిర్మాణం చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. అంతేకాకుండా విద్యార్థులకు ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్ల పంపిణీతో పాటు, గత ఏడాది కూడా టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజును ఆయనే భరించిన విషయాన్ని ప్రస్తావించారు.పేదరికంలో ఉండి పరీక్ష ఫీజు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల పరిస్థితిని గమనించి, బండి సంజయ్ కుమార్ తక్షణమే స్పందించి ఈ నిధులను విడుదల చేశారని తెలిపారు. కేంద్ర మంత్రి చేసిన ఈ మహత్కార్యం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి విద్యానికేతన్లో దీపావళి ప్రత్యేక అవగాహన కార్యక్రమం




చర్ల : లోకల్ గైడ్ న్యూస్ : శ్రీ సరస్వతి విద్యానికేతన్లో దీపావళి పండుగను పురస్కరించుకుని విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ లిఖిత మాట్లాడుతూ దీపావళి పండుగ విశిష్టత, దాని వెనుక ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించారు. దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించడం, టపాసులు కాల్చడం, కొత్త బట్టలు ధరించడం మాత్రమే కాదని, చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లి"ఒక దీపం ఇంట్లో వెలిగించు.. ఒక మంచి ఆలోచన మనసులో వెలిగించు.. ఒక మంచి పని మరొకరి జీవితంలో వెలిగించు"లి అనే సందేశాన్ని అందించారు. కోపం, అసూయ, ద్వేషం, అహంకారం వంటి చెడు భావాలను విడిచిపెట్టి ప్రేమ, దయ, జ్ఞానం, మంచితనం వంటి సద్గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో చెడు లక్షణాలను విడిచిపెట్టి మంచి గుణాలను అలవర్చుకుంటామని సంకల్పం చేయించారు. అబద్ధాన్ని విడిచిపెట్టి నిజాయితీని, కోపాన్ని విడిచిపెట్టి ప్రేమను, ద్వేషాన్ని విడిచిపెట్టి స్నేహాన్ని, అజ్ఞానాన్ని విడిచిపెట్టి జ్ఞానాన్ని అలవర్చుకుంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం శ్రీరాముడు రావణాసురుడిపై విజయం సాధించి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంలో ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికిన కథను, శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించి ప్రజలకు విముక్తి కల్పించిన పురాణ గాథను రాజేశ్వరి, శ్రీదేవి, పూజ వివరించారు. ఈ కథలు ధర్మం, సత్యం, మంచితనం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తాయని పేర్కొన్నారు. చదువుతో జ్ఞానం అనే దీపాన్ని, ప్రేమతో మానవత్వం అనే దీపాన్ని, క్రమశిక్షణతో భవిష్యత్తు అనే దీపాన్ని, నిజాయితీతో వ్యక్తిత్వం అనే దీపాన్ని వెలిగించుకోవాలని ఉపాధ్యాయుడు రమేష్ విద్యార్థులకు సూచించారు. దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలు, ప్రమాదాల నివారణపై రమేష్ అవగాహన కల్పించారు. పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా వినియోగించాలని, రోడ్లు, ఇళ్లు, వాహనాలు, విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని సూచించారు. టపాసులను చేతిలో పట్టుకుని కాల్చకూడదని, పేలని టపాసుల దగ్గరకు వెళ్లకూడదని, నీళ్లు, ఇసుక, ప్రథమ చికిత్స సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని వివరించారు. అదేవిధంగా బాణసంచా నుంచి వెలువడే పొగ, శబ్దం వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారు, జంతువులు, పక్షులు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. వాయు, శబ్ద కాలుష్యాన్ని తగ్గిస్తూ పర్యావరణహితంగా దీపావళి జరుపుకోవాలని అరుణ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు దీపావళి పండుగ అసలైన అంతరార్థంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, వ్యక్తిగత భద్రత, పర్యావరణ పరిరక్షణ బాధ్యతలపై అవగాహన పొందారు. దీపావళి వెలుగులు ఇళ్లలోనే కాకుండా ఆలోచనల్లో, ప్రవర్తనలో, చేసే మంచి పనుల్లోనూ ప్రకాశించాలని సందేశమిస్తూ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, రాజేశ్వరి, పూజ, ప్రమీల, శ్రీదేవి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వానికి నిలువుటద్దం సర్పంచ్ టోనీ..

చంద్రప్రకాష్ ఆరోగ్యంపై ఆరా!

హైదరాబాద్ ఒమేగా ఆసుపత్రికి వెళ్లి ఆత్మీయ పరామర్శ..

త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



కారేపల్లి, నవంబర్ 7 (లోకల్ గైడ్ న్యూస్): ఆపదలో ఉన్నవారిని పలకరించి, వారికి మనోధైర్యం కల్పించడమే నిజమైన మానవత్వమని సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) చాటుకున్నారు. సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్ అనారోగ్యంతో హైదరాబాద్లోని ఒమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న సర్పంచ్ టోనీ ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రప్రకాష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయనకు ధైర్యం చెప్పారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి సాధారణ జీవితాన్ని కొనసాగించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. రాజకీయాలకు, పదవులకు అతీతంగా ఆత్మీయతను చాటుతూ అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని స్వయంగా ఆసుపత్రికి వెళ్లి పలకరించడం సర్పంచ్ టోనీ మానవీయ దృక్పథానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల మైనారిటీ నాయకులు యాకుబ్ పాషా, షఫీ , తాజుద్దిన్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి భక్తులతో ఆత్మీయ కలయిక

8వ రోజు అలంపూర్ చేరుకున్న ఎన్కతల అయ్యప్ప స్వాములు స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్ష

ఎన్కతల సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్

లోకల్ గైడ్, వికారాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి: శబరిమల పాదయాత్రలో భాగంగా బిహెచ్ఈఎల్ (భేల్) నుండి బయలుదేరిన వికారాబాద్ జిల్లా, మోమిన్పేట్ మండలం, ఎన్కతల గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు శుక్రవారానికి 8వ రోజుకు చేరుకుని అలంపూర్ వద్ద విడిది చేశారు. ఈ సందర్భంగా అలంపూర్ వద్ద జోగులాంబ అమ్మవారి దర్శనార్థం విడిది చేసిన స్వాములను ఎన్కతల సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్ నేరుగా కలిసి పరామర్శించారు. స్వాముల క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్న ఆయన, వారికి పండ్లు మరియు ఇతర అవసరమైన సదుపాయాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... అయ్యప్ప స్వాముల పాదయాత్ర ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తికావాలని, ఆ అయ్యప్ప స్వామి దివ్య ఆశీస్సులతో ఎన్కతల గ్రామం ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యులు ఁ భక్తులు: లి గ్రామ ప్రముఖులు ఁ నాయకులు: బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పల్లె వీరేశం, కృష్ణ గౌడ్, 8వ వార్డు సభ్యులు చీలపల్లి ఎల్లారెడ్డి, కంది రమేష్ గౌడ్, చీలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పోలీస్ ప్రభాకర్ రెడ్డి, పట్లల మైపాల్ రెడ్డి. పాల్గొన్న గురు స్వాములు స్వాములు మహిపాల్ రెడ్డి స్వామి, ప్రభాకర్ రెడ్డి స్వామి, రాఘవేందర్ రెడ్డి స్వామి, రంగారెడ్డి స్వామి, రవి స్వామి, శంకర్ గౌడ్ స్వామి, మణికంఠ స్వామి, చింటూ స్వామి తదితర భక్తులు మరియు గురుస్వాములు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: బంకపల్లి రాంరెడ్డి

రోడ్లు బాగు చేయండి.. లేదంటే అసెంబ్లీ ముట్టడిస్తాం!

గుంతల రహదారులపై విద్యార్థుల సమరభేరి.. ఓగ్లాపూర్ గేట్ వద్ద గంటపాటు రాస్తారోకో.

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు.. ప్రమాదాల ముప్పుతో ప్రయాణికుల ఆందోళన

రోడ్లు బాగు చేయకుంటే అసెంబ్లీ ముట్టడిస్తాం.. ప్రజాప్రతినిధులకు హెచ్చరిక.



లోకల్ గైడ్/బంట్వారం : గుంతలమయమైన రహదారులు.. శిథిలావస్థకు చేరిన కల్వర్టులు.. నిత్యం ప్రమాదాల భయం.. ఇంకెంతకాలం ఈ అవస్థలు భరించాలంటూ విద్యార్థులు రోడ్డెక్కారు. రహదారులను వెంటనే మరమ్మతు చేసి, ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వికారాబాద్ జిల్లా ఓగ్లాపూర్ గేట్ వద్ద విద్యార్థులు, వివిధ గ్రామాల ప్రయాణికులు గంటపాటు నిరసన ధర్నా నిర్వహించారు. ప్రయాణం కాదు.. ప్రాణసంకటమే! వివరాల్లోకి వెళితే.. బంట్వారం, కోట్‌పల్లి మండలాల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా ఓగ్లాపూర్ గేట్ నుంచి బంట్వారం వరకు, తాండూరు నుంచి కోట్‌పల్లి వరకు రహదారులపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులకు నరకప్రాయంగా మారాయి. పలుచోట్ల కల్వర్టులు సైతం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ఈ మార్గాల్లో ప్రయాణించే విద్యార్థులు, ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. హామీలు ఏమయ్యాయి.. ప్రజాప్రతినిధులు స్పందించరా ఎన్నికల సమయంలో రహదారుల అభివృద్ధికి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, అవి కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయా? అని ప్రజాప్రతినిధులను విద్యార్థులు నిలదీశారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి తమ ప్రాంత రహదారుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించకుంటే అసెంబ్లీ ముట్టడే! ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారుల మరమ్మతు పనులు చేపట్టకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే అసెంబ్లీని ముట్టడిస్తామని విద్యార్థులు, వివిధ గ్రామాల ప్రయాణికులు హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు బలైన తర్వాత స్పందిస్తారా? ప్రమాదాలు జరగకముందే రహదారులను బాగు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దళితులకే కేటాయించాలి

నామినేటెడ్ పదవుల్లో దళితులకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన దళిత సంఘాల నాయకులు



లోకల్ గైడ్ ఆమనగల్లు, నవంబర్ 7: ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవితో పాటు డైరెక్టర్ పదవులను దళితులకు కేటాయించాలని ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ దళిత సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళిత సీనియర్ నాయకులు జంతుక జానయ్య, వస్పుల సాయిలు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు దళితులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో దళితులను ముందుంచి రాజకీయ ప్రయోజనాలు పొందుతున్న పార్టీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవులు కేటాయించే విషయంలో మాత్రం దళితులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. దళితుల అభ్యున్నతి, రాజకీయ సాధికారత కోసం పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు.ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ పదవులను దళితులకు కేటాయించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టి తమ హక్కులను సాధించుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దళితులకు రాజకీయంగా తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పులికంటి మైసయ్య, మల్లేష్, కంబాలపల్లి అల్లాజీ, వస్పుల సురేష్, జంతుక టిల్లు, వస్పుల లక్ష్మణ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస హైస్కూల్‌లో మిన్నంటిన దీపావళి సంబరాలు

పర్యావరణ హితంగా పండుగ జరుపుకోవాలి కరస్పాండెంట్ లక్కరాజు శ్రీనివాసరావు

35 ఏళ్లుగా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం హెచ్ఎం రాధిక



ఇబ్రహీంపట్నం, నవంబర్ 07(లోకల్ గైడ్) : జీహెచ్ఎంసీ పరిధి ఆదిభట్ల సర్కిల్ కొంగరకలాన్‌లోని శ్రీనివాస హైస్కూల్‌లో శనివారం దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. పండుగను పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు దీపావళి సంబరాలను అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల కేరింతలు, దీపాల వెలుగులతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు దీపావళి ప్రాముఖ్యతపై చిత్రలేఖనం, పాటలు, నృత్యాలు, మట్టి ప్రమిదల అలంకరణ పోటీలు నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రమాద రహితంగా టపాసులు కాలుస్తూ విద్యార్థులు సందడి చేశారు. పాఠశాల కరస్పాండెంట్ లక్కరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ... దీపావళి అనేది చీకట్లను పారద్రోలి జ్ఞాన వెలుగులు నింపే మహోన్నత పర్వదినమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని కాలుష్య రహిత, హరిత దీపావళిని జరుపుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రమిదల వెలుగులతో, ప్రకృతికి హాని కలగకుండా పండుగ జరుపుకోవడమే నిజమైన దీపావళి అని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు, భారతీయ సంస్కృతి, ఆచారాల పట్ల అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. శ్రీనివాస హైస్కూల్ గత 35 సంవత్సరాలుగా సాంస్కృతిక కార్యక్రమాలకు విశేష ప్రాధాన్యమిస్తూ, విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, పెద్దల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తోందని తెలిపారు.ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నార్సింగిలో "నో బిన్ -- నో ట్రేడ్"పై వ్యాపారస్తులకు అవగాహన

ప్రతి దుకాణం వద్ద రెడ్ డస్ట్‌బిన్ ఏర్పాటు తప్పనిసరి

పరిసరాల పరిశుభ్రతకు వ్యాపారస్తులు సహకరించాలి



గండిపేట, నవంబర్ 7 (లోకల్ గైడ్): పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సూచించారు. ఇందులో భాగంగా నార్సింగి సర్కిల్--45 ఆధ్వర్యంలో శనివారం నార్సింగి గ్రామంలోని వ్యాపారస్తులకు "నో బిన్ -- నో ట్రేడ్" కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి వ్యాపార సంస్థ వద్ద తప్పనిసరిగా రెడ్ డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. దుకాణాలు, వ్యాపార సంస్థల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా డస్ట్‌బిన్‌లలోనే వేయాలని స్పష్టం చేశారు.నార్సింగి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారస్తులందరూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. స్వచ్ఛత అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ ఉషారాణి, వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు వినోద్, ఉపాధ్యక్షుడు గఫూర్, హాజీ భాయ్, పలువురు వ్యాపారస్తులు, సంబంధిత మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నాం


- రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.


నందిగామ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





రంగారెడ్డి జిల్లా బ్యూరో, (లోకల్ గైడ్): రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.శనివారం షాద్‌నగర్ నియోజక వర్గం నందిగామ మండలంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందిగామ గ్రామంలో ఇద్దరు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని నూతన గృహాలను ప్రారంభించారు.ప్శ్నఅనంతరం మహిళా సమాఖ్య భవనం, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని, నందిగామ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నందిగామ గ్రామంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. పాత జాతీయ రహదారి-7 నుంచి నర్సప్పగూడ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోనిప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల ఆర్థిక సాయం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సన్నధాన్యం పండించే రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని పేర్కొన్నారు.గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలకు ఆశలు కల్పించినప్పటికీ, ఆచరణలో వారికి ఇళ్లు అందలేదని అన్నారు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేయడంతో పాటు హైదరాబాద్ నగరానికి లక్ష ఇళ్లు కేటాయించినట్లు వివరించారు. మొత్తం 8 లక్షల ఇళ్ల నిర్మాణానికి సుమారు రూ.40 వేల కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఆర్థిక సహాయాన్ని ఎలాంటి అవినీతి, లంచాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు 'ఈ దీపావళి మా దీపావళి' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులపాటు గృహప్రవేశాలు, నూతన గృహాల ఫొటోల అప్‌లోడ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 2,25,100 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు.మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇప్పటివరకు సుమారు రూ.73 వేల కోట్ల రుణాలను సున్నా వడ్డీపై అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన మంచి సంక్షేమ పథకాలైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా కొనసాగిస్తున్నామని వివరించారు.రాష్ట్రంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ప్రతి భూమి పార్సిల్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని, రాబోయే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని మొత్తం 10,456 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సర్వే అనంతరం ప్రతి భూమికి క్యూఆర్ కోడ్‌తో కూడిన మ్యాప్, భూధార్ నంబర్‌తో పాస్‌బుక్ అందజేస్తామని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.షాద్‌నగర్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో వెంకిరాల గ్రామంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి అర్హులైన వారికి పట్టాదారు పాస్‌బుక్కులు అందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.సిద్దాపురం ప్రాంతంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. ప్రజల అభిప్రాయాలను, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని సిద్దాపురంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోదని, ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని పేర్కొన్నారు.షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. నియోజకవర్గం లోని సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల మంజూరు విషయంలో ఎమ్మెల్యే పట్టుదలతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆయన విజ్ఞప్తి మేరకు నందిగామ ప్రాంత ప్రజల సౌకర్యార్థం మండలంలో ఎంఆర్ఓ కార్యాలయం (తహసీల్దార్ కార్యాలయం), ఆర్డీఓ కార్యాలయాల ఏర్పాటుకు ఈ సందర్భంగా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.ప్రజల అవసరాలు, సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి నిర్ణయం తీసుకుంటుందని, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాల అమలులో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని క్రమంగా మెరుగుపరుస్తూ, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓ సరిత, పీడీ హౌసింగ్ చంప్లా నాయక్, పిడి డిఆర్డిఏ శ్రీలత, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





పట్టా భూమి 'గ్రామకంఠం'గా ఎలా మారింది

ఇబ్రహీంపట్నంలో సర్వే నంబర్ 1429పై భూ వివాదం

అర్ధరాత్రి వేళ 218 గజాల ప్రహరీ కూల్చివేత.. బాధితురాలి లబోదిబో

మున్సిపల్ కమిషనర్, సబ్ రిజిస్ట్రార్‌కు, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



ఇబ్రహీంపట్నం నవంబర్ 7 (లోకల్ గైడ్) : మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 1429 భూ వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. కష్టపడి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న స్థలానికి సైతం రక్షణ కరువైందని ఓ మహిళా బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టా భూమి మున్సిపల్ రికార్డుల్లో గ్రామకంఠంగా మారడం, వివాదాస్పద రిజిస్ట్రేషన్లు జరగడంపై స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రికార్డుల మార్పుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు ఇబ్రహీంపట్నం బీరప్ప గుడి ఆవరణ ప్రాంతంలో గల సర్వే నంబర్ 1429లో మొత్తం 13 ఎకరాల 14 గుంటల విస్తీర్ణంలో పట్టా భూమి ఉంది. అసలు పట్టాదారుడు సోమ పోచయ్యకు చెందిన స్థలంలో సుమారు 100 గజాల భూమిని ఆయన అనుమతి లేకుండానే 2024లో మున్సిపల్ రికార్డుల్లో పట్టా నుంచి గ్రామకంఠంగా మార్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆ వెంటనే పత్రాలు సృష్టించి, 18-12-2024న డాక్యుమెంట్ నం. 17300/2024 ద్వారా ఎం.డి. సోయల్‌కు, ఆపై 25-02-2025న డాక్యుమెంట్ నం. 2765/2025 ద్వారా కొత్తపల్లి వెంకటేష్‌కు రిజిస్ట్రేషన్లు చకచకా జరిగిపోయినట్లుబాధితులు పేర్కొంటున్నారు.

అర్ధరాత్రి ప్రహరీ గోడ కూల్చివేత

ఇదే సర్వే నంబర్ పరిధిలో హజ్రా బేగం అనే మహిళ 25-10-2025న 218 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తన స్థలానికి రక్షణగా ప్రహరీ గోడ నిర్మించుకోగా, గత శుక్రవారం అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు దౌర్జన్యంగా గోడను కూల్చివేశారని ఆమె వాపోయారు. ముందస్తు సమాచారం లేకుండా రాత్రికి రాత్రే ఈ చర్యకు పాల్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్యుమెంట్లలో సరైన రోడ్డు మార్గం, సర్వే/ప్లాట్ నంబర్ల స్పష్టత లేకపోవడం వెనుక పెద్ద గూడుపుఠాణీ నడిచిందని అనుమానిస్తున్నారు.

సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలి

ఈ అక్రమాలపై ఇప్పటికే మున్సిపల్ కమిషనర్, స్థానిక సబ్ రిజిస్ట్రార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. అసలు రెవెన్యూ రికార్డులను పరిశీలించి, పట్టా భూమిని గ్రామకంఠంగా ఎలా మార్చారో విచారించాలని, తన 218 గజాల స్థలానికి అధికారికంగా హద్దులు నిర్ణయించి రక్షణ కల్పించాలని హజ్రా బేగం డిమాండ్ చేస్తున్నారు. ప్రహరీ కూల్చిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక

ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు నిర్ణయం హర్షణీయం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర సమన్వయకర్త క్రిష్ణ నాయక్

గిరిజనుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కమిషన్ దోహదపడుతుంది



లోకల్ గైడ్ ఆమనగల్లు, నవంబర్ 6: తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఆదివాసీ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్త క్రిష్ణ నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలో ఇప్పటివరకు ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్ కొనసాగుతున్న నేపథ్యంలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించేలా ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు.ప్రత్యేక కమిషన్ ఏర్పాటు ద్వారా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి, వాటి పరిష్కారానికి మరింత సమర్థవంతంగా కృషి చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో గిరిజనుల అభ్యున్నతికి ఈ కమిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అలాగే గిరిజనుల సమస్యలకు సత్వర పరిష్కారం లభించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి చేరేందుకు దోహదపడుతుందని అన్నారు. సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని క్రిష్ణ నాయక్ పేర్కొన్నారు.గిరిజనుల చిరకాల ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రభుత్వానికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత





మహబూబాబాద్, నవంబర్ 07. లోకల్ గైడ్ : మహబూబాబాద్ లో ఎస్పీ ఆధ్వర్యంలో 5ఖ రన్ – పాల్గొన్న ఎమ్మెల్యే మురళి నాయక్, చైర్ పర్సన్ జ్యోతి రమేష్ నాయక్‌మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా, యువతలో చైతన్యం తీసుకువచ్చి గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే సందేశంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం 5ఖ రన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.జిల్లా ఎస్పీ శబరిష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ పాల్గొన్నారు. డీఎస్పీ తిరుపతిరావు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని, విద్య, క్రీడలు, సామాజిక సేవ వంటి సానుకూల కార్యక్రమాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.మాదకద్రవ్యాల వినియోగం ఒక వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు, సరఫరా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలను కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో యువతతో పాటు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల సీఐలు, టౌన్ సీఐలు, ఎస్సైలు, పోలీస్ శాఖ అధికారులు, పలు వార్డుల కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, కార్యకర్తలు, యువకులు, వాకర్ అసోసియేషన్ సభ్యులు, పాత్రికేయ మిత్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్ లో అంగరంగ వైభవంగా ముందస్తు దీపావళి వేడుకలు

దీపాల వెలుగులు ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలి

ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి






పెద్దపల్లి జిల్లా నవంబర్ 07 (లోకల్ గైడ్) : దీపాల వెలుగులు ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలను నింపాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. ముందస్తు వేడుకల్లో భాగంగా సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో అంగరంగ వైభవంగా దీపావళి వేడుకలను విద్యార్థులచే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానం పై జ్ఞానం సాధించిన విజయానికి దీపావళి పండుగ ప్రతీక అని అన్నారు. భారతీయ పండుగల ప్రాముఖ్యతను చిన్ననాటి నుంచే విద్యార్థులకు తెలియజేయాలనే ఆలోచనతో ప్రతి ఏటా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ప్రతి పండుగను ముందస్తుగా నిర్వహిస్తూ విద్యార్థులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. దీపావళి పండుగను పర్యావరణహితంగా టపాసులకు దూరంగా ఉంటూ దీపాల వెలుగుతో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ప్రత్యేక పూజ కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు విద్యాధిని, విద్యార్థులు, అధ్యాపక బృందం, తదితరులు ఉన్నారు.

ఆగిర్యాల గ్రామంలో మహా నిరాహార చేపట్టిన దళిత సంఘం నాయకులు..

మహనీయుల విగ్రహాలను కించపరుస్తూ నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణం వెంటనే ఆపాలి..

మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు కానీ అగౌరవ పరిస్తేఎలా



లోకల్ గైడ్ న్యూస్ 07 కొండుర్గ్ : కొండుర్గ్ మండలములోని ఆగిర్యాల గ్రామంలో మహనీయుల విగ్రహాలకు అడ్డుగా నిర్మిస్తున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని కోరుతూ డా బి ఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గత కొంత కాలం నుండి నిరసన వ్యక్తం చేస్తున్న ,ఎవరు సైతం సానుకూలంగా స్పందించి వారి అభిప్రాయాలకు విలువనివ్వలేదు గత రెండు రోజుల క్రితం కొండుర్గ్ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి మండల స్థాయి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళిన నిరాశా మిగిలింది తప్ప ,సమస్యకు పరిష్కార మార్గం ఏమాత్రం లభించలేదన్నారు మొక్క వోని సంకల్పంతో ఏకంగా నేడు గ్రామంలోఅంబేద్కర్ చౌరస్తాలో మహానిరహర దీక్షకు కార్య రూపం దాల్చారు, ఈ దీక్షకు మద్దతుగా టీఆర్పీ నాయకులు రాధాకృష్ణ బి ఎస్ పి నాయకులు నీరటి రాజు మద్దతు ప్రకటించారు ఆగిర్యాల గ్రామంలో ప్రజలకు విశాలంగా అందు బాటులోఉండే స్థలం ఆది అక్కడ జాతి నిర్మాతలైన బాబాసాహెబ్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, చాకలి ఐలమ్మ, లాంటి తొమ్మిది మంది జాతి నిర్మాతల విగ్రహాల ఉస్తావాల కోసం కేటాయించిన ప్రదేశ్యమలో నిర్మాణం తలపెట్టిన నూతన గ్రామ పంచాయితీ భవనాన్ని వెంటనే ఆపాలని పోరాటాలు చేస్తుంటారు, వారి నిరసలను ఎవ్వరు మాత్రం పరిగణలోకి తీసుకోవటం లేదని నేడు దళిత ప్రజా సంఘాల మద్దతు కోరుతూ గ్రామంలో మహా నిరహార దీక్షకు పూనుకున్నారు, ఈసందరంగా డా బిఆర్ అంబేద్కర్ యువజన నాయకులు మాట్లాడుతూ ,ప్రభుత్వ గ్రామ పంచాయతీ భవన నిర్మాణ స్థలాన్ని తక్షణమే మార్చాలని మహనీయుల విగ్రహాలకు అడ్డుగా చేపడుతున్న నిర్మాణాన్ని స్థలాన్ని మార్చాలి. మహనీయుల విగ్రహాలకు, సముచిత గౌరవం,తగిన స్థానం ఎప్పటికి ఇవ్వాలని కోరుతున్నారు ఈకార్యక్రమంలో వార్డ్ సభ్యులు బిక్షపతి ,నరేష్ రమేష్ బి ఎస్ పి చెన్నయ్య , యంఆర్పిఎస్ రాజు బీఎస్పీ అశోక్ ,మదన్ రవి పి లక్ష్మణ్ శ్రీను రవీంద్రచారి,పద్మమ్మ, భీమయ్య మద్దతు తెలిపిన పార్టీలు టీఆర్పీ రాదకృష్ణ బీఎస్పీకుమార్ మహేందర్,ఆంజనేయులు నీరటి రాజు బాలయ్య శరత్ పాల్గొనారు..

పీఏసీఎస్‌లలో నామినేటెడ్ విధానం వద్దు.. ప్రత్యక్ష ఎన్నికలే ముద్దు

రైతుల హక్కులను హరించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి

నామినేటెడ్ పాలకవర్గాల ఏర్పాటుపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం.. న్యాయపరంగా ఎదుర్కొంటాం



లోకల్ గైడ్ ఆమనగల్లు, నవంబర్ 7 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాలను నామినేటెడ్ పద్ధతిలో నియమించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్ దుడ్డు ఆంజనేయులు యాదవ్ స్పష్టం చేశారు. రైతుల ఓటు హక్కును కాదని, నామినేటెడ్ పాలకవర్గాలను ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికల ద్వారానే పాలకవర్గాలను ఎన్నుకుంటున్నారని తెలిపారు. అలాంటి కీలకమైన వ్యవస్థల్లో ఎన్నికల విధానాన్ని పక్కనపెట్టి కేవలం ప్రభుత్వ ఉత్తర్వులతో నామినేటెడ్ కమిటీలను నియమించడం రైతుల హక్కులను హరించడమేనని అన్నారు.గ్రామీణ ప్రాంత రైతులకు పీఏసీఎస్‌లు వెన్నెముక లాంటివని, విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు వంటి అనేక సేవలు ఈ సంఘాల ద్వారానే అందుతున్నాయని పేర్కొన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన సంస్థల పాలకవర్గాలను ఎన్నుకునే హక్కును రైతుల నుంచి దూరం చేయడం రైతు వ్యతిరేక నిర్ణయమని విమర్శించారు.ప్రభుత్వం ఆరు నెలల కాలపరిమితితో నామినేటెడ్ కమిటీలను ఏర్పాటు చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. ఆరు నెలల తర్వాత మళ్లీ గడువు పొడిగిస్తారా అని నిలదీశారు. నామినేటెడ్ విధానం వల్ల పారదర్శకత దెబ్బతినడంతో పాటు పక్షపాతం, అవినీతికి అవకాశం ఉంటుందని ఆరోపించారు.

బీఆర్ఎస్ ప్రధాన డిమాండ్లు

పీఏసీఎస్‌లకు వెంటనే ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని, నామినేటెడ్ పాలకవర్గాల నియామక నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని, రైతుల ఆమోదంతో ఎన్నికైన ప్రతినిధులకే పాలక బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో న్యాయపరంగా పోరాటం చేస్తామని, ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దుడ్డు ఆంజనేయులు యాదవ్, నాగిళ్ల జగన్, సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, వస్పుల సాయిలు, సైదులు గౌడ్, పుల్లారెడ్డి, శ్రీశైలం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం.

ఈ నెల 21వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయాలి

-- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, (లోకల్ గైడ్): ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ) ప్రక్రియలో భాగంగాముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు తుది జాబితాలో పేరు చేర్చుకునేందుకు మరో అవకాశం కల్పించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, డూప్లికేట్ కేటగిరీలలో గుర్తించబడి ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందన్నారు. అర్హులైన ఓటర్ల జాబితాలను పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు ఎన్నికల సంఘం వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లను సంప్రదించి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి, వాటి సమర్పణ పై అవగాహన కల్పించాలన్నారు. అనుబంధం-ఎ, బి, సి ద్వారా అవసరమైన వివరాలు, ప్రకటన పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, బీఎల్ఓలకు నేరుగా లేదా ఈసీఐ నెట్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే అదే చిరునామాలో నివసిస్తున్న వారు తగిన ప్రకటనతో పాటు ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాలని, రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మారిన వారు పాత, కొత్త చిరునామాల వివరాలతో పాటు నివాస ధ్రువీకరణ పత్రాన్ని జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో కొత్త ఓటరు నమోదుకు ఇప్పటికే ఫారం-6 సమర్పించిన వారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించి ఈ నెల 21వ తేదీలోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించేలా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరుకు తుది జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పేదల ఇళ్లలో పండుగ వెలుగులు నింపేందుకు..


నేడుమంత్రి పొంగులేటి పర్యటన

పాలేరు నియోజకవర్గంలో మూడు మండలాల్లో షెడ్యూల్

'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాల్లో పాల్గొననున్న శీనన్న

ఖమ్మం: లోకల్ గైడ్ : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగ వెలుగులు నింపేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రేపు (ఆదివారం) పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాల్లో భాగంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి బాణాసంచా కాల్చి దీపావళి వేడుకలను జరుపుకోనున్నారు. పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం 8:30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం కామంచికల్‌లో, 9:30 గంటలకు నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంలో, 10:30 గంటలకు కూసుమంచి మండలం పాలేరులో జరిగే కార్యక్రమాలకు మంత్రి హాజరవుతారు. మూడు మండలాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మమేకమై వారి ఇళ్లలో దీపావళి సంబరాలను పంచుకోనున్నారు.ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నారాయణ పాఠశాలలో ఘనంగా దీపావళి వేడుకలు



ఖమ్మం : నవంబర్ , 7: లోకల్ గైడ్:నారాయణ పాఠశాలలో దీపావళి వేడుకలను విద్యార్థులు , ఉపాధ్యాయులు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా విద్యార్థులు దీపాలు వెలిగించి , పండుగ విశిష్టతను తెలియజేస్తూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు . ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ దీపావళి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని తెలిపారు . ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని కాలుష్యాన్ని అరికట్టే విధంగా పండుగను జరుపుకోవాలని సూచించారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు .

హకీంపెట్ సిఎం సభను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే జీఎమ్మార్



నారాయణపేట నవంబర్ 7: కొడంగల్ నియోజకవర్గం హకీం పేట లో ఈ నెల 9న జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి సమన్వయ కర్త,దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కోరారు.శనివారం నారాయణపేట నియోజకవర్గం నుంచి వెళ్ళే రైతుల సమీకరణ, ఏర్పాట్ల గురించి మండల అధ్యక్షుడు కోట్ల రవీందర్ రెడ్డి ,పట్టణ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ ,ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నారాయణపేట క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే జిఎమ్మార్ మాట్లాడుతూ ప్రతి మండ లానికి బస్సులు ఏర్పాటు చేశామని, సభకు వచ్చే రైతులకు భోజనాలు ఏర్పా టు చేస్తామని తెలిపారు. ఎల్లుండి జరగబోయే సభకు పెద్ద ఎత్తున హాజరై రైతుల కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు.


ఆదివాసీ 9 తెగల సాంస్కృతిక ధర్మయుద్ధ సభ పోస్టర్ ఆవిష్కరణ





బయ్యారం, నవంబర్ 7 లోకల్ గైడ్ : బయ్యారం మండల కేంద్రంలో ఆదివాసీ 9 తెగల సాంస్కృతిక ధర్మయుద్ధ సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ 9 తెగల జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఛలో మానుకోట జోడో యాత్రలో భాగంగా బయ్యారం మండల కేంద్రంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక కుల పెద్దలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకుల సమక్షంలో కోదండరామయ్య ఫంక్షన్ హాల్‌లో డిసెంబర్ 9న మానుకోట గడ్డపై నిర్వహించనున్న సాంస్కృతిక ధర్మయుద్ధం బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు . ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ 9 తెగల ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలు, జాతి అస్తిత్వం, హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 9న మానుకోటలో నిర్వహించే బహిరంగ సభకు ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ సీనియర్ నాయకులు గొగ్గెల కోటయ్య, పోలేబోయిన రామ నర్సయ్య, మెస్సు రాజశేఖర్ దొర, వట్టం శ్రీనివాస్, చాట్ల వెంకన్న దొర, ఇర్సా రామారావు, చుంచు ముత్తయ్య, మాజీ సర్పంచ్ దనసరి కోటమ్మ, పూనెం జయమ్మ, గొగ్గెల రామస్వామి, అడ్వకేట్ సువర్ణపాక సత్యనారాయణ, అడ్వకేట్ వాసం ఆనంద్, పెండేకట్ల యాకయ్య, కల్తి సారయ్య, ఎట్టి కిరణ్, చుంచు రాజు, తాటి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ హెచ్ఎం ధనసరి కోటయ్య, రిటైర్డ్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం వట్టం నారాయణ, చాట్ల అశోక్, చింత వినోద, వీసం మమత, కొట్టెం శాంత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక పోటీలు



నారాయణపేట నవంబర్ 7: యువజన సర్వీసు శాఖ, నారాయణపేట జిల్లా ఆధ్వ ర్యంలో జిల్లా స్థాయి యువ జనోత్సవాలు బాల కేంద్రం నారాయణపేట నందు ఘనంగా నిర్వహించారు. జిల్లా స్థాయి సాంస్కృతిక ఉత్సవాల క్రింద 5 అంశాలలో జానపద నృత్యం -- సమూహం జానపద గీతం సమూహం, వీధి నాటకం, పేయింటింగ్, కవిత్వం పోటీలు నిర్వహించారు. యువజన ఉత్సవాలలో జానపద నృత్యంలో మక్తల్ ప్రభుత్వ కాలేజీ హిందూ ప్రియ బృందం,నారాయణపేట స్ఫూర్తి దిగ్రికాలేజి ఆంజనేయులు జానపద గేయం లో,దన్వాడ్ బాలకృష్ణ గౌడ్ వీది నాటకం లో కవిత్వపట్ నారాయ ణపేట సాయి కాలేజీ శిరీష చిత్రలేఖనంలో మక్తల్ బి హరికుమార్ మొదటి స్థానం సంపాదించు కున్నరు. వీరందరికీ హైదరాబాద్లో నిర్వహిస్తు న్నటువంటి రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాలలో పాల్గొనటానికి పంపబడుతుందనీ యువజన అధికారి వెంకటేష్ తెలిపారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక

వంగాల నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసిన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగాల అనిల్ రెడ్డి తండ్రి వంగాల నరసింహారెడ్డి ఇటీవల మృతి చెందగా శనివారం నార్కట్పల్లి మండలం బాజకుంట గ్రామంలోని వారి స్వగృహంలో దశదినకర్మ నిర్వహించారు .ఐఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ , కోమటిరెడ్డి పృథ్వీధర్ రెడ్డి , ఏదుళ్ళ మధుసూదన్ రెడ్డి , రేగట్ట లింగస్వామి గౌడ్, మారం గోనరెడ్డి, కృష్ణారెడ్డి, దోనాల నాగార్జున రెడ్డి తో పాటు పలువురు కార్పొరేటర్లు, వివిధ పార్టీల నేతలు,బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని వంగాల నరసింహారెడ్డి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నకిలీ ఐఫోన్లు, ఆపిల్ వాచీలు విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

నకిలీ ఎలక్ట్రానిక్ వస్తువులు స్వాధీనం.. మరో నిందితుడి కోసం పోలీసుల గాలింపు



సైబరాబాద్, నవంబర్ 07 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): నకిలీ ఐఫోన్లు, ఆపిల్ వాచీలు, ఇయర్‌బడ్స్‌ను ఒరిజినల్ వస్తువులుగా నమ్మించి విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న అల్తమాష్ (26) అనే నిందితుడిని రాయదుర్గం పోలీసులు 2026 నవంబర్ 07 న అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై క్రైమ్ నెంబర్ 1267/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అల్తమాష్, తండ్రి షాదీ లాహి, సైద్‌నగర్, మలక్‌పేట్, హైదరాబాద్‌లో నివాసం ఉంటూ నకిలీ ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇతని స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా మురాద్‌నగర్. నిందితుడి వద్ద నుంచి రెండు ఐఫోన్లు (ఒకటి నకిలీ), నాలుగు నకిలీ ఆపిల్ వాచీలు/స్మార్ట్ వాచీలు, ఏడు నకిలీ ఇయర్‌బడ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఘజియాబాద్‌కు చెందిన మరో నిందితుడు ఆవేష్ ఖాన్ కూడా పాల్గొన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం అతను పరారీలో ఉండగా, అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. అరెస్టు చేసిన అల్తమాష్‌ను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఏసిపి మాదాపూర్ డివిజన్ మార్గదర్శకత్వంలో, రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓ పర్యవేక్షణలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె.రామిరెడ్డి, క్రైమ్ సిబ్బంది సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్నారు. పోలీసు సిబ్బంది కృషిని ఏసీపి అభినందించారు.

రాష్ట్ర ప్రలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు.

ఈ దీపావళి ప్రతి ఇంట్లో చీకటిని పారద్రోలి వెలుగులు నింపాలి.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : దీపావళి పండుగ పురస్కరించుకుని ప్రజలందరికీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.అందరి ఇండ్లలో చీకట్లు తొలగిసుఖసంతోషాలు, విజయాలు వెల్లివిరియాలని,లక్ష్మీదేవి కటాక్షంతో ప్రతి కుటుంబం వృద్ధి చెందాలని ఆకాంక్షించారు.చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పెద్దల సమక్షంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ..సురక్షితంగా,పర్యావరణ హితంగా (గ్రీన్ క్రాకర్స్‌తో) ఈ దీపావళి వేడుకను జరుపుకోవాలన్నారు.

నర్సబాయి కుంటాను సుందరీకరణకు మోక్షం లభించింది. పలు అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్.





రాజేంద్ర నగర్, (లోకల్ గైడ్) : బాబుల్ రెడ్డి నగర్ లోని నర్సబాయి కుంట అభివృద్ధికి మోక్షం లభించిందని ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. శనివారం స్థానిక నాయకులతో కలిసి బాబుల్ రెడ్డి నగర్ లోని నర్సాభాయి సుందరికరణ పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. నర్సబాయి కుంటను చాలా రోజులు గా అభివృద్ధి చేయాలని తపన ఉండేదన్నారు. చాలా రోజులు స్థానిక నాయకులు, ప్రజలు కుంటను అభివృద్ధి చేయాలని కోరారు అన్నారు. ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షులు దనంజయ్య సోమ శ్రీనివాస్, ప్రేమగౌడ్ సరికొండ వెంకటేష్ జైపాల్ దత్తు కాళిదాసు ఏరవ్వా సత్యనారాయణ ఓం ప్రకాష్ జగన్ ఓరుగంటి మల్లేష్ కే. రెడ్డి గద్దయే కృష్ణ యాదిరెడ్డి కిషోర్ సురేష్ రాయిడు లక్ష్మ రెడ్డి బాస శ్రీనివాస్ కాశిగారి యాదగిరి హనుమంత్ సాగర్ సోమ సందీప్ కోట పవన్ శ్రీకాంత్ రెడ్డి రవీందర్ రెడ్డి నాగరాజు కృష్ణ రాము బండారి యాదగిరి మదన్ పూజారి రవి ఆకుల శ్రీనివాస్ తదితరులు పాలొగొన్నారు

ముదిరాజులను బిసి ఏ లో చేర్చొద్దు: వాల్మీకి సంఘం నారాయణపేట



నవంబర్ 7: ముది రాజులను బి సి ఏ లో చేర్చి తమను ఆగం చేయొద్దని నారాయణపేట వాల్మీకి సంఘం నాయకు లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం ఆర్టీసీ కాలనీ గుట్టపై వెల సిన వాల్మీకి మహర్షి మంది రం ప్రాంగణంలో జిల్లా కేంద్రంలోని వాల్మీకి నాయ కులు సమావేశమయ్యారు. అందులో భాగంగా తెలంగా ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసి (డీ)లో ఉన్న ముదిరాజు లను ఇటీవల ఒక కార్యక్రమంలో ఆయన బీసీ (ఏ)లోకి మారుస్తామ ని ప్రకటించడంతో బీసీ (ఏ) లో ఉన్న వాల్మీకి బోయలు, చాకలి, మంగలి, మేధర, గంగపుత్ర, వడ్డెర కులస్తులు ఆందోళన చెందు తున్నారన్నారు. అందులో భాగంగా నారాయణపేట వాల్మీకి పట్టణ అధ్యక్షులు బోయ లక్ష్మణ్ ఆధ్వర్యంలో వాల్మీకి సోదరులు ప్రత్యే కంగా సమావేశమై ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఎలాంటి కులవృత్తి లేకుం డా ఎంతో నష్టపోయామని ఈ సందర్భంగా అన్నారు. అలాంటిది బీసీ (డీ) లో ఉన్న ముదిరాజులను బీసీ(ఏ) తీసుకువస్తే అంద రూ నష్టపోతారని వాపో యారు. వాల్మీకి రాష్ట్ర నాయకులు లొట్టి శ్రీను మాట్లాడుతూ 1976లో 1977లో కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉన్న ఉమ్మడి ఆంధ్రప్ర దేశ్ ముఖ్యమంత్రి అయిన కాసు బ్రహ్మానందం రెడ్డి వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో నుంచి వారిని బీసీ(ఏ)లోకి మార్చి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేయడంతో ముఖ్యమంత్రి అయిన కాసు బ్రహ్మానందం రెడ్డి కీలక పాత్ర వహించి వాల్మీకి బోయల గొంతు నొక్కారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కొన్ని ప్రాంతాల్లో వాల్మీకి బోయలు ఎస్టీ లుగా కొన సాగుతున్నారని గుర్తు చేశా రు. తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో ఎస్టి జాబితా లో పరిగణించబడ్డారని, భార తదేశం మొత్తం లో చూసు కుంటే కర్ణాటక, తమిళనా డు, మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఏ రాష్ట్రంలో అయినా, ఏ ప్రాంతాలలో చూసుకున్న మొత్తం వాల్మీకి బోయలను ఎస్సీ లుగా, ఎస్టీ లుగా కొన సాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఎస్టీ హోదా లేకుండా, ఎస్సీ హోదా కాకుండా బీసీ (ఏ) లోకి మార్చబడిన వాల్మీ కులు, ఎలాంటి కులవృత్తి లేకున్నా, వాల్మీకి బోయలు గడ్డు పరిస్థితుల బ్రతుకు లను ఈడుస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు . ఈ రోజుల్లో అంద రికీ కులవృత్తి ఉంది. ఎలాం టి కులవృత్తి లేని వాల్మీకి బోయలు బిసి (ఏ) లో కొన సాగుతుంటే ఆరోజు ఉమ్మ డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమం త్రి కాసు బ్రహ్మానందం రెడ్డి, ఈరోజు తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి బీసీ (ఏ) లో ఉన్న కులాల గొంతు కోస్తున్నారడంలో ఎలాంటి సందేహం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బోయ రమేష్, బోయ శరణప్ప, బోయ కథలప్ప టీచర్, బోయ రాములు, లోటి శ్రీను, బోయ హోటల్ వెంక టయ్య, బోయ అంజప్ప, చంద్రశేఖర్, ఆనంద్, కమల్, హుస్సేనప్ప, అప్పి, దాలర్ శ్రీను, గౌతమ్, కిషోర్, నరసింహ తదిత రులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజీ పడబోం...ప్రజలను విష్మరించం

గత పాలకులు పెదడోకి ఒక్క డబులు బెడ్ రూ మ్ ఇల్లు కట్టించారా .

మంత్రి వాకిటి శ్రీహరి





కృష్ణ నవంబర్ 7: అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడబోదని రాష్ట్ర పాడి పరిశ్రమ యువజన క్రీడలు, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.మక్తల్ నియోజకవ ర్గంలో ప్రతియొక్క బడగూ బలహీన వర్గాల పేద కుటుంబాన్నికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేసి ఇస్తామ నిఅన్నారు.మండలం పరిధిలోని గురుజాల గ్రామలో నూతనంగా నిర్మాణం 2,40లక్షలతో చేసిన బిటి ప్రారంభించి బహిరంగ సభ సమావే శములో అయన శనివారం మాట్లాడారు.నియోజకవర్గంలో ప్రతి పల్లెకు ఇందిర మ్మ ఇళ్లు, దాదాపు 3500 ఇళ్లు నిర్మాణం చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.నాడు శాసనసభ్యులు ఎన్నికలో గ్రామం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు, ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ప్రమాణం స్వీకారం నిర్వహించి మొట్ట మొదటిగా ముఖ్య మంత్రి గ్రామానికి స్వాంతంత్రం వచ్చి 70ఏళ్లు గడిచిన నాటి పాల కుల నిర్లక్ష్యం వల్ల స్థానికు లు ఊరు విడిచి పక్కన ఉన్న మండలం కేంద్రములో నివాసలు నిర్మాణం చేసు కుంటూ, పుట్టిన గ్రామానికి వదిలి వెళ్ళాక రోడ్డు, డ్రైనే జీ, సిసి రోడ్డులు లేకున్నా బిక్కు బిక్కుమాంటూ వర్షాలు కురిసిన ఇబ్బంది పడిబతుకుతున్నారన్నారు. దింతో గ్రామనికి బిటి రోడ్డు మంజూరు చేసి, 14నెలలో నిర్మాణం చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అని అయన అన్నారు. మండలం కేంద్రం నుండి గురుజాల్ గ్రామానికి బిటి వేసి, నూతనంగా నిర్మాణం చేసిన ఇక రాక పోకలకు ఎటువంటి ఇబ్బం ది ఉండదు అని అయన అన్నారు.మక్తల్ నియోజక వర్గంలో చిన్న మండలం, వెనుక బడ్డ మండలానికి పల్లెలో బిటి రోడ్డులు కోసం ఏకంగా ముప్పై ఐదు కోట్లు వరకు మంజూరు కాను న్నాయి అని అయన అన్నారు.నేను రాజకీయలు చేయడానికి రాజకీయలో రాలేదు, ప్రజా సేవా చేయ డానికి రాజకీయలో వచ్చా ను అని అయన అన్నారు. గత రాజకీయ నాయకులు ఎన్నికలు అయ్యాక రాజకీ యలు చేయలేదు, నేడు మారిన కాలనుగుణంగా ఎన్నికలు అయ్యాక రాజ కీయలు చేస్తున్నారనీ విమర్శించారు.గత ఎమ్మె ల్యే మక్తల్ నియోజకవ ర్గంలో మునిసిపల్ కార్యా లయం లో శివాజీ మహా రాజ్ ఫోటో ఇక్కడి ఎందు కు పెట్టారు అని దింతో అభి వృద్ధి నిధులు మంజూరు చేయను అని శివాజీ మహా రాజ్ ఫోటో తొలగించిన ఘనత వారికె దక్కుతుంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారం ఉన్న పుడు శివాజీ మహారాజ్ ఫోటో తొలగించి, అధికారం పోయాక శివాజీ మహారాజ్ విగ్రవిష్కరణ స్థానికంగా మంత్రిగా ఉన్నా ఆహ్వా నించకుండా దుర్బుద్ధి పెటుకుని రాజకీయ చేస్తున్నారు అని మాజీ ఎమ్మెల్యే ఉద్దేశించి అయన అన్నారు.28రాష్ట్ర లలో ప్రజల కట్టిన ట్యాక్స్ రూపా మలో కేంద్రం ప్రభుత్వనీకి డబ్బులు వెళ్ళుతాయి , అక్కడి నుండి రక్షణ, భవి ష్యత్తు నిధులు ఉంచుకుని, మిగత నిధులు కేంద్రం నుండి రాష్ట్రలకు వచ్చే నూతన భవనాలు నిర్మా ణం చేసిన,ప్రారంభిస్తవానికి మంత్రి దూరంగా పెట్టడం ఏంటి అని అయన ప్రశ్నిం చారు. అభివృద్ధి చేయ డానికి కాంగ్రెస్ పార్టీ ప్రభు త్వం సిద్ధంగా ఉంది అన్ని హంగులతో నియోజకవర్గం ప్రజలకు సాగు నీరు, తాగు నీరు, విద్యా, ఉపాధి, ఆరోగ్యం, వైద్య అన్ని విధాలుగా నియోజకవర్గం తో పాటు ఉమ్మడి జిల్లా ముఖ్య మంత్రి నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నారు అని అయన అన్నారు. అంతకముందు మంత్రి డా వాకిటి శ్రీహరి మండలం కేంద్రములో కాంగ్రెస్ పార్టీ కార్యాలయన్నీ ప్రారంభించి కాలినడక ద్వారా గురుజా ల గ్రామానికి బ్యాండ్ భజ లతో ఉగంరేగింపుగా గ్రామా నికి చేరుకొని బిటి రోడ్డు ప్రారంభించారు. అనంతరం స్థానికులు సర్పంచ్ కమల మ్మ పోలీస్ పాటిల్ మంత్రి డా, వాకిటి శ్రీహరిని పూలు శాలువాతో సన్మాంచి జ్ఞాపీక అందచేశారు.ఈ కార్యక్రమంలో మండలం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషోర్ కుమార్, మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయప్ప గౌడ, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సర్పరాజ్, నాయకులు వాకిటి నారాయణ, తమ్మప్ప, కృష్ణ మూర్తి, రామలింగప్ప, శివరాజప్ప సౌకరి, పిట్టల సిద్దప్ప, శంకర్ గౌడ, రవి గౌడ పోలీస్ పాటిల్, సంతోష పాటిల్, మాజీ ఎంపీటీసీ నాగప్ప సర్పంచ్ లు నాగప్ప, బాలరాజ్, వెంకటేష్, లింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు లో ఘనంగా 70వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

క్రీడాకారుల ప్రతిభకు వేదికగా జిల్లా స్థాయి టోర్నమెంట్ -- విజేతలకు బహుమతుల ప్రదానం క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి: తల్లోజు ఆచారి





లోకల్ గైడ్ ఆమనగల్లు, నవంబర్ 7: రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 70వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14 బాలురు, బాలికల జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు, ఎంపికలు శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ట్రస్మా ఆమనగల్లు డివిజన్ సహకారంతో జరిగిన ఈ క్రీడా పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వివిధ జోన్లకు చెందిన క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, కమిషనర్ ఎస్. రాఘవేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ తల్లోజు గీత ఆచారి, కౌన్సిలర్లు ముక్తాల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, ఎనుముల రమేష్, పుల్లారెడ్డి, అనూష, శ్రీశైలం తదితరులు హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాసంస్థల కరస్పాండెంట్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షులు చుక్క అల్లాజి గౌడ్, డివిజన్ అధ్యక్షులు అవ్వారి శివలింగం, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య గౌడ్‌తో పాటు నిరంజన్, సుధీర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, అభిమల్ల శ్రీరామ్, విష్ణువర్ధన్ రెడ్డి, మహమూద్, కోట్ల వెంకటేష్, సంజీవ్ కుమార్, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు క్రీడల నిర్వహణకు సహకరించారు. ట్రస్మా ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అవసరమైన సహాయ సహకారాలు అందించాయి. క్రీడలు యువత భవిష్యత్తుకు బాటలు వేస్తాయి: తల్లోజు ఆచారి కార్యక్రమ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ నాయకులు, మాజీ జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల జీవితంలో ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలను అలవర్చుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన వేదిక, ప్రోత్సాహం లభిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని ఆచారి ఆకాంక్షించారు. విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ నిరంతరం సాధన చేయాలని, క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదిగి తమ పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లులో జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు సహకరించిన విద్యాశాఖ అధికారులు, ట్రస్మా ప్రతినిధులు, పాఠశాలల యాజమాన్యాలను ఆయన అభినందించారు. విజేతలకు బహుమతుల ప్రదానం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు తదుపరి రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య పోటీల్లో రంగారెడ్డి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. బాలికలు ఉత్సాహంగా పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఆతిథ్యమిచ్చిన ఆమనగల్లు పట్టణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిర్వాహకుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.





ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్మెంట్ ఇంచార్జ్ గా నియమితులైన దుర్గం శేఖర్‌కు ఘన సన్మానం

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి – – జిల్లా కాంగ్రెస్ నాయకులు



అదిలాబాద్ లోకల్ గైడ్ నవంబర్ 7 : ఆదిలాబాద్: ఈరోజు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా నియమితులైన గౌరవ శ్రీ దుర్గం శేఖర్ గారిని జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ పరమేశ్వర్ కోలేట్కర్ గారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ (ఐజజ) అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ పరమేశ్వర్ కోలేట్కర్ గారు మాట్లాడుతూ.. దుర్గం శేఖర్ గారికి ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం ఎంతో సంతోషకరమైన విషయమని, ఆయన నాయకత్వం, అనుభవం, అంకితభావం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఎస్సీ వర్గాల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు ఎస్సీ డిపార్ట్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఐజజ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ గారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అన్నారు. దుర్గం శేఖర్ గారికి పార్లమెంట్ స్థాయి బాధ్యతలు రావడం అభినందనీయమని, ఆయనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లా, పార్లమెంట్, మండల మరియు గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. నాయకులందరికీ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.అనంతరం నూతనంగా ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా నియమితులైన దుర్గం శేఖర్ గారు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, రాష్ట్ర నాయకత్వానికి, ముఖ్యంగా తన నియామకానికి సహకరించిన నాయకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి తనకు లభించిన గౌరవం మాత్రమే కాదని, ఎస్సీ వర్గాల అభ్యున్నతి కోసం పనిచేయాల్సిన గొప్ప బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎస్సీ డిపార్ట్మెంట్‌ను బలోపేతం చేస్తానని, ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. తనను ఘనంగా సన్మానించిన పరమేశ్వర్ కోలేట్కర్ గారికి, ఐజజ అధ్యక్షులు నరేష్ జాదవ్ గారికి, నాయకులు మరియు కార్యకర్తలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. నూతనంగా నియమితులైన దుర్గం శేఖర్ గారికి పలువురు నాయకులు శు భాకాంక్షలు తెలియజేసి అభినందించారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ఎస్సీ వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యంగా నాయకులందరం కలిసికట్టుగా ముందుకు సాగుతామని ఈ సందర్భంగా నాయకులు పునరుద్ఘాటించారు.కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి గారు,ఎఽ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శి మోతే బరీక్ రావు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్ కృష్ణా రెడ్డి గారు,జిల్లా ప్రధాన కార్యదర్శి మంథని సానియా గారు, మనల లింగన్న గారు, కార్యదర్శి పుంద్ర నర్సింగ్ గారు, దయానంద్ గారు, లింగన్న గారు,అధికార ప్రతినిధి దేవదాస్ గారు, ఎఽ డిపార్ట్మెంట్ మండల అధ్యక్షులు అశోక్ గారు, టౌన్ ప్రెసిడెంట్ చంద్రాల రాహుల్ గారు, జిల్లా మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ మేకల జితేందర్ గారు, డిసిసి ప్రధాన కార్యదర్శి సంజయ్ గారు, నక్క రాందాస్ గారు మల్యాల మనోజ్ గారు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శు భాకాంక్షలు తెలిపిన తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి .



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.లోకల్ గైడ్ : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "చీకటిని పారద్రోలి వెలుగులను నింపే దీపావళి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకనని, చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో సరికొత్త వెలుగులను నింపాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో గ్రామాలు కళకళలాడాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వివరించారు .దీపావళి వేడుకల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, కాలుష్యాన్ని తగ్గించే విధంగా పండుగను జరుపుకోవాలని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

దుర్గం శేఖర్‌కు ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జిగా నియామక ఉత్తర్వుల అందజేత!

అదిలాబాద్ లోకల్ గాడు నవంబర్ 7 : హైదరాబాద్: గాంధీ భవన్‌లో ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన దుర్గం శేఖర్‌కు టీపీసీసీ అధ్యక్షులు లిశ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే లిలిశ్రీ కవ్వంపల్లి సత్యనారాయణ గారులి నియామక ఉత్తర్వుల (ఆర్డర్ కాపీ)ను అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా దుర్గం శేఖర్‌ను నాయకులు అభినందించి, నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి దుర్గం శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

జిల్లా స్థాయి ఎన్సీ ఎస్సి పోటీల్లో ప్రతిభ కనబర్చిన వాజేడు మండల ఎంపీ యూ పిఎస్ గుమ్మడిదొడ్డి విద్యార్థులు.



వాజేడు,లోకల్ గైడ్ ప్రతినిధి :- 32జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (ఎన్సీ ఎస్సీ --2026) జిల్లా స్థాయి పోటీల్లో ములుగు జిల్లా, వాజేడు మండలంలోని ఎంపీ యూ.పి.ఎస్ గుమ్మడిదొడ్డి చల్క పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతిని సాధించారు. అంతేకాకుండా జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు,మండలానికి గర్వకారణంగా నిలిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు యం.హర్షవర్ధన్,ఎమ్.జీవన్ తేజ రూపొందించిన "గ్రే వాటర్ టూ గ్రీన్ గార్డెన్ " అనే సైన్స్ ప్రాజెక్ట్ న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల లో నీటి వృథాను అరికట్టడం, గ్రే వాటర్‌ను పునర్వినియోగించడం, పర్యావరణ పరిరక్షణ మరియు నీటి సంరక్షణపై విద్యార్థులు రూపొందించిన ఈ వినూత్న ప్రయోగం ప్రశంసలు అందుకుంది. జవహర్‌నగర్‌లోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఈ ఘనత సాధించారు. గైడ్ టీచర్ డి. నాగార్జున ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ ప్రాజెక్టును రూపొందించి ప్రదర్శించారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, ఉపాధ్యాయులను హెచ్.ఎమ్ గిరిప్రసాద్,స్థానిక మండల విద్యాశాఖ అధికారి శ్రీ వెంకటేశ్వర్లు అభినందించారు.

జై కేసారం గ్రామం లో వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి: సిపిఎం



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి చౌటుప్పల్ నవంబర్ 7 (లోకల్ గైడ్) : చౌటుప్పల్ మండలం లోని జై కేసారం గ్రామం లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం రాసు లుగా పేరుకు పోయాయని అకాల వర్షాలకు పంటలు పండక ఇప్పటికే రైతులు నష్టపోయారని అధికార యంత్రాంగం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి పది రోజులు గడుస్తున్న కాంటాలు వేయక పోవడం విడ్డూరం తక్షణమే జై కేసారం మార్కెట్లో కాంటలు ప్రారంభించి వడ్ల కొనుగోలు ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య, సిపిఎం గ్రామ కార్యదర్శి పొట్ట శ్రీనివాస్, సిపిఎం మండల కమిటీ సభ్యులు పల్లె మధు కృష్ణ, బోదాసు వెంకటేశం, వార్డు సభ్యులు పాలమాకుల పుష్ప, రైతులు పాలమకుల జంగయ్య, ఢిల్లీ నర్సిరెడ్డి, జిల్లెల్ల చిట్టి, నక్క సత్తమ్మ, బండమీది లక్ష్మమ్మ, దొడ్డి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పర్వతాపూర్ గ్రామంలోఎండిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు..

ఎండిన పంటలకు నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలి

కొందుర్గు మండలం కరువు మండలంగా ప్రకటించాలిలి

గ్రామ సర్పంచ్ బోయ అశోక్



లోకల్ గైడ్ న్యూస్ 07 కొందుర్గ్ : రంగారెడ్డి జిల్లా, కొందుర్గ్ మండలం, పర్వ తాపూర్ గ్రామంలోఎల్‌నినో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు ఎండి పోతున్నాయి. ఎంతో కష్టపడి వ్యవసాయ చేసి నష్టపోతున్న రైతన్నలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు ఎంతో, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు నీరు లేక ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్న రైతన్నకు దిక్కు లేకుండా పోయిందన్నారు గ్రామ సర్పంచ్ బోయ అశోక్,ప్రత్యేక చొరవతో అగ్రికల్చర్ అధికారి వాసవి తో కలిసి పంట పొలాలను పరిశీలించారు రైతుల కష్టాలను, పంట నష్టాన్ని ప్రత్యక్షంగా గమనిస్తూ ఆరుగాలం శ్రమించి పంటలు పండించాల్సిన రైతులకు ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్ర నష్టం కలగడం బాధాకరం.ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా తగిన పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన పంటలను ప్రత్యేక అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందించాలన్నారు ఒక ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్ అగ్రికల్చర్ ఏఈఓ వాసవి ఉప సర్పంచ్ దామోదర్ రెడ్డి గ్రామ కార్యదర్శి అరుణ వార్డు సభ్యులు మరాఠి సురేష్ రైతులు ఏడ్ల గాలయ్య కర్రోళ్ల కుమార్ ఎల్లా రాజు పాలుగొనడం జరిగింది

అత్యవసర వైద్యం -- ప్రాణరక్షణ: మారుమూల గ్రామీణులకు కొండంత అండగా 'ఈషా హాస్పిటల్

హైదరాబాద్ వెళ్లే లోపే నాణ్యమైన వైద్యం వికారాబాద్ హాస్పిటల్ సేవలు

ఈశా హాస్పిటల్ లో మెరుగైన వైద్యం ఎండి భరత్ రెడ్డి





లోకల్ గైడ్, వికారాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి : గ్రామీణ ప్రాంత ప్రజలకు మరియు మారుమూల గ్రామాల బాధితులకు అత్యవసర వేళల్లో త్వరితగతిన మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా వికారాబాద్ జిల్లా ఎన్నెపల్లిలోని కలెక్టర్ ఆఫీస్ రోడ్డులో 'ఈషా హాస్పిటల్' సేవలు అందిస్తోందని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) భరత్ రెడ్డి తెలిపారు. ఏదైనా అకస్మాత్తుగా ప్రమాదం జరిగినప్పుడు లేదా తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు, ప్రాథమిక వైద్యం కోసం సుదూర ప్రాంతంలో ఉన్న హైదరాబాద్‌కు వెళ్లే లోపే ఎంతో విలువైన సమయం వృధా అవుతుందని ఆయన పేర్కొన్నారు. అటువంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితులను తక్షణమే కాపాడుకునేందుకు వికారాబాద్‌లోని ఈషా హాస్పిటల్ అన్ని రకాల అత్యాధునిక వైద్య సౌకర్యాలతో అందుబాటులో ఉందని వివరించారు. అందుబాటులో ఉన్న ఉచిత ఉ ప్రైవేట్ అత్యవసర వైద్య సేవలు: న్యూరో అండ్ బ్రెయిన్ సర్జరీ : ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలైన వారికి తక్షణ బ్రెయిన్ సర్జరీ సేవలు. విషప్రయోగం ఉ పాము కాటు : పాము కాటు, పురుగుల మందు తాగిన బాధితులకు ప్రత్యేక అత్యవసర చికిత్స. విద్యుత్ ప్రమాదాలు : కరెంట్ షాక్‌కు గురైన వారికి తక్షణ ప్రాణరక్షణ వైద్యం. ఆర్థోపెడిక్ ఉ కార్డియాక్ సేవల వ్యవస్థ : విరిగిన ఎముకలకు ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు, హార్ట్ ఎటాక్ (గుండెపోటు) బాధితులకు అత్యవసర కేర్. కిడ్నీ సమస్యలు : కిడ్నీలో రాళ్ల సమస్యకు సురక్షితమైన చికిత్సా ఐసీయూ జనరల్ ఫిజీషన్ రోడ్డు ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర వైద్య పరిస్థితులు ఎదురైనప్పుడు సమయాన్ని వృధా చేయకుండా, సమీపంలోని ఈషా హాస్పిటల్ సేవలను వినియోగించుకుని ప్రాణాలను కాపాడుకోవాలని భరత్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నిబద్ధత పట్టుదల కమిట్మెంట్ ఉన్న వ్యక్తి బిక్షం గౌడ్

బిక్షంగా ఉద్యోగ విరమణ లో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి .





నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ : పట్టుదల కమిట్మెంట్ నిబద్ధత కలిగిన వ్యక్తి సుంకరి బిక్షం గౌడ్అని అటువంటి వ్యక్తి ఉద్యోగ విరమణ చేయడం బాధగా ఉందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు పిఆర్టియు మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మునుగోడు ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ పి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ అభ్యర్థి సుంకరి భిక్షం గౌడ్ ఆత్మీయ సన్మాన సభలో ఎమ్మెల్యే పాల్గొని మల్లేష్ గౌడ్ ను శాలువాలు సన్మానించిన అనంతరం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కమిట్మెంట్ ఉంటే ఏ పనైనా చేయొచ్చు నని కృషి, పట్టుదల, దీక్షకు మారుపేరు బిక్షం గౌడ్ అన్నారు.ఉపాధ్యాయుడుగా కమిట్మెంట్తో పని చేస్తూ ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచారని ఇటువంటి వ్యక్తులకు రిటైర్మెంట్ అనేది ఉండదు ఇన్ని రోజులు ఉపాధ్యాయుడుగా సేవలందించారని నీలాంటి కమిట్మెంట్ ఉన్న వ్యక్తి సమాజానికి సేవ అందించాలని బిక్షం గౌడ్ కు మొట్టమొదట చెప్పిన వ్యక్తిని నేనే అన్నారు.సమాజంలో అవినీతి పేరుకు పోతుంది. అవినీతి పారద్రోలేంత వరకు పేదలకు న్యాయం జరగదు అన్నారు. నాయకుడనేవాడు నీతిగా ఉంటే సమాజానికి నీతి వంతమైన పాలన అందించగలరని తెలిపారు నాయకులు అవినీతికి పాల్పడితే సమాజంలో పేదలకు న్యాయం జరగదు అన్నారు.

కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ.

పి ఆర్ టి యు అభ్యర్థిగా సుంకర బిక్షం గౌడ్ కి కాంగ్రెస్ పార్టీ మద్దతు కావాలని ప్రయత్నం చేసిన

బీసీలకు పెద్దపీట వేయాలని ఉద్దేశంతోనే బీసీ బిడ్డ అయిన సుంకర బిక్షం గౌడ్ కి టికెట్ ఇవ్వాలని చెప్పా ప్రజలే న్యాయ నిర్నేతలు కాబట్టి ప్రజల నిర్ణయానికి వదిలేయాలి 9,000 కోట్లతో కొడంగల్లో సీఎం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారు కొడంగల్ కి అభివృద్ధి పనులు ఇవ్వొద్దనేది నా ఉద్దేశం కాదు మునుగోడు ప్రజలు ఏం పాపం చేశారు మాకెందుకు నిధులు రావు అన్నారు. నీకు అదృష్టం కలిసి వచ్చి ముఖ్యమంత్రి అయ్యావు దానిని నేను తప్పు పట్టట్లేదు ప్రపంచంలోనే అత్యధికంగా ఫ్లోరైడ్ తో బాధపడుతున్న మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి చేసుకోవాలన్న తపన ఉందిఎమ్మెల్యేల నియోజకవర్గాలను కూడా ముఖ్యమంత్రి, మంత్రులు సమానంగా చూడాలి ముఖ్యమంత్రి దగ్గరికి ఉప ముఖ్యమంత్రి బట్టి దగ్గరికి చాలాసార్లు వెళ్లాను ప్రభుత్వం ఇప్పటికైనా గ్రహించి మునుగోడుతో పాటు వెనుకబడిన నియోజకవర్గంలను గుర్తించి ఆ నియోజకవర్గాలకు న్యాయం చేయాలని కోరుతున్నా అన్నారు. ఇంకా ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు శ్రీపాల్ రెడ్డి నెల్లికంటి సత్యం పిఆర్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, పి ఆర్ టి యు నల్లగొండ జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి జాన్ రెడ్డి. పిఏ పిఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి. మునుగోడు గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్, పిఆర్టియు నాయకులు పణి కుమార్, నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, సుంకరి మల్లేష్ గౌడ్ పి ఆర్ టి యు నాయకులు వివిధ మండలాల మండల విద్యాధికారులు,బంధువులు మిత్రులు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని బిక్షం గౌడ్ ఘనంగా సన్మానించారు.

కొడంగల్‌లో అభివృద్ధి సందడి.. రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం!

రైతులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి..

ఆధునిక వ్యవసాయంపై ప్రత్యేక చర్చ

వ్యవసాయ రంగానికి సాంకేతికత.. పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం.. యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ముందడుగు!

రైతు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి పునాది..

వ్యవసాయంలో ఆధునికత, పరిశ్రమలతో ప్రగతి, యువతకు ఉపాధి కల్పనే సమగ్ర అభివృద్ధికి మార్గం!

లోకల్ గైడ్, వికారాబాద్ జిల్లా ప్రతినిధి : కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఈ కార్యక్రమాలను ప్రారంభించి, వ్యవసాయ రంగానికి సంబంధించిన వివిధ ప్రదర్శనలను పరిశీలించడంతో పాటు రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో నేరుగా ముచ్చటించారు. రైతుల సమస్యలు, వ్యవసాయంలో వస్తున్న మార్పులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.

రైతు మేళాలో ప్రత్యేక ఆకర్షణగా వ్యవసాయ ప్రదర్శనలు

రైతు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ స్టాళ్లు, ప్రదర్శనలు వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన మార్పులను ప్రతిబింబించాయి. ఆధునిక వ్యవసాయ పరికరాలు, నూతన సాగు విధానాలు, శాస్త్రీయ పద్ధతులు, పంటల ఉత్పత్తి పెంపునకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేసే విధంగా కార్యక్రమం కొనసాగింది. ప్రస్తుత కాలంలో వ్యవసాయం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ సాగు విధానాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, పంటల నాణ్యతను పెంచడం వంటి అంశాల్లో శాస్త్రీయ పద్ధతులు ఎంతో కీలకమని ఈ రైతు మేళా తెలియజేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తల పరిశోధనలు క్షేత్రస్థాయిలో రైతులకు చేరినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయనే విషయాన్ని ఈ కార్యక్రమం ప్రాధాన్యతగా నిలిపింది.

పారిశ్రామిక రంగానికి కొత్త దిశ.. ఇండస్ట్రియల్ ఎక్స్‌పో

రైతు మేళాతో పాటు నిర్వహించిన ఇండస్ట్రియల్ ఎక్స్‌పో కూడా కార్యక్రమంలో మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వివిధ పారిశ్రామిక రంగాలకు సంబంధించిన ప్రదర్శనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల అభివృద్ధికి ఉన్న అవకాశాలను ఈ ఎక్స్‌పో ద్వారా ప్రదర్శించారు. ఒక ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక రంగం కూడా సమానంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. పరిశ్రమలు ఏర్పాటైతే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉంటుంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం లభిస్తే స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుంది. ఈ నేపథ్యంలో కొడంగల్ ప్రాంతంలో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో నిర్వహించడం వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలపై ఒకే వేదిక ద్వారా అవగాహన కల్పించే ప్రయత్నంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ముఖ్యమంత్రితో కలిసి పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారితో పాటు రాష్ట్ర మంత్రులు, సహచర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. పరిగి శాసనసభ్యులు, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్) డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి గారు కూడా ముఖ్యమంత్రితో కలిసి రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి సంబంధించిన ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. రైతులు, శాస్త్రవేత్తలతో ముఖ్యమంత్రి జరిపిన ముఖాముఖి చర్చలు ఈ కార్యక్రమానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చాయి. రైతు సంక్షేమం.. యువతకు ఉపాధి.. ప్రాంతీయ అభివృద్ధే అసలైన లక్ష్యం రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. వ్యవసాయానికి ఆధునిక సాంకేతికత తోడైతే పంటల దిగుబడులు, నాణ్యత పెరిగే అవకాశాలు ఉంటాయి. అదే సమయంలో పారిశ్రామిక రంగం విస్తరిస్తే యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ రెండు రంగాలు సమన్వయంతో ముందుకు సాగినప్పుడే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి దిశగా పయనించగలదు. కొడంగల్ నియోజకవర్గంలో నిర్వహించిన రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ఈ రెండు రంగాల ప్రాధాన్యతను చాటిచెప్పాయి. రైతులకు ఆధునిక సాగుపై అవగాహన కల్పించడం, శాస్త్రవేత్తల పరిశోధనలను వ్యవసాయ క్షేత్రాలకు అనుసంధానం చేయడం, పారిశ్రామిక అవకాశాలను ప్రజలకు పరిచయం చేయడం వంటి అంశాలు ఈ కార్యక్రమంలో ప్రధానంగా నిలిచాయి. మొత్తంగా కొడంగల్‌లో నిర్వహించిన రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో కార్యక్రమం వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, యువత ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టిని ఆకర్షించింది. రైతు సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి దిశగా ఇలాంటి కార్యక్రమాలు మరింత ఉపయోగకరంగా నిలవాలని ప్రజలు ఆశిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి పాల్గొన్న వికారాబాద్ జిల్లా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి జిల్లా ఐపీఎస్ స్నేహమేరా వికారాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంసీ ఆధ్వర్యంలో సైబరాబాద్‌లో ఆరు కీలక అభివృద్ధి కార్యక్రమాలు

వర్క్ ఫ్రమ్ పార్క్, సివిక్ పనుల్లో పారదర్శకత, చైల్డ్ ఫ్రెండ్లీ సిటీ

కొబ్బరి వ్యర్థాల రీసైక్లింగ్‌కు ప్రత్యేక చర్యలు





సైబరాబాద్, నవంబర్ 07 (లోకల్ గైడ్ ప్రతినిధి బి ఎన్ చంద్ర): సైబరాబాద్‌ను పచ్చదనం, మెరుగైన రవాణా, పారదర్శక పాలన, ఆర్థికంగా బలోపేతం, పిల్లలకు అనుకూలమైన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆరు కీలక కార్యక్రమాలను చేపడుతోంది. ఈ మేరకు నవంబర్ 2026 మీడియా సమావేశంలో అధికారులు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది సైబరాబాద్ పరిధిలో 300 కొత్త పార్కులను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా మియాపూర్ జోన్‌లోని మాధవ హిల్స్ కాలనీ, మసీద్ బండలో సుమారు 1.5 ఎకరాల పార్కులో 700 చదరపు గజాల విస్తీర్ణంలో వర్క్ ఫ్రమ్ పార్క్ ఏర్పాటు చేయనున్నారు. మాదాపూర్‌లోనూ మరో ప్రాంతాన్ని గుర్తించి డిజైన్లు సిద్ధం చేశారు. ఉచిత వైఫై, విద్యుత్ సదుపాయం, సీసీ కెమెరాలు, కూర్చునే ఏర్పాట్లు, కాఫీ కియోస్క్ అందుబాటులో ఉంటాయి. నగరంలో చేపట్టే ప్రతి సివిక్ పనికి వర్క్ సైట్ బోర్డులు ఏర్పాటు చేసి బడ్జెట్, కాంట్రాక్టర్ వివరాలు, పనుల గడువు, అధికారుల ఫోన్ నంబర్లు, క్యూర్‌వన్ యాప్ క్యూఆర్ కోడ్‌ను పొందుపరచనున్నారు. ప్రజలు పనుల నాణ్యతపై ఫిర్యాదులు చేయవచ్చు. శేరిలింగంపల్లి వెంకటేశ్వర కాలనీ ఆర్ యుబి సమీపంలో బాక్స్ డ్రెయిన్, సీసీ రోడ్డు పనులు రూ.46.31 లక్షలతో పూర్తయ్యాయి. "సైబరాబాద్ అభివృద్ధికి అంతర్జాతీయ ప్రమాణాలు" నవంబర్ 26 నుంచి 28 వరకు టీ-హబ్‌లో సైబరాబాద్ మూవ్స్-2026 పేరుతో మూడు రోజుల మొబిలిటీ సింపోజియం నిర్వహించనున్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ పోలీసులు, ఎన్సీ ఎస్సీ సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో రవాణా, ట్రాఫిక్, పాదచారుల భద్రతపై చర్చించనున్నారు. ఇక ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ సంస్థ నవంబర్ 5న సీఎంసీకి ఐఎన్ డి ఏ+ స్థిరమైన అవుట్‌లుక్‌తో క్రెడిట్ రేటింగ్ కేటాయించింది. ఆర్థిక నిర్వహణ, ఆదాయ వనరులు, ఆస్తిపన్ను వసూళ్లు, ఆదాయ మిగులు వంటి అంశాలను గుర్తించింది. యూనిసెఫ్ ఇండియాతో కలిసి చైల్డ్ ఫ్రెండ్లీ సిటీ కార్యక్రమాన్ని చేపట్టి పిల్లలను జూనియర్ సిటిజన్లుగా గుర్తించి నగర అభివృద్ధిలో వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కొబ్బరి వ్యర్థాల నిర్వహణలో భాగంగా 644 మంది విక్రయదారులను నమోదు చేసి, 9 రీసైక్లర్లతో పాటు 12 ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. నవంబర్ 1 నుంచి 6 వరకు మొత్తం 3,235 కొబ్బరి వ్యర్థాలను సేకరించారు. నవంబర్ 8 నుంచి మూడో విడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. వ్యర్థాలను రీసైక్లింగ్ ద్వారా ముడిసరుకుగా వినియోగించడమే లక్ష్యంగా సీఎంసీ చర్యలు చేపడుతోంది.

ఆదర్శ ఉపాధ్యాయుడు రాములు అస్తమయం.

విశ్రాంత ఉపాధ్యాయుడు రాములు మృతి పెద్ద ఎలికిచర్లలో విషాద ఛాయలు.

వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన తెలుగు పండితుడికి కన్నీటి నివాళి.





జిల్లేడు చౌదరిగుడ, నవంబర్ 7 (లోకల్ గైడ్): ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారి జీవితాల్లో వెలుగులు నింపి మార్గదర్శకులుగా నిలిచిన ప్రముఖ తెలుగు పండితులు రాములు ఇకలేరన్న వార్త పెద్ద ఎలికిచర్ల గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎన్నో ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తికి అంకితమై, అక్షర జ్ఞానంతో పాటు జీవిత విలువలను బోధించిన ఆయన మృతి విద్యారంగానికి, ఆయన శిష్యులకు, సన్నిహితులను తీవ్ర విషాదాన్ని నింపింది. రాములు సార్ ఇంద్రానగర్‌లోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిన నింగికెగిసిన ఉత్తమ ఉపాధ్యాయుడు అయన. ముఖ్యంగా తెలుగు భాషపై ఆయనకున్న అపారమైన పట్టు, ప్రావీణ్యం, బోధనా నైపుణ్యం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకునేవి. పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ, విద్యార్థుల్లో భాషపై ఆసక్తిని పెంపొందించడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. పెద్ద ఎలికిచర్ల గ్రామానికే పరిమితం కాకుండా చుట్టుపక్కల గ్రామాలు, మండలాల్లోనూ ఆయనకు మంచి పేరు, గౌరవం ఉండేవి. ఆయన వద్ద విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును తలుచుకుంటూ ఆయన సేవలను ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు. విద్యార్థుల గుండెల్లో చెరగని ముద్ర! ఉపాధ్యాయుడిగా క్రమశిక్షణ, నిబద్ధత, నిస్వార్థ సేవలకు ఆయన ప్రతిరూపంగా నిలిచారు. పాఠశాలలో విద్యాబోధన సమయంలోనే కాకుండా, భోజన విరామ సమయాల్లోనూ సహచర ఉపాధ్యాయులతో ఎంతో ఆప్యాయంగా, ఆనందంగా గడిపేవారని ఆయన సమకాలీనులు గుర్తుచేసుకుంటున్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం, ఆత్మీయత, సహృదయత ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ఉద్యోగ విరమణ అనంతరం స్వగ్రామమైన పెద్ద ఎలికిచర్లలోనే ఉంటూ వ్యవసాయ పనులను కొనసాగిస్తూ సాధారణ జీవితం గడిపారు. ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నవంబర్ 6న తుదిశ్వాస విడిచినట్లు తెలిసింది. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సన్నిహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గురువు మరణించినా.. ఆయన నేర్పిన అక్షరం చిరంజీవి! ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠాలు మాత్రమే బోధించడు. తన విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తాడు. అలాంటి బాటసారిగా, వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో అక్షర దీపాలు వెలిగించిన రాములు గారు భౌతికంగా దూరమైనప్పటికీ, ఆయన నేర్పిన విద్య, ఆయన అందించిన సంస్కారం, ఆయన జ్ఞాపకాలు విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. రాములు సార్ కుటుంబ నేపథ్యం.... మిద్దెల రాములు గౌడ్ కు నలుగురు కుమారులు ఓ కూతురు ఉన్నారు. వీరిలో ఇద్దరు కుమారుడు మృతి చెందారు. ఆయన జీవితం ఆదర్శవంతమంది.ఆయన మృతి పట్ల పెద్ద ఎలికిచర్ల గ్రామ ప్రజలు, పరిసర మండలాల ప్రజలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నారు. రాములు గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నారు. నా గురువుకు అక్షర నివాళి నేను కూడా రాములు గారి శిష్యుడినే. ఆయన వద్ద విద్యాభ్యాసం చేసిన విద్యార్థిగా, ఆయన బోధించిన పాఠాలు, నేర్పిన క్రమశిక్షణ, అందించిన మార్గదర్శకత్వం నా జీవితంలో ఎప్పటికీ చెరగని జ్ఞాపకాలు. గురువు అంటే కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదు, జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి అని నా గురువు రాములు గారిని చూస్తే అర్థమవుతుంది. నాకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు నేడు మన మధ్య లేరన్న విషయం ఎంతో బాధాకరం. ఆయన భౌతికంగా మనకు దూరమైనా, ఆయన నేర్పిన అక్షరాలు, ఆయన అందించిన జ్ఞానం, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ నాతోనే ఉంటాయి. నా గురువుకు హృదయపూర్వక అక్షర నివాళులు అర్పిస్తున్నాను.--- చిలకమర్తి రాంరెడ్డిఎలుకగూడెం గ్రామం సీనియర్ జర్నలిస్ట్‌తెలంగాణ స్టేట్ న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుఎడిటర్ -- లోకల్ గైడ్ దినపత్రికసభ్యులు -- రంగారెడ్డి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

ఎండిపోయిన వరి పొలాల పరిశీలించిన ఏ ఈ ఓ భబిత



కామారెడ్డి జిల్లా (లోకల్ గైడ్) : జగదాంబ తాండా గ్రామంలో ఎల్నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడంతో నీటి లభ్యత లేక ఎండిపోయిన వరి పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారినీ బబిత క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా పంట నష్టానికి గల కారణాలను పరిశీలించి, రైతుల నుంచి వివరాలు సేకరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయం గా రబీలో ఆరుతడి పంటలను వేసుకోవాలని పంటలు పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, లతా బాయ్ నంద నాయక్, ఉప సర్పంచ్ పూర్ణ రాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.ం

దీపావళి వేళ ప్రధాని మోదీ కీలక సందేశం..
ఈ ఏడాది ఎవరితో పండుగ జరుపుకోనున్నారో తెలుసా





దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దీపాల పండుగ దేశమంతటా వెలుగులు నింపుతోందని, చీకటిపై వెలుగు సాధించే విజయానికి దీపావళి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రజలందరూ ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దీపాల పండుగ దేశమంతటా వెలుగులు నింపుతోందని, చీకటిపై వెలుగు సాధించే విజయానికి దీపావళి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రజలందరూ ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. ప్రతి ఒక్కరిలాగే తాను కూడా దీపావళిని ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటానని తెలిపారు. అయితే, ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికులతో కలిసి దీపావళి జరుపుకోనున్నట్లు వెల్లడించారు. దేశ రక్షణ కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్న సైనికులను కలవడం తనకు ప్రత్యేకమైన అనుభూతి అని చెప్పారు. సైనికులను పరామర్శించడం తన దినచర్యలో భాగమని, ఈ సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తానని మోదీ స్పష్టం చేశారు. దేశ సైనికులు ఎంతో ధైర్యసాహసాలతో సరిహద్దులను కాపాడుతున్నారని, వారి సేవలు దేశ ప్రజలకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. తన వీడియో సందేశంలో 'నమస్కారం' అంటూ దేశ ప్రజలకు దీపావళి శు భాకాంక్షలు తెలియజేసిన ప్రధాని.. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని వివరించారు.ప్రధాని మోదీ ప్రతి ఏడాది దీపావళి సందర్భంగా సరిహద్దుల్లో విధులు నిర్వహించే సైనికులను కలుసుకుని వారితో పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. ఈసారి కూడా సైనికులతో దీపావళి జరుపుకోనున్నట్లు ప్రకటించడంతో ఆయన సందేశం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశ రక్షణలో సైనికుల త్యాగాలను గుర్తుచేస్తూ వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

ఇరాన్‌లో వైమానిక రక్షణ
వ్యవస్థపై అమెరికా దాడులు.. ట్రంప్ కీలక ప్రకటన!

ఖేష్మ ద్వీపంలోని ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థపై అమెరికా దాడులు

దాడులను ట్రంప్ పరిమిత సైనిక చర్యగా అభివర్ణన

సూజా ప్రాంతంలో రెండు క్షిపణులు పడినట్లు ఇరాన్ మీడియా వెల్లడి

అమెరికా డ్రోన్‌ను కూల్చినట్లు ఇరాన్ సైన్యం ప్రకటన

అమెరికా దిగ్బంధనం, ఆంక్షల ఎత్తివేతకు ఇరాన్ డిమాండ్



ఇరాన్‌పై అమెరికా మరోసారి పరిమిత స్థాయిలో సైనిక దాడులు చేపట్టింది. హర్మూజ్ జలసంధికి సమీపంలోని ఇరాన్ కీలక ద్వీపం ఖేష్మలో వైమానిక రక్షణ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ ఇటీవల ఏర్పాటు చేసిన చిన్నపాటి విమాన విధ్వంసక వ్యవస్థను తమ దళాలు నిమిషాల వ్యవధిలోనే ధ్వంసం చేశాయని ఆయన తెలిపారు. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌కు చేరుకున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రకటించారు. అయితే దాడికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించలేదు. ఖేష్మ ద్వీపంలోని సూజా ప్రాంతంలో రెండు క్షిపణి దాడులు జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. ఈ దాడుల వల్ల జరిగిన నష్టంపై మాత్రం స్పష్టత లేదు. మరోవైపు, తమ వైమానిక రక్షణ దళాలు అమెరికాకు చెందిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను ఖేష్మ ద్వీపంపై అడ్డుకుని కూల్చివేసినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ఈ వాదనను అమెరికా ధ్రువీకరించలేదు. హర్మూజ్ జలసంధి ప్రాంతంలో ఇటీవలి రోజుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. సోమవారం ఖేష్మ, హెంగమ్ ద్వీపాలతో పాటు బందర్ అబ్బాస్ సమీపంలోనూ పేలుళ్లు సంభవించాయి. ఆ సమయంలో అమెరికా చేపట్టిన చర్యలను రక్షణాత్మక దాడులుగా పేర్కొంది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి ప్రాంతంలో సైనిక ఘర్షణలు తలెత్తడం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశముంది. మరోవైపు, ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని ట్రంప్ తెలిపారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ ఆసక్తిగా ఉందని, చర్చల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని చెప్పారు. అయితే ఏ అంశాలపై అంగీకారం కుదిరిందన్న వివరాలను వెల్లడించలేదు. ఇరాన్ మాత్రం అమెరికా తమపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని, ఆంక్షలను తొలగించాలని, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలని, యుద్ధ నష్టానికి పరిహారం చెల్లించాలని కోరుతోంది. దాడులు నిలిపివేయాలని కూడా డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్ దౌత్య ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అమెరికా-ఇరాన్ చర్చలు విఫలమయ్యాయంటూ వస్తున్న వార్తలను ఖతార్ తోసిపుచ్చింది. ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ఇరు దేశాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన సమాచారం అందించే వారికి 20 మిలియన్ డాలర్ల వరకు బహుమతి ఇస్తామని అమెరికా ప్రకటించింది. అణు కేంద్రాలు, పరికరాలు, సంబంధిత వ్యక్తుల వివరాలు అందించిన వారికి ఈ అవకాశం ఉంటుందని తెలిపింది.

పేదింట వెలిగిన దీపావళి దీపాలు..
రావోజీతండాలో సర్పంచ్ భూక్య బాలు ఆధ్వర్యంలో వేడుకలు!

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం..

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల హర్షం

కారేపల్లి, నవంబర్ 7 (లోకల్ గైడ్ న్యూస్): పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపుతోంది. ఒకప్పుడు సొంత ఇల్లు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలు నేడు ప్రభుత్వం అందిస్తున్న గృహాల్లో పండుగలు జరుపుకోవడం సంతోషకరమైన పరిణామం. ఈ క్రమంలో సింగరేణి మండలం రావోజీతండా గ్రామపంచాయతీ పరిధిలోని మునియా తండా, మల్లన్నగూడెం, రావోజీతండా ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల వద్ద దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన బానోతు బద్రు, వంకుడోత్ ఈరమ్మ, వంకుడోత్ సంధ్య శ్రీను, లాకావత్ బద్రి కుటుంబాల నూతన గృహాల్లో దీపావళి సంబరాలు నిర్వహించి, 'ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పోస్టర్‌ను ఆవిష్కరించారు. నూతన గృహాల్లో దీపాలు వెలిగించి పండుగ జరుపుకోవడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.

పేదల సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి బాటలో ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంక్షేమం, విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన వంటి పలు రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఖమ్మం జిల్లా మంత్రుల సహకారం, స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు చేరవేసే ప్రయత్నాలు గ్రామీణ ప్రాంతాల్లో చర్చనీయాంశంగా నిలుస్తున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, గృహ నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత కల్పించాలనే ఆకాంక్ష ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నిరుపేదలకు సొంతింటి భరోసా కల్పించడం అభినందనీయమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందినప్పుడే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రావోజీతండా గ్రామ సర్పంచ్ భూక్య బాలు, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదర్శ ఉపాధ్యాయుడు రాములు అస్తమయం.

విశ్రాంత ఉపాధ్యాయుడు రాములు మృతి పెద్ద ఎలికిచర్లలో విషాద ఛాయలు.

వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన (అక్షర జ్యోతి),తెలుగు పండితుడికి కన్నీటి నివాళి.

జిల్లేడు చౌదరిగుడ, నవంబర్ 7 (లోకల్ గైడ్): ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారి జీవితాల్లో వెలుగులు నింపి మార్గదర్శకులుగా నిలిచిన ప్రముఖ తెలుగు పండితులు రాములు ఇకలేరన్న వార్త పెద్ద ఎలికిచర్ల గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎన్నో ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తికి అంకితమై, అక్షర జ్ఞానంతో పాటు జీవిత విలువలను బోధించిన ఆయన మృతి విద్యారంగానికి, ఆయన శిష్యులకు, సన్నిహితులను తీవ్ర విషాదాన్ని నింపింది. రాములు సార్ ఇంద్రానగర్‌లోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిన నింగికెగిసిన ఉత్తమ ఉపాధ్యాయుడు అయన. ముఖ్యంగా తెలుగు భాషపై ఆయనకున్న అపారమైన పట్టు, ప్రావీణ్యం, బోధనా నైపుణ్యం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకునేవి. పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ, విద్యార్థుల్లో భాషపై ఆసక్తిని పెంపొందించడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.పెద్ద ఎలికిచర్ల గ్రామానికే పరిమితం కాకుండా చుట్టుపక్కల గ్రామాలు, మండలాల్లోనూ ఆయనకు మంచి పేరు, గౌరవం ఉండేవి. ఆయన వద్ద విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును తలుచుకుంటూ ఆయన సేవలను ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు.

ఉపాధ్యాయుడిగా క్రమశిక్షణ, నిబద్ధత, నిస్వార్థ సేవలకు ఆయన ప్రతిరూపంగా నిలిచారు. పాఠశాలలో విద్యాబోధన సమయంలోనే కాకుండా, భోజన విరామ సమయాల్లోనూ సహచర ఉపాధ్యాయులతో ఎంతో ఆప్యాయంగా, ఆనందంగా గడిపేవారని ఆయన సమకాలీనులు గుర్తుచేసుకుంటున్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం, ఆత్మీయత, సహృదయత ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి.ఉద్యోగ విరమణ అనంతరం స్వగ్రామమైన పెద్ద ఎలికిచర్లలోనే ఉంటూ వ్యవసాయ పనులను కొనసాగిస్తూ సాధారణ జీవితం గడిపారు. ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నవంబర్ 6న తుదిశ్వాస విడిచినట్లు తెలిసింది. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సన్నిహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.



ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠాలు మాత్రమే బోధించడు. తన విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తాడు. అలాంటి బాటసారిగా, వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో అక్షర దీపాలు వెలిగించిన రాములు గారు భౌతికంగా దూరమైనప్పటికీ, ఆయన నేర్పిన విద్య, ఆయన అందించిన సంస్కారం, ఆయన జ్ఞాపకాలు విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. రాములు సార్ కుటుంబ నేపథ్యం.... మిద్దెల రాములు గౌడ్ కు నలుగురు కుమారులు ఓ కూతురు ఉన్నారు. వీరిలో ఇద్దరు కుమారుడు మృతి చెందారు. ఆయన జీవితం ఆదర్శవంతమంది.ఆయన మృతి పట్ల పెద్ద ఎలికిచర్ల గ్రామ ప్రజలు, పరిసర మండలాల ప్రజలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నారు. రాములు గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నారు.

నేను కూడా రాములు గారి శిష్యుడినే. ఆయన వద్ద విద్యాభ్యాసం చేసిన విద్యార్థిగా, ఆయన బోధించిన పాఠాలు, నేర్పిన క్రమశిక్షణ, అందించిన మార్గదర్శకత్వం నా జీవితంలో ఎప్పటికీ చెరగని జ్ఞాపకాలు. గురువు అంటే కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదు, జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి అని నా గురువు రాములు గారిని చూస్తే అర్థమవుతుంది.నాకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు నేడు మన మధ్య లేరన్న విషయం ఎంతో బాధాకరం. ఆయన భౌతికంగా మనకు దూరమైనా, ఆయన నేర్పిన అక్షరాలు, ఆయన అందించిన జ్ఞానం, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ నాతోనే ఉంటాయి. నా గురువుకు హృదయపూర్వక అక్షర నివాళులు అర్పిస్తున్నాను.

--- చిలకమర్తి రాంరెడ్డి
ఎలుకగూడెం గ్రామం
సీనియర్ జర్నలిస్ట్
తెలంగాణ స్టేట్ న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు
ఎడిటర్ -- లోకల్ గైడ్ దినపత్రిక
సభ్యులు -- రంగారెడ్డి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ

మురసు తుఫాన్ నష్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష..

రేపటిలోగా నిత్యావసరాల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశం!

ఈ నెల 9లోగా పంట నష్టం అంచనాలు పూర్తి

ఉద్యాన పంటల నష్టం అంచనాలు 92 శాతం పూర్తి

తుపాను ప్రభావిత 1,825 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు

ఇప్పటివరకు 3.82 లక్షల కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

రైతుబజార్లలో కిలో ఉల్లిపాయలు రూ.35కే విక్రయం

రేషన్ దుకాణాల్లో తక్కువ ధరలకు పామాయిల్, కందిపప్పు, గోధుమ పిండి



మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, విద్యుత్ పునరుద్ధరణ, పంట నష్టం అంచనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ తదితర శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తుపాను బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ, తక్షణ ఆర్థిక సాయం అందించే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పంట నష్టం అంచనాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.దెబ్బతిన్న ఉద్యాన పంటలకు సంబంధించి 92 శాతం నష్టం అంచనాలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. వ్యవసాయ పంటల నష్టాల అంచనా ఈ నెల 9వ తేదీ నాటికి పూర్తవుతుందని తెలిపారు. గతంలో వచ్చిన అర్నబ్ తుపాను కారణంగా సుమారు 30 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. మురసు తుపాను ప్రభావిత 1,825 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 7,850 దెబ్బతిన్న స్తంభాలను బాగు చేసినట్లు తెలిపారు.తుపాను బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ కొనసాగుతోందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పారు. ఇప్పటివరకు 3.82 లక్షల కుటుంబాలకు సరకులు అందించినట్లు వెల్లడించారు. ఆదివారం నాటికి పంపిణీని పూర్తిచేస్తామని సీఎంకు తెలిపారు.మరోవైపు బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలపైనా చంద్రబాబు ఆరా తీశారు. ఉల్లిపాయలు, బియ్యం, పామాయిల్, గోధుమ పిండి, కందిపప్పు ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతుబజార్ల ద్వారా కిలో ఉల్లిపాయలను రూ.35కే విక్రయిస్తున్నామని అధికారులు తెలిపారు. ఇందుకోసం 8 వేల క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌లోకి తీసుకొచ్చినట్లు వివరించారు.బియ్యం ధరల నియంత్రణకు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో చర్చలు జరిపినట్లు అధికారులు చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో బీపీటీ సోనా, సాంబ, కేఎన్ఎం రకాల బియ్యాన్ని కిలో రూ.66కు, హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాలను రూ.76కు, జై శ్రీరామ్ రకాన్ని రూ.82కు, సాధారణ రకం బియ్యాన్ని రూ.47కు విక్రయించేందుకు వ్యాపారులు అంగీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన 204 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతుబజార్లలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.70 పలుకుతున్న బియ్యాన్ని రైతుబజార్లలో రూ.50కే విక్రయిస్తున్నామని చెప్పారు. బీపీటీ రకం బియ్యాన్ని కిలో రూ.49కు అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 150 కౌంటర్ల ద్వారా 27,430 క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయించగా.. 1.03 లక్షల కుటుంబాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రేషన్ దుకాణాల ద్వారా లీటరు పామాయిల్ రూ.125కు, కిలో కందిపప్పు రూ.100కు, గోధుమ పిండి రూ.25కు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDYPublished from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499